వాకిలి
గత వారం పుస్తకాలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

భారత్, అమెరికా బంధం ఏకపక్షమే: ట్రంప్
పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించిన బెల్జియం
5

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-9-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 214 పేజీలు: 10+4 వెల: 6.50



# జిఎస్టీలో ఇక 2 శ్లాబ్‌లే

## 90% నిత్యావసరాలన్నీ 5% శ్లాబ్‌లోకి




సిమెంట్, టివిలు 18%లోకి.. ప్రాణాధార, కేన్సర్ ఔషధాలపై నిల్

లగ్జరీ ఉత్పత్తులు, సిగరెట్, పొగాకుపై 40% పన్ను

జీవితబీమా, హెల్త్ పాలసీలు జిఎస్టీ నుంచి తొలగింపు

22 నుంచి కొత్త శ్లాబ్‌లు అమలులోకి

జిఎస్టీ మండలి సమావేశం అనంతరం ప్రకటించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** జీఎస్టీలో ప్రవేశపెట్టిన కొత్త సంస్కరణలు ఈనెల 22వ తేదీనుంచి అమలులోనికి రానున్నాయి. ఇకపై జీఎస్టీలో ఉన్న నాలుగు శ్లాబ్‌ల స్థానంలో కేవలం రెండే రెండు శ్లాబ్‌లు ఉంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. కేవలం 5శాతం, 18శాతం శ్లాబులు మాత్రమే ఉంటాయని వెల్లడించారు. దీనితో ఇప్పటివరకూ ఉన్న 12శాతం, 28శాతం శ్లాబ్‌లను రద్దుచేసామన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా

>>2



# స్థానిక సంస్థలకు మరింత ఊతం

బుధవారం రాష్ట్ర ఆర్థిక సంఘం సమావేశంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

ఆదాయార్జన ఆధారంగా పంచాయతీల కేటగిరీ

ఆర్థిక వనరులు పెంచుకొనేలా ప్రత్యేక కార్యాచరణ

5వ ఆర్థిక సంఘం సమావేశంలో సిఎం చంద్రబాబు

పంచాయతి రికార్డుల ఆన్‌లైన్‌కు డి.సిఎం సూచన

**విజయవాడ, సెప్టెంబర్ 3,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సాయంతో పాటు సొంత ఆదాయ వనరులు పెంచుకోవడం ద్వారా వేగంగా అభివృద్ధి సాధించడంపై అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. వెనకబడిన, తలసరి ఆదాయం తక్కువ ఉన్న స్థానిక సంస్థలను కేటగిరీలుగా విభజిం చాలని ఆదేశించారు. దీంతో వాటికి ప్రత్యేక సాయం అందించే వీలు కలుగుతుందన్నారు. స్థానిక సంస్థల వర్గీకరణ ప్రక్రియను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ఇందుకు అవసరమైన చట్టసవరణ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. బుధవారం సచివాలయంలో 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు ముఖ్యమంత్రితో సమావేశమ య్యారు. ఈ సమావేశంలో ఆర్థిక సంఘం సిఫారుసులను సీఎంకు అందజేశారు. స్థానిక సంస్థల బలోపేతానికి ఆర్థికఆర్థికేతర అంశాలపై ఆర్థిక సంఘం సిఫార్సులు చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ. పంచాయతీల అభి వృద్ధికి ఏటా నరేగా సహా వివిధ రూపాల్లో

>>2

# రాష్ట్రానికి మరో 53 వేల మె.ట యూరియా

-వ్యవసాయ శాఖ వెల్లడి

**విజయవాడ,సెప్టెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి మరో 53 వేల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ యూరియా కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం పోర్టులకు నౌకల ద్వారా చేరుకుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. యూరియా, డిఎపి, కాంప్లెక్స్ ఎరువుల విక్రయాలు ఈ ఏడాది గణనీయంగా పెరిగాయని తెలిపింది. కాకినాడ పోర్టుకు 17,154 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టుకు 9,200 మెట్రిక్ టన్నులు, గంగవరం పోర్టుకు 26,547 మెట్రిక్ టన్నులు యూరియా చేరుకుందని వెల్లడించింది. ఈ మొత్తంతో పాటు గత 10 రోజుల్లో 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరగా, వచ్చే 10 రోజుల్లో మరో 30 వేల మెట్రిక్ టన్నులు రానున్నట్లు తెలిపింది. దీంతో ఎరువుల సమస్య తలెత్తే అవకాశం లేదంది. ఖరీఫ్ సీజన్‌లో 5.65 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా అయినట్లు ప్రకటించింది. రానున్న రబీ సీజన్‌కు మరో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం సిద్ధం చేస్తుందని తెలిపింది. ఈ సీజన్‌లో మార్క్‌ఫెడ్ 2.72 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేసిందని చెప్పింది. గతేడాది ఈ మొత్తం 1.20 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందని వెల్లడించింది. గతంతో పోలిస్తే ఇది 78 శాతం అధికమని వ్యవసాయశాఖ పేర్కొంది.



కొండల మధ్యలో నీరు

# 'మహమ్మారి' గుప్పిట్లో ఓ గ్రామం విలవిల

## ఏ వీధిలో చూసినా భయాందోళనే

5 నెలల్లోనే 28 మంది మృత్యువాత




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

సత్వరమే నివేదిక ఇవ్వాలని అధికారులకు సర్కార్ ఆదేశం

గుంటూరు జిల్లా తురకపాలెంలో వెంటాడుతున్న వ్యధ

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 3:** కూలినాలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న బడుగుజీవుల పాలిట అంతుచిక్కని మహమ్మారి వెంటాడుతోంది. అయిదు నెలల క్రితం ఆనందంతో జీవనం సాగిస్తున్న ఆ ప్రజానీకం ఒక్కసారిగా కబళిస్తున్న ఈ వింత మహమ్మారితో ఒక్కసారిగా కకావికలమైంది. కొండ రాళ్ల కొట్టుకుని, రెక్కలు పిండి చేసి పూట గడిపూ ఆ కుటుంబాలను ఈ మహమ్మారి 5 నెలలుగా వెంటాడుతూ తీరని మిగులుస్తోంది. ఏ మాయదారి జబ్బో కానీ... తెలుసుకునే లోపే ఆ బడుగు జీవుల్లో 28 మంది మృత్యువాత పడటం కలచివేస్తోంది. బతుకుజీవుడా..అంటూ ఆ ప్రజలు ఇపుడు భయాందోళనలకు గురవుతూ రాష్ట్ర ప్రభుత్వ వైద్యసాయం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయిదు నెలలుగా బతుకులు జీవచ్ఛవాలతో మారిపోతున్న గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామ ప్రజలు ఈ మహమ్మారి బారిన పడుతూ అసులు బారుతున్నారు. ఒకరెంట ఒకరు మృత్యుఒడిలోకి చేరుతుండటంతో రేపు ఎవరో అంటూ విషాధ ఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. గుంటూరు రూరల్ మండలం పరిధిలోని తురకపాలెంలో అంతుచిక్కని మహమ్మారి వ్యాధి వెంటాడుతోంది. అయిదు నెలల్లోనే.... 28 మంది మృత్యుబారిన పడ్డారు. దీంతో నిత్యం ఆ గ్రామంలో భయం నీడ వెంటాడుతోంది. వైద్య రంగానికి కూడా సవాల్‌గా మారిన ఈ మహమ్మారి వ్యాధి కనుగొనులోపే మరెంతమంది ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందో..అంటూ భయాందోళనకు గురవుతున్నారు. కొంత కాలం క్రితం అస్వస్థతకు గురైన ఇద్దరు వ్యక్తుల నుంచి రక్తపరీక్షలు చేయగా, వారికి ఇన్ఫెక్షన్ మెలియాయి దోసిస్...అనే భయంకరమైన వ్యాధి సోకినట్టు తొలుత గుర్తించారు..కలుషితమైన నేల, నీటితో చర్మగాయాల ద్వారా గాలిలో వచ్చే కణాలను పీల్చటం ద్వారా ఈ వ్యాధి సంక్రమిచ్చవచ్చు. కలుషిత ఆహారం, నీటిని తీసుకోవటం ద్వారా ప్రజలు ఈ వ్యాధి భారిన పడినట్టు



బ్యాక్టీరియా కణాలు

>>2



# జెపి వెంచర్స్‌కు 'సుప్రీం'లో షాక్

**విజయవాడ,సెప్టెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీలో ఇసుక తవ్వకాలు జరిపిన జేపీ వెంచర్స్‌కు సుప్రీంకోర్టు బుధవారం షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు ఎన్జీటి విధించిన రూ. 18 కోట్ల జరిమానాను రెండు వారాల్లో డిపాజిట్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే జేపీ వెంచర్స్‌పై ఎన్జీటి విధించిన జరిమానాపై గతంలో విధించిన స్టేను సుప్రీంకోర్టు తొలగించింది. అలాగే అక్రమ ఇసుక తవ్వకాలపై న్యాయపోరాటం చేస్తున్న దండా నాగేంద్ర కుమార్ దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఈ సందర్భంగా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో అక్రమ తవ్వకాల విస్తీర్ణానికి.. దండా నాగేంద్ర కుమార్ దాఖలు చేసిన అఫిడవిలో ఉన్న అక్రమ తవ్వకాల విస్తీర్ణానికి మధ్య ఉన్న తేడాను సుప్రీంకోర్టు ఈ సందర్భంగా

>>2



# సమృద్ధిగా ఎరువు నిల్వలు

రవాణాను అడ్డుకొంటూ డ్రామాలాడుతున్న వైఎస్సార్సీ

వారి రాజకీయ ఉచ్చులో పడొద్దు

మీడియా సమావేశంలో పిపిపి ఇచ్చిన సిఎం చంద్రబాబు

**విజయవాడసెప్టెంబర్ 3,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వంపై అన్నివిషయాల్లోనూ ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ... ఎరువుల విషయంలోనూ అదే తరహా దుష్ప్రచారాన్ని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మండిపడ్డారు. విషవృక్షం లాంటి వైసీపీ చేసే దుష్ప్రచారాల్లో భాగంగా... మరో ఫేక్ స్టోరీని ప్రచారం చేస్తోందన్నారు. యూరియా, ఎరువుల కొరత ఉందని దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ పార్టీ, నేరాలను నమ్ముకున్న పార్టీ, విషపు విత్తనాలను చల్లుతోందని చంద్రబాబు విమర్శించారు. ఎరువుల లభ్యత.. సరఫరాపై రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వ హించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల వారీగా ఎరువుల సరఫరా లెక్కలను చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఈ ఖరీఫ్ సీజనులో ఓపెనింగ్ బ్యాలెన్సుతో కలిపి 6.65 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశాం. బుధవారం నాటికి 94,892 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఇది కాకుండా గత 10 రోజుల్లో సుమారు 28 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశాం. వచ్చే 10 రోజుల్లో 30 వేల టన్నులు సరఫరాకు అందుబాటులోకి రానుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మరో 53 వేల టన్నుల కేటాయింపులు

>>2

# 'పి-4' మార్గదర్శకులకు ఆదాయం పన్ను రాయితీ




రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

**విజయవాడ,సెప్టెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** పి4 కార్యక్రమానికి సహకరించే మార్గదర్శకులకు ఆదాయపు పన్ను రాయితీ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విరాళాలకు వర్తింపచేసే 80జి సెక్షన్ను ఈ పథకానికి కూడా వర్తింపచేయాలని నిర్ణయించింది. పి4 అమలు చేసే విభాగాన్ని కూడా రిజిస్టర్ చేయడం వల్ల బంగారు కుటుంబాలకు సాయం చే సేందుకు ముందుకొచ్చే వారికి కూడా ఈ సెక్షన్ వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ సెక్షన్ ద్వారా విరాళాలు అందించే వారు, చెక్కులు, డ్రాఫ్టుతోపాటు నేరుగా నగదును కూడా అందించి, వాటిపై పి4ని ర్వాహక సంస్థ ఇచ్చే రసీదులను ఆదాయపు పన్ను శాఖకు ఇవ్వడం ద్వారా 80జి సౌకర్యాన్ని పొందవచ్చు. అయితే నగదు రూపంలో సాయం అందించేవారు కనిష్టంగా రెండు వేల రూపాయలను అందించాల్సి ఉంటుంది. ఇక సాయం చేసే వారికి 80జి ద్వారా 50 నుంచి 100 శాతం వరకు ఆదాయపు పన్ను రాయితీ లభిస్తుంది. పి4 కింద ముందుకొచ్చే మార్గదర్శులను మరింతగా ఆకర్షించేందుకు ఆదాయపు పన్ను రాయితీ తాయిలాన్ని కూడా ప్రకటించినట్లు సమాచారం. అయినా.. అంతంతమాత్రమే..! ఈ నిర్ణయం తీసుకోవడంతో పాటు, మార్గదర్శకులుగా గతంలోనే గుర్తించిన పలువురికి ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం ఇప్పటికే తెలియచేసినట్లు సమాచారం. అయినా, ఆశించిన స్థాయిలో స్పందన కనిపించ డం లేదని అధికారులు చెబుతున్నారు. 20 లక్షల కుటుంబాలను ఆదుకోవాలంటే ప్రభుత్వ అంచనా మేర కు కనీసం 10 లక్షల మంది మార్గదర్శులు కావాలన్నది ప్రభుత్వ అంచనా! ఇప్పటి వరకు వీరిలో సగం ్నమది కూడా సమకూరలేదని ఒక అధికారి చెప్పారు.

# 365 రోజులూ నేతన్నకు ఉపాధి



ఇంటి ముంగిటకే చేనేత వస్త్రాలు

ఇ-కామర్స్‌లో ఆప్కో అమ్మకాల జోరు

పెరుగుతున్న చేనేత వినియోగం: మంత్రి సవిత

**విజయవాడ,సెప్టెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాకతో చేనేతకు మహర్దశ ప్రారంభమైందని మంత్రి సవిత తెలిపారు. నేతన్నల అభివృద్ధికి ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ ప్రభుత్వం సదుపాయం కల్పిస్తోందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోనూ, జాతీయ స్థాయిలోనూ చేనేత బజార్లు ఏర్పాటు చేయిస్తోంది. అదే సమయంలో ఆప్కో ద్వారా అమ్మకాలు పెంచేలా చర్యలు చేపట్టింది. వినియోగదారులకు చేనేత దుస్తులను మరింత చేరువ చేయడానికి ఆప్కో ద్వారా డోర్ డెలివరీ సదుపాయం కల్పించింది. అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి ఈ కామర్స్ సంస్థల ద్వారా అమ్మకాలు ప్రారంభించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 40 ఆప్కో షోరూమ్ లను సిద్ధం చేసింది. నేటితరం అభిరుచులకు అనుగుణంగా ప్రపంచ ప్రఖ్యాతగాంచిన పోచంపల్లి, ధర్మవరం, మంగళగిరి పట్టు చీరలతో పాటు రెడీమేడ్ దుస్తులను కూడా ఆప్కో షో రూమ్ లతో పాటు ఆన్ లైన్ లోనూ ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. యువత, మహిళ, చిన్న పిల్లలు. ఇలా వర్గాల వారిని ఆకట్టుకునేలా చేనేత రెడీమేడ్ దుస్తులను ఆన్ లైన్, ఆఫ్ లైన్‌లో అందుబాటులో ఉంచింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఈ కామర్స్ దే హవా. ఇంటి దగ్గర నుంచే ఇంటికి, తమకు అసవరమైన వస్తువులు, సరకులను ఈ కామర్స్ ద్వారా వినియోగదారులు కొనుగోలు చేసుకుంటున్నారు. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా, నేతన్నలు నిలదొక్కుకోడానికి ఈ

>>2

# డిగ్రీ ఉంటేనే 'శ్రీవారిసేవ'!

తిరుమలేశుని సన్నిధితో పాటు స్విమ్స్, బర్డ్ ఆసుపత్రుల్లోను వలంటీర్ల సేవలు

బ్రాండెడ్ హోటళ్లకు క్యాంటీన్ల నిర్వహణ: టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు



బుధవారం తిరుమలలో మీడియాతో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు

**తిరుమల, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలలోని అన్ని విభాగాల్లో భక్తులకు ఇతోదిక సేవలందిస్తున్న శ్రీవారిసేవకులు మరింత మెరుగైన సేవలందించే దిశగా శిక్షణ ఇస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. శ్రీవారిసేవ చేయాలనుకునే వారికి కనీసం డిగ్రీ విద్యార్హతగా నిర్ణయించామని, వారికి తిరుమలలో మూడరోజులు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఒకరోజు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలమేరకు తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రి, బర్డ్,ఆయుర్వేద ఆస్పత్రుల్లో వైద్యసేవలకు వాలంటరీ సర్వీసెస్‌ను అమలుచేయనున్నట్లు ఛైర్మన్ నాయుడు వెల్లడించారు. బుధవారం సాయంత్రం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఇఒశ్యామలరావు, అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ మీడియాతో మాట్లాడారు. శ్రీవారిసేవ ప్రారంభించి 25 సంవత్సరాలు కావస్తోందన్నారు. దాదాపు 17లక్షలమంది శ్రీవారి సేవకులు స్వచ్ఛందంగా శ్రీవారిసేవలోపాల్గొన్నారన్నారు. రోజుకు 3,500మంది వరకు సేవకులు సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ శ్రీవారి దర్శనార్థం లక్షమంది వరకు భక్తులు వస్తున్నారని, వారికి

>>2

# దారి మళ్లిన సొమ్ముపై ఎసిబి కోర్టుకు సిట్

మద్యం కుంభకోణం కేసు:

**విజయవాడ,సెప్టెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ హయాంలో మద్యం కుంభకోణంలో రూ. 3,500 కోట్ల ముడుపుల సొమ్మును ఎలా దారి మళ్లించారో ఆ వివరాలను సిట్ పట్టిక రూపంలో కోర్టుకు అందచేసింది. ఈ కేసును విచారిస్తున్న విజయవాడలోని ఏసీబీ కోర్టు...సిట్ వేసిన ఛార్జిషీట్ల లోని వివిధ అంశాలపై వివరణ కోరిన సంగతి తెలిసిందే. అభియోగపత్రాల్లోని 21 అంశాలపై న్యాయాధికారి కోరిన వివరాలను సిట్ అధికారులు కోర్టుకు సమర్పించారు. కేసుకు సంబంధించి ఫోరెన్సిక్

>>2



న్యూఢిల్లీలోని యశోభూమిలో బుధవారం జరిగిన 'సెమికాన్ ఇండియా 2025'లో ప్రదర్శనను తిలకిస్తున్న ప్రధాని మోడీ

# ఓ గ్రామం విలవిల

>> వైద్యాధికారులు భావిస్తున్నారు. అరుదుగా ఉన్నప్పటికీ శరీర ద్రవాలతో బహిరంగ గాయాలతో ప్రత్యక్ష సంబంధం ద్వారా మిలిలోయి డ్రోసిస్ ప్రజల మధ్య వ్యాపిస్తునందని అంటున్నారు.

**ఇది ఎలా వ్యాపిస్తుంది?**

నేల, నీటితో సంపర్కం: బటిలెర్చివో సూడో మల్లీ అనే బ్యాక్టీరియా ఉష్ణమండలం, ఉప ఉష్ణమండలం ప్రాంతాల్లో నేల, నీటిలో కన్పిస్తుంది ఈ బ్యాక్టీరియా, పీల్చటం, కలుషితమై ధూళి, హేరో సోల్‌లను పీల్చటం ద్వారా ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్ ఏర్పడుతుంది. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవటం, కలుషితమైన నీటిని సేవించటం వల్ల ఇన్ఫెక్షన్ కారణమవుతుంది. కలుషితమైన నీరు, చర్మ గాయాల ద్వారా మట్టితో ప్రత్యక్ష సంబంధం వంటి అంశాలపై ఈ బ్యాక్టీరియాకు సంక్రమణ మార్గంగా చెబుతున్నారు. అరుదుగా మనుషుల నుంచి ఇతరులకు సోకుతుంది. అరుదుగా ఉన్నప్పటికీ ఇది సోకిన శరీర ద్రవాలు, గాయాలతో సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది.

బర్కోలేర్బిరియా చురోమాలి అనే బ్యాక్టీరియా ద్వారా సంక్రమించే ఈ వ్యాధి బిపి, షుగరు, కిడ్నీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్థులకు త్వరగా సోకుతుందని వైద్యులు పేర్కొన్నారు. ఈ జబ్బు వల్ల జ్వరం వచ్చి ప్రాణాలు పోయే ఆస్కారం ఉంది.

**నివారణ చిట్కాలు:**

ఏవైనా కోతలు, పుండ్లను వాటర్ ప్రూఫ్ డ్రస్సింగ్‌తో కప్పాలి. మట్టిలో, బురదనీటిలో ఆరుబైట పనిచేసేటపుడు బూట్లు, చేతి గ్లౌజులు తప్పనిసరిగా ధరించాలి. బయట పని నుంచి వచ్చిన తర్వాత స్నానం చేయాలి. పచ్చిక బైళ్లను కప్పరించేటపుడు గాలిలో బ్యాక్టీరియాను పీల్చకుండా ఉండటానికి నేల చుట్టూ అధిక స్ప్రేలను ఉపయోగించేటపుడు ముసుగులు, మాస్కులు తప్పనిసరిగా ధరించాలి.

ఈ కుగ్రామంలో ప్రభలిన ఈ అంతు చిక్కని మహమ్మారిని పారద్రోలిచ భయాందోళన నుంచి తమకు విముక్తి కల్పించాలని ఆ కుగ్రామ ప్రజలు ఏకరువు పెడుతున్నారు. అయిదు నెలల కాలంలో అంతుచిక్కని వ్యాధితో 28 మందిని కబళించిన ఈవ్యాధి ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాఖ అధికారులను ఆదేశించింది. ఏది ఏమైనా ఆ కుగ్రామంలో వెంటాడుతున్న భయం నీడ తొలగిపోయేలా అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నేతన్నకు ఉపాధి

>> కామర్స్ లోకి రాష్ట్ర ప్రభుత్వం అడుగుపెట్టింది. చీరలు, దోతీలతో పాటు రెడీమేడ్ చేనేత వస్త్రాలను ఈ కామర్స్ లో లభించేలా విక్రయాలు ప్రారంభించింది. నేరుగా ఇళ్ల వద్దకే చేనేత వస్త్రాలను డోర్ డెలివరీ చేసేలా వ్యవస్థను రూపొందించింది. చాలా తక్కువ కాలంలోనే ఆన్ లైన్ ద్వారా రూ.45 లక్షల విలువైన చేనేత వస్త్రాలు అమ్మకాలు జరిగాయి. ఈ అమ్మకాలను మరింత పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కామర్స్ లో చేనేత వస్త్రాల లభ్యతపై విశేష ప్రచారం ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆప్కో ద్వారా చేనేత అమ్మకాలు జరుగుతున్నాయి. రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా 92 ఆప్కో షో రూమ్ లున్నాయి. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత పుట్టపర్తి, ప్రొద్దుటూరు, టెక్కలి, ఎమ్మిగనూరు, అనకాపల్లిలో అయిదు షో రూమ్ లను ప్రారంభించింది. చేనేత వస్త్రాల వినియోగంపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి అనుగుణంగా 40 ఆప్కో షో రూమ్ ల ద్వారా ఆన్ లైన్ లో చేనేత వస్త్రాల అమ్మకాలను ప్రారంభించింది. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, జియో మార్ట్ వంటి ఈ కామర్స్ సంస్థలకు ఈ 40 ఆప్కో షో రూమ్ లను అనుసంధానం చేసింది. చేనేత అనగానే అందరికీ గుర్తుకొచ్చేది చీరలు, తువాళ్లు, లుంగీలు, దుప్పట్లు, షర్ట్ బిట్లు. ప్రస్తుత తరం అభిరుచులకు అనుగుణంగా, అన్ని వర్గాల వారికి నచ్చేలా నూతన డిజైన్లతో రెడీమేడ్ చేనేత వస్త్రాలను తయారు చేసి, అమ్మకానికి పెట్టింది. ఇందుకోసం పలువురు డిజైనర్లను సైతం ప్రభుత్వం నియమించింది. వధూ వరులకు అవసరమైన దోతీలు, మోడి జాకట్లు, చీరలు, షర్టులు, లెనిన్ షర్ట్ లతో పాటు నేటి యువతను ఆకట్టుకునేలా కుర్తాలు, షార్ట్ కుర్తాలను సైతం అమ్మకాలు చేస్తున్నారు.

చిన్న పిల్లలకు కూడా సరిపడేలా గౌన్లు, ఇతర దుస్తులను కూడా కొత్త కొత్త డిజైన్లతో సిద్ధం చేసి విక్రయాలు చేస్తోంది. కలంకారీ చీరలు, పెన్ కలంకారీ చీరలు, డిజిటల్ ప్రింటెడ్ చీరలు, ఎంబ్రాయిడింగ్ చీరలను కూడా ఆప్కో షో రూమ్ లతో పాటు ఆన్ లైన్ లోనూ విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ కామర్స్ లో చేనేత వస్త్రాల లభిస్తుండడంతో, విక్రయాలు ఘణనీయంగా పెరిగాయి. దీంతో చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ పెరిగి, నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తోంది. నేతన్నలు గౌరవప్రదమైన జీవనం సాగించడంతో 365 రోజులూ వారికి ఉపాధి కల్పించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యం. నేతన్నలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే...మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పనతో చేనేత రంగంలో ఉత్సాహం నెలకొంది. చేనేత ఉత్పత్తుల విక్రయాల పెంపుదలకు కో ఆప్టెక్స్, టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్ తో ఒప్పందాలు చేసుకున్నాం. ముఖ్యంగా ఈ కామర్స్ లో దిగ్గజ సంస్థలైన ఫ్లిప్ కార్ట్, అమెజాన్, జియో మార్ట్, ఓఎన్డీసీ ద్వారా ఆన్ లైన్ లో చేనేత దుస్తుల అమ్మకాలను ప్రారంభించాం. నేటి తరం అభిరుచులకు అనుగుణంగా రెడీమేడ్ చేనేత వస్త్రాలను తయారు చేయించి, ఆప్కో షో రూమ్ లతో పాటు ఆన్ లైన్ లోనూ అమ్మకాలు చేస్తున్నాం. నేతన్నలకు రెడీమేడ్ దుస్తుల కోసం అవసరమైన మెటీరియల్ తయారీపై శిక్షణ సైతం అందజేస్తోంది. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా చేనేత అమ్మకాలు ఊపందుకున్నాయి.

# దారి మళ్లిన సొమ్ముపై ఎసిబి కోర్టుకు సిట్

>> నివేదికలను జత చేశారు. నిందితుల జాబితాలో చేర్చిన పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు, వారి పేర్లనూ అందించారు. ఈ కేసులో 1988 అవినీతి నిరోధక చట్టం లోని సెక్షన్లు ఎలా వర్తిస్తాయో వివరణలో పేర్కొన్నారు. సీఆర్‌పీసీ 161,164 సెక్షన్ల కింద పోలీసులు విచారించిన సాక్షుల జాబితాను, నిందితులకు వర్తించే సెక్షన్లను వేర్వేరుగా ఇచ్చారు. కేసు నమోదైనప్పటి నుంచి ఇప్పటి వరకు అరెస్టైన నిందితుల వివరాలతో పాటు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వారి వివరాలను కోర్టుకు అందచేశారు.

# జెపి వెంచర్స్‌కు 'సుప్రీం'లో షాక్

>> గుర్తించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున దండా నాగేంద్ర కుమార్ ఇచ్చిన అఫిడవిట్‌లోని అంశాలను పరిశీలించి స్పష్టమైన అఫిడవిట్‌ను మరోసారి దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ అంశాన్ని పర్యవేక్షించాలంటూ కేంద్ర పర్యావరణ, అటవీశాఖకు సుప్రీంకోర్టు సూచించింది. ఇసుక అక్రమ తవ్వకందారుల నుంచి రికవరీ అంశం ఎంత వరకు వచ్చిందంటూ సుప్రీంకోర్టు ప్రశ్నించింది. వారిని సైతం ఇందులో ప్రతివాదులుగా చేరుస్తూ సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇక జరిమానా చెల్లించకుండా హైకోర్టుకు వెళ్లిన అక్రమ ఇసుక దారులకు సంబంధించిన కేసులో త్వరిత గతిన తీర్పును వెల్లడించాలని హైకోర్టుకు సుప్రీం కీలక సూచన చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

# పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు రూ.1,120 కోట్లు విడుదల

**విజయవాడ,సెప్టెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ పంచాయితీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను సెప్టెంబరు మొదటి వారంలో విడుదల చేస్తామన్న హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నిలబెట్టుకున్నారు. రూ.1,120 కోట్ల నిధులను పంచాయితీలు,జిల్లా,మండల పరిషత్తులకు మంగళవారం విడుదల చేశారు. వాటి బ్యాంకు ఖాతాలకు బుధవారం నిధులు జమకానున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెండో విడత రూ.1,120 కోట్ల విడుదలలో జాప్యంపై ఇటీవల పలువురు సర్పంచులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. ఉప ముఖ్యమంత్రి సైతం ఇదే విషయమై సీఎంతో మాట్లాడారు. సెప్టెంబరు మొదటి వారంలో నిధుల విడుదలకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు గత నెల 29న పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు మొత్తం నిధులను రాష్ట్ర ఆర్థిక శాఖ పంచాయితీలకు 70%,మండల పరిషత్తులకు 20%,జిల్లా పరిషత్తులకు 10% చొప్పున విడుదల చేసింది.

## వారం - వర్జ్యం

04-09-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
ద్వాదశి తె.4.07
ఉత్తరాషాఢ రా.11.40
వర్జ్యం : రా.3.39-తె.5.14
దు.ఉ.10.02-10.52, 2)మ.3.01-3.51
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం** : నూతన విద్య, ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. వాహనాల విషయం మెలుకువతో వ్యవహరించండి.

**వృషభం:** దూరమైన ఆప్తులు దగ్గర అవుతారు. కీలక విషయాలలో సొంత నిర్ణయాలు శ్రేయోదాయకం.

**మిథునం:** సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. సంఘంలో హోదా పెరుగుతుంది.

**కర్కాటకం** : మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రమే.

**సింహం:** సహోదర, సహోదరి వర్గం వారికి విశేషంగా సహాయ సహకారాలు అందించవలసి వస్తుంది.

**కన్య** : శ్రమకు ఓర్చి మీ వంతు సహాయం అందిస్తారు. ఉచిత సలహాలు ఇవ్వకండి.

**తుల** :ఆస్తుల విలువ అనూహ్యంగా పెరిగే సూచనలు ఉన్నాయి. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**వృశ్చికం:** కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**ధనుస్సు:** పోటీ పరీక్షలలో అనుకూల ఫలితాలను పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** కళాకారులు సన్మాన, సత్కారాలు పొందుతారు. పారిశ్రామిక రంగాలలో వారికి విదేశీ పర్యటనలు.

**కుంభం:** శ్రమకు అదృష్టం తోడవుతుంది. అనుకూల ఫలితాలు ఎక్కువగా ఉంటాయి.

**మీనం** : సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవలసి వస్తుంది. వస్తులాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# స్థానిక సంస్థలకు మరింత ఊతం

>> సమకూరుతున్న నిధుల మొత్తాన్ని క్రోడీకరించాలి. పంచాయతీల నిర్వహణకు ఏ మేరకు అవసరాలు ఉన్నాయో గుర్తించాలి. ఈ ప్రక్రియను పూర్తి చేస్తే ఏ విధంగా సాయం అందించాలి...? స్థానిక సంస్థల్ని ఏ విధంగా బలోపేతం చేయాలి...? అనే అంశాలపై విధి విధానాలు రూపొం దించడానికి వీలు కలుగుతుంది. ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయి. అయితే ఆ మేరకు ఆస్తుల కల్పన జరుగుతుందో, లేదో అనే విషయాన్ని నిరంతరం పరిశీలించుకోవాలి. స్థానిక సంస్థలు స్వయం సమృద్ధి సాధించేలా అధికారులు ప్రయత్నించాలి. ఇదే విధంగా పట్టణ స్థానిక సంస్థల నూ ఆర్థికంగా బలోపేతం చేస్తూ, మరిన్ని ఆదాయార్జన మార్గాలను అన్వేషించాలి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఫైనాన్స్ కమిషన్ నిధుల తో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చే నిధుల ను కొంత మేర పెంచితే వాటిని స్థానిక సంస్థలు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, వనరులు తక్కువగా ఉండి... సామాజికంగా వెనకబడి ఉన్న స్థానిక సంస్థల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. ఇదే సమయంలో స్థానిక సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా అవగాహన కల్పించాలి. నిధులు తీసుకోవడంతో పాటు, వాటిని సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు వ్యవహరించాలి. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించేది స్థానిక సంస్థలు. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థానిక సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు విధులు నిర్వర్తించాలి. స్థానిక సంస్థల్లో విధులు నిర్వహించే వారు సమర్థవంతంగా పని చేస్తే... ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ఆర్థిక సంవత్సరం చివరికి పంచాయతీల్లోనూ, పట్టణాభివృద్ధి సంస్థల్లోనూ ఆడిటింగ్ పూర్తి చేయాలి, అన్నారు.

**ఆదాయాలుబకాయిల లెక్కలు తేల్చండి- డిప్యూటీ సీఎం పవన్**

2019 నుంచి 2024 మధ్య కాలంలో స్థానిక సంస్థలు ఆస్తి పన్నుల వసూళ్లు ఎంత జరిగాయి...? ఇంకెంత బకాయిలు ఉన్నాయో...? లెక్కలు తేల్చాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. ప్రజలు చెల్లించే పన్నుల వివరాలు ప్రతీది ఆన్‌లైన్ చేయాలని నిర్దేశించారు. గ్రామాల్లో పౌల్ట్రీ పరిశ్రమలకు సంబంధించిన వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని చెప్పారు. గ్రామ ప్రజలకు, పౌల్ట్రీ పరిశ్రమలకు ఇబ్బందిలేని విధానాన్ని తీసుకురావాలన్నారు.

**స్థానిక సంస్థల రిసోర్స్ గ్యాప్‌రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదిక..**

ఆర్థికంగా రాష్ట్రం కొన్ని సవాళ్లు ఎదుర్కొంటోందని 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం పేర్కొంది. 202324 ఆర్థిక సంవత్సరాన్ని పరిశీలిస్తే రాష్ట్ర సొంత ఆదాయం కన్నా జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులకు ఖర్చు పెట్టే మొత్తం 111 శాతంగా ఉందని వెల్లడించింది. అంతేకాకుండా... రాజధాని నిర్మాణం, సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలు వంటి లక్ష్యాలు ఉన్నాయని స్పష్టం చేసింది. 202526 నుంచి 202930 వరకు పంచాయతీరాజ్ సంస్థల రిసోర్స్ గ్యాప్ రూ.7,033 కోట్లు ఉంటుందని ఆర్థిక సంఘం లెక్క తేల్చింది. అలాగే ఇదే కాలానికి పట్టణ స్థానిక సంస్థల రిసోర్స్ గ్యాప్ రూ.2,016 కోట్లుగా ఉంది. అలాగే ఆస్తి పన్నుల డిమాండ్‌కలెక్షన్ మధ్య భారీ వ్యత్యాసం ఉందని చెప్పింది.

**విద్యుత్ బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం..**

జూన్ 2024 వరకు గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు రూ.5,851.58 కోట్లు ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు వివిధ రూపాల్లో నిధుల సమీకరణ రూ.2,617 కోట్లుగా ఉంది. ఇందులో అత్యధికంగా సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ అందిస్తున్న గ్రాంట్స్ రూపంలోనే ఉన్నాయి. ఆ తర్వాత ఆస్తి పన్నులతో ఎక్కువ నిధులు సమకూరుతున్నాయి. పంచాయతీరాజ్ సిబ్బందికి ఏటా జీతాల రూపంలో రూ.393.77 కోట్లు, మున్సిపల్ సిబ్బందికి రూ.1,672.45 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ సమావేశంలో రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం ఛైర్ పర్సన్ రత్నకుమారి, సభ్యులు ప్రసాదరావు, కృపారావు సహా ఆర్థిక, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సమృద్ధిగా ఎరువు నిల్వలు

>> తెచ్చుకున్నాం. సెప్టెంబర్ 12 నుంచి 30వ తేదీ లోపు మరో లక్ష టన్నులు తెచ్చుకుంటాం. అంటే సెప్టెంబర్ నెలఖరు నాటికి 2.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుంది. రైతులు ఆందోళన చెందవద్దు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు ఎరువులను సిద్ధం చేస్తాం. వచ్చే రబీ నాటికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 9.38 లక్షల టన్నులు కేటాయింపులు ఇప్పటికే చేసుకున్నాం. కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడాను. జిల్లాల్లో అన్ని రిటైల్ షాపుల్లో, ప్రస్తుత నిల్వలు, సరఫరాపై సమీక్ష చేసుకుని అవసరం ఉన్న దగ్గరకు ఎరువులు తరలించాలని చెప్పాం. డిమాండ్ ఉన్న జిల్లాలకు మార్క్ ఫెడ్ ద్వారా ఎరువులు తరలించి రైతులకు సరఫరా చేస్తాం. పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టి ఎరువులు పక్కదారి పట్టకుండా చూడమని చెప్పాం." అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ఫేక్ ప్రచారం చేస్తే తీవ్ర పరిణామాలు**

సోషల్ మీడియాలో వివిధ అంశాలపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. "డ్రామాలు ఆడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. దుష్ప్రచారం చేసే వారిని జైలుకు పంపుతాం. యూరియా విషయంలో కృష్ణా జిల్లాలో వైసీపీకి చెందిన ఎర్రా వాసు, రామ్మూర్తి, చిలీ వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు కుట్రపూరితంగా వ్యవహరించారు. ఎరువుల లారీని హైజాక్ చేసే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్ ఎరువుల విషయంలో దుష్ప్రచారం చేస్తున్నారు. ఫేక్ రాజకీయాలు చేసినా, సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేసినా తీవ్ర పరిణామాలు ఉంటాయి. అన్ని జిల్లాల్లో ఎంతెంత స్టాక్ ఉందో... ఏయే దుకాణాల్లో ఎంత నిల్వలున్నాయనే వివరాలు కూడా ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. తప్పుడు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకోం. ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాల్జేయడానికి ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. ప్రస్తుతం రైతులు ఎక్కడెక్కడ ఎంత యూరియాను వినియోగిస్తున్నారో లెక్కలు తీసి మీడియాకు ఇస్తాం. రైతుల ముసుగులో వైసీపీ కార్యకర్తలు రాజకీయం చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరిస్తున్నా. నేరాలు ఘోరాలు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కుప్పంలో నీరిస్తే... నీళ్లు లేవని ప్రచారం చేశారు. పులివెందులకు మేం నీరిస్తే... వైసీపీ వాళ్లు వెళ్లి... తామే ఇచ్చినట్టుగా హారతులిచ్చారు. సోషల్ మీడియా ఉంది కదా అని తప్పుడు వార్తలు రాస్తే చూస్తూ ఊరుకోం. స్టీల్ ప్లాంట్ కు రూ.12 వేల కోట్లు కేంద్రం నిధులిచ్చి ఆదుకుంటే పేటీఎం బ్యాచ్ ద్వారా కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఉద్యోగుల వయో పరిమితి విషయంలో ఫేక్ జీవో సృష్టించి ఫేక్ ప్రచారం చేశారు. పేటీఎం బ్యాచ్ తప్పుడు పోస్టులు చేసి.. ఆందోళన కలిగించి.. రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తే తాట తీస్తాం. కావాలని అలజడులు సృష్టిస్తే జైలుకు పంపుతాం. మొన్నటి వరకు మహిళల పైనా.. నిన్న రాజధాని పైనా.. ఇప్పుడు రైతులను తప్పుదోవ పట్టించేలా చేస్తున్నారు. ఇలాంటి వారిని ఖచ్చితంగా నియంత్రిస్తాం." అని సీఎం అన్నారు.



బుధవారం అనంతనాగ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువును తలపిస్తున్న రహదారులు

# డిగ్రీ ఉంటేనే 'శ్రీవారిసేవ'!

>> అన్నిచోట్ల ఇతోధిక సేవలందించేందుకు శ్రీవారిసేవకులు సేవలందిస్తున్నారన్నారు. భక్తులకు మెరుగైన సేవలందించే దిశగా సేవలకు శిక్షణనివ్వాలని నిర్ణయించామన్నారు. తిరుమలలో భక్తులకు నాణ్యమైన ,రుచికరమైన ఆహారం అందించేందుకు క్యాంటీన్ల నిర్వహణ బ్రాండెడ్ హోటళ్లకు అప్పగించడం జరిగిందన్నారు. ఆదాయం ముఖ్యంకాదని, భక్తులకు సరసమైన ధరలకు ఆహారం అందించాలనే ధరల నియంత్రణ చేశామన్నారు. కొందరు పనిగట్టుకుని టెండర్లపై ఆరోపణలు చేస్తున్నారని, అలాంటివేమీపట్టించుకోమన్నారు. కొన్ని నియమనిబంధనలు పెట్టామని, ప్రణాళికా బద్ధంగా టెండర్లు పిలిచామన్నారు. టెండర్ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డు చేశామన్నారు. టిటిడి ఇఒ జె.శ్యామలరావు మాట్లాడుతూ భక్తులకు తిరుమలలో మరింత రుచికరమైన, నాణ్యమైన పరిశుభ్ర ఆహారాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో దేశంలోని ప్రముఖ ఆహార పదార్థాల తయారీ సంస్థలు టెండర్లలో పాల్గొనే అవకాశాన్ని టిటిడి కల్పించిందన్నారు. ఆన్‌లైన్‌లో ప్రముఖ సంస్థల నుండి టెండర్లు ఆహ్వానించడం ద్వారా బిగ్‌క్యాంటీన్‌లను కేటాయించడం జరిగిందన్నారు. జనతా క్యాంటీన్‌లకు ముందుగానే లైసెన్స్ రుసుం నిర్ణయించి లాటరీ విధానంలో ఇఒఐ బిడ్డింగ్ ప్రక్రియద్వారా జనతా క్యాంటీన్లను కేటాయించడం జరిగిందని ఇఒ తెలిపారు. టిటిడి నిబంధనల మేరకు దరఖాస్తులను పదిసంస్థలకు కేటాయించడం జరిగిందన్నారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ శ్రీవారి అన్నప్రసాదాల నాణ్యత పెరగడంతో లక్షమందికిపైగా భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారన్నారు. లడ్డూల ముడిపదార్థాలు నాణ్యతగా ఉన్నవి, నాణ్యత నెయ్యి వినియోగించడం వల్ల లడ్డూలు రుచికరంగా వితరణ చేస్తున్నామన్నారు. రోజుకు 4లక్షలు లడ్డూలు తయారవుతుంటే 4లక్షలు అమ్ముడవుతున్నాయని, లడ్డూలు భక్తులు కొనుగోలుచేస్తున్నారన్నారు. క్యాంటీన్ల టెండర్ల విషయంలో ఇప్పటివరకు ఒక పాలసీ విధానం లేకపోవడం వల్ల కొన్ని తప్పులు జరిగాయన్నారు. ధరల నియంత్రణతో బాటు నాణ్యత ముఖ్యమన్నారు.

# మద్యం కుంభకోణంలో సంచలన విషయాలు

**విజయవాడ.సెప్టెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో సిట్ తనిఖీల్లో పలు సంచలనాంశాలు వెలుగులోకి వస్తున్నాయి,వరుస తనిఖీల్లో డొల్ల కంపెనీల వివరాలకు పొంతన లేదు. రికార్డుల్లో కంపెనీ పేరు ఒకటి ఉండగా, భౌతికంగా మరో కార్యాలయం ఉంది. లిక్కర్ స్కాంలో నిందితుల లింకులు, చైన్ బహిర్గతమై బండారం బట్టబయలు అవుతోంది. లిక్కర్ స్కాంలో చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్‌లలో సిట్ బృందాల సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కంపెనీల్లో సిట్ సోదాలు చేస్తోంది. చిత్తూరులోని చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి చెందిన ఇన్ఫ్రా కంపెనీలో తనిఖీలు చేపట్టారు. చిత్తూరులోని బీవీరెడ్డి కాలనీ, నలందా నగర్, నిఖిలానంద అపార్ట్‌మెంట్‌లోని కార్యాలయంలో సిట్ తనిఖీలు చేస్తోంది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రశాంతి హిల్స్‌లో ఫ్లాట్ నెంబర్ 35లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి చెందిన కంపెనీలోను తనిఖీలు చేపట్టారు. చిత్తూరు సీఎంఆర్ కంపెనీ వద్దకు తనిఖీలకు వెళితే అక్కడ వెల్ టాస్క్ ఫుడ్ అండ్ బేవరేజెస్ పేరుతో బోర్డు ఉంది. వెల్ టాస్క్ ఫుడ్ అండ్ బేవరేజెస్ కంపెనీ వైఎస్సార్‌సీపీ నేత విజయానంద్ సంస్థగా గుర్తించారు.ఇదే కార్యాలయంలో జరిపిన తనిఖీల్లో మోహిత్ రెడ్డి కంపెనీ వివరాలు, విజయానంద్ రెడ్డి కంపెనీ వివరాలు బయటపడ్డాయి. హైదరాబాద్‌లో ప్రశాంతి హిల్స్‌తో భీం స్పేస్ కార్యాలయానికి వెళితే అక్కడ ఇషా ఇన్ఫ్రా పేరుతో బోర్డు ఉంది. ఇషా ఇన్ఫ్రా కంపెనీలో డైరెక్టర్లుగా సజ్జల భార్గవ్ రెడ్డి, ప్రద్యుమ్న ఉన్నారు. ఎన్నికల సమయంలో రూ.8 కోట్లు పట్టుబడగా అవి తనవే అని ప్రద్యుమ్న క్లెయిమ్ చేసుకున్నారు. 2024లో వైఎస్సార్‌సీపీ తరఫున విజయానందరెడ్డి పోటీచేసి ఓడిపోయారు. విజయానందరెడ్డిని 2 రోజుల క్రితం విజయవాడ సిట్‌కార్యాలయానికి పిలిచి విచారించిన సిట్ ఆయన ఇంటిఅడ్రస్సుతో సీబీఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. విజయానందరెడ్డి ఇంటి అడ్రస్సులో సీబీఆర్ ఇన్‌ఫ్రా ఉండటంపై సిట్ విచారణ చేస్తోంది.

# ఎపి ట్రాన్స్‌కో పరిధిలో రూ.6 వేల కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులు 2027 నాటికి పూర్తి

## -విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

**విజయవాడ,సెప్టెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ట్రాన్స్‌కో పరిధిలో రూ. 6 వేల కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులు 2027 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులకు కీలకాదేశాలు జారీ చేసారు.బుధవారం ట్రాన్స్ కో అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమావేశమయ్యారు. ట్రాన్స్ కో ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ వ్యయం తగ్గించాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు,, ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ప్రాజెక్ట నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపం లేకుండా పనులు చేపట్టాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రికి అధికారులు వివరించారు. సీఆర్డీఏలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ పై మంత్రి గొట్టిపాటి ఆరా తీసారు. సీఆర్డీఏ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని మంత్రి సూచించారు. సీఆర్డీఏ పరిధిలో జరిగే నిర్మాణాలకు అత్యాధునిక టెక్నాలజీని అవలంబించాలి మంత్రి సూచించారు ఆక్వా రైతులకు చేయూతనిచ్చేలా సబ్ స్టేషన్ల నిర్మాణానికి మంత్రి ఆదేశాలు ఇచ్చారు. ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రిప్పింగ్ సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి గొట్టిపాటి ఆదేశం విజయవాడ, వైజాగ్ నగరాల్లో ఏర్పాటు కానున్న మెట్రోకు కావాల్సిన విద్యుత్ సౌకర్యంపై అధికారులతో మంత్రి గొట్టిపాటి చర్చించారు.

# పన్ను ఇక 2 శ్లాబ్‌లే

>> సామాన్య మధ్యతరగతి జనావళికి ఊతం ఇచ్చే నిర్ణయాలు ఎక్కువ ఉన్నాయి. జీవితబీమాపై పూర్తిగా జీఎస్టీని తొలగించారు. వ్యక్తిగత, ఆరోగ్య, టర్మ్, జీవితబీమాలపై జీఎస్టీని పూర్తిగా తొలగించిన కేంద్రం తాజాగా సిమెంట్‌పై జీఎస్టీని ప్రస్తుతం ఉన్న 28 శాతంనుంచి 18శాతానికి కుదించారు. 33 ప్రాణాధార ఔషధాలపై జీఎస్టీ పూర్తిగా రద్దుచేసారు. ఎరువులు, వ్యవసాయరంగ ఉత్పత్తులపై ఐదుశాతం మాత్రమే జీఎస్టీ అమలవుతుంది. 56వ జీఎస్టీ మండలి సమావేశం అనంతరం వివరాలను ఆమె మీడియాకు వివరించారు. కొత్తగా లగ్జరీ గూడ్స్, మత్తు ఉత్ప్రేరకాలు ఉన్న ఉత్పత్తులపై 40శాతం శ్లాబ్ విధిస్తామని నిర్మలా సీతారామన్‌ప్రకటించారు. సామాన్య,మధ్యతరగతి కుటుంబాలను పరిగణనలోనికి తీసుకుని ఈ హేతుబద్దీకరణచేసినట్లు ఆమె అన్నారు. దీనితోపాటు ఎక్కువ ఉత్పత్తుల్లో దరలు కూడా తగ్గుతాయని ఆమె పేర్కొంటూ కార్మికరంగం, శ్రమ అధికంగా ఉండే సెక్టార్లకు మంచి మద్దతు లభిస్తుందని, రైతులు, వ్యవసాయరంగంతోపాటు హెల్త్‌కేర్‌రంగానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని ఆర్థిక మంత్రి వివరించారు. హేతుబద్దీకరణలో మొత్తం 175 ఉత్పత్తులు అత్యధికంగా వినియోగించేవి ఐదుశాతం శ్లాబ్‌లోకి వస్తున్నాయి. పాలు, పన్నీరు, స్నాక్స్, బ్రెడ్ మరింతచౌక అవుతాయి. హెయిర్ ఆయిల్, టాయిలెట్ సోప్స్, షాంపూలు, టూత్‌బ్రష్‌లు, టేబుల్‌వేర్, కిచెన్‌వేర్‌లు ఇపుడు అన్నీ కూడా ఐదుశాతం శ్లాబ్‌లోకకే వస్తాయి. ఇక యుహెచ్‌టి మిల్క్, పన్నీరు, చెనా వంటివాటితోపాటు అన్ని రకాల భారతీయ బ్రెడ్‌లు, పరాటాలు ఐదునుంచి జీరోశాతానికి వెళతాయి. ఇక కళ్లద్దాలు మాత్రం ఐదుశాతం శ్లాబ్‌లో ఉంటాయి. ఇక 99శాతం ఉత్పత్తులు ప్రస్తుతం 12శాతం శ్లాబ్‌లో ఉన్నవి కూడాకొత్తగా ఐదుశాతం శ్లాబ్‌లోకి వస్తున్నట్లు ఆమె చెప్పారు. మెంథాల్, ఎరువులు, హస్తకళా ఉత్పత్తులు, మార్బుల్, గ్రానైట్‌బ్లాక్‌లు కూడా ఈ శ్లాబ్‌లోకి వస్తాయి. అదనంగా 33 ప్రాణాధార మందులు, ఔషధాలు కూడా 12శాతంనుంచి పూర్తిగా జీరోశాతానికి మారాయి. ప్రస్తుతం 28శాతం శ్లాబ్‌లో ఉన్న 99శాతం ఉత్పత్తులు 18శాతం శ్లాబ్‌లోకి వచ్చాయి. వీటిలో ఎయిర్ కండిషనర్లు, టెలివిజన్లు 32 ఇంచ్‌లకు పైబడినవి అన్ని టీవీలు కూడా 18శాతం శ్లాబ్‌లోకి వస్తాయి. డిష్‌వాషింగ్ మెషిన్లు, సిమెంట్, చిన్నకార్లు, 300 సిసికి దిగువన ఉన్నమోటారుసైకిళ్లు అన్నీ కూడా 18శాతం శ్లాబ్‌లోనే ఉంటాయి. ఇక 350 సిసి చిన్నకార్లు, బస్సులు, ట్రక్కులు, అంబులెన్స్‌లు, ఆటో విడిభాగాలు 18శాతం శ్లాబ్‌లోకి వచ్చాయి. చేతితో వడికిన ఫైబర్‌కు 18 నుంచి ఐదుశాతం చేతితో వడికిన నూలుకు 12నుంచి ఐదుశాతం శ్లాబ్ పన్నురేటు వరిస్తుందని ఆర్థికమంత్రి చెప్పారు. ఇక మత్తు ఉత్ప్రేరకాలు, సూపర్ లగ్జరీగూడ్స్‌పై 40శాతం శ్లాబ్ ప్రవేశపెట్టాలనినిర్ణఇంచారు. ఇవి పాన్‌మసాలా, పొగాకు, సిగరెట్లు, బీడీలు, పండ్లరసాలు కాకుండా నాన్ ఆల్కహాలిక్‌పానీయాలు, 350సిసికిపైబడిన మోటారుబైకులు, యాచ్‌లు, హెలికాప్టర్లు అన్నీ కూడా 40శాతం శ్లాబ్‌లోకి వస్తాయి. టోకుధరల విలువల్లోకాకుండా జీఎస్టీ పాన్‌మసాలా, పొగాకు ఉత్పత్తులకు రిటైల్ అమ్మకం విలువలపై పడుతుంది. అన్ని టీవీలపైనా 18శాతం పన్ను విధిస్తుండగా ప్రాణాధార మందులు, కేన్సర్ ఔషధాలపై ఎలాంటి జీఎస్టీ ఉండదని ఆర్థిక మంత్రి వివరించారు. ఈ సంస్కరణలు ఆర్థికవృద్ధికి ఎంతో దోహదంచేసేవిగా ఉన్నట్లు కేంద్రమంత్రి వివరించారు.

## కూటమి ప్రభుత్వంతోనే
# రాష్ట్రాభివృద్ధి
### ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


సభాస్థలికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**అనంతపురం, సెప్టెంబర్ 3, (ప్రభాతవార్త బ్యూరో)** కూటమి ప్రభుత్వం 15 ఏళ్ల పరిపాలనలో ఉంటేనే పూర్తిస్థాయిలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే సూపర్ సిక్స్ హామీల్లో 5 హామీలు అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. అనంతపురంలో ఈనెల 10న సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా బుధవారం పలువురు టిడిపి నేతలతో కలసి ఆయన సభ మైదానంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అనంతపురంలో ఒక చారిత్రాత్మక సభ జరగబోతోందన్నారు. గత ఎన్నికల్లో 164స్థానాలు గెలవడం ఒక చరిత్ర అయితే... 15నెలల్లో హామీలు నెరవేర్చడం ఇంకో చరిత్రన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ పాలన సాగుతోందన్నారు. మూడు లక్షలకు పైగా జనాభాతో అనంతలో ఏర్పాటు చేయబోతున్న సభకు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభను విజయవంతం చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ , ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణి, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్, జనసేన రాష్ట్ర నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డి, టీడీపీ నేత పరిటాల శ్రీరామ్, నరస నాయుడు, బుగ్గయ్య చౌదరి, అడ్వకేట్ ఆదినారాయణ, బిజెపి నేతలు శ్రీనివాసులుతదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు కార్పొరేషన్ ఛైర్మన్లకు కేబినెట్ హోదా

**విజయవాడ,సెప్టెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీ ముగ్గురు కార్పొరేషన్ ఛైర్మన్లకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ హోదా కల్పించింది. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్ .జవహర్, ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అలపాటి సురేష్‌కు క్యాబినెట్ హోదా కల్పిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా క్యాబినెట్ హోదాలోనే ప్రొటోకాల్ అమలు చేయనున్నారు. అదే హోదాలో వేతనాలు, అలవెన్సులు అందించనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లకు వేతనాలు, అలవెన్సులను నిర్ణయించింది. హ్యాండీక్రాఫ్ట్ ఛైర్మన్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్, మహిళా కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, భవన, ఇతర నిర్మాణ పనుల వర్కర్ల వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్.. ఇలా 12 మంది ఛైర్మన్లకు ఏ కేటగిరి కింద వేతనాలు, అలవెన్సులు ఇవ్వడానికి నిర్ణయించింది. తిరుపతి అర్బన్ డెవల్‌పమెంట్ అథారిటీతో పాటు మరో ఐదు కార్పొరేషన్ల ఛైర్మన్లకు బి కేటగిరి కింద వేతనాలు అందించడానికి ఉత్తర్వులు జారీ చేసింది.

# ఉద్యాన పంటలతో రైతు ఇంట సిరులు

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**చందర్లపాడు,సెప్టెంబరు3,ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉచితంగా పండ్ల, పూల మొక్కల సాగును చేపట్టవచ్చని, ఉద్యాన పంటలతో రైతులకు సుస్థిర ఆదాయాలు లభిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశఅన్నారు. చందర్లపాడు మండలం, ముప్పాళ్ల గ్రామ రైతు నాగేశ్వరరావు ఉపాధి హామీ పథకం కింద ఎకరా విస్తీర్ణంలో వేసిన తైవాన్ జామ తోటను కలెక్టర్ లక్ష్మీశ.. అధికారులతో కలిసి సందర్శించారు. మొత్తం 444 మొక్కలు వేయగా.. పథకం కింద మొదటి ఏడాది రూ. 1,26,110, రెండో ఏడాది రూ. 60,707, మూడో ఏడాది రూ. 64,407 మొత్తం రూ. 2.51 లక్షల సాయం అందుతుంది. గుంతలు తవ్వేందుకు మార్కింగ్ చేసింది మొదలు.. మొక్కల కొనుగోలుకు, రవాణాకు, నాటడానికి, సంరక్షణకు ఇలా వివిధ పనులకు ఆర్థిక సహాయం అందుతుంది. ఉపాధి పథకం ద్వారా ఈ పంట వేసినందుకు చాలా ఆనందంగా ఉందని.. రెండో ఏడాది నుంచి ఆదాయం రావడం మొదలవుతుందని, ఏడాదికి రూ. 2 లక్షల నుంచి రూ. 2.50 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రైతుల క్షేమం, సంక్షేమానికి ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయని.. స్వర్ణాంధ్ర సాధనకు వ్యవసాయ, అనుబంధ రంగాల జీవీఏలో ప్రగతి కీలకమని, ఈ నేపథ్యంలో ఉద్యాన పంటలతో పాటు పశు పోషణను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఈ ఏడాది నాలుగు వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా దాదాపు లక్ష్యాన్ని చేరుకోవడం జరిగిందన్నారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని.. పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా సలహాలు సూచనలు అందించడంతో పాటు అన్ని విధాలా చేయిపట్టి నడిపించడం జరుగుతోందన్నారు. అగ్రి టెక్‌పైనా అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, నంది గామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ చేసిన రైల్వే సిబ్బందికి రూ.3.90కోట్ల బకాయిల చెల్లింపులు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 3,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లో ఆగస్టు నెలలో ఉద్యోగ విరమణ గావించిన సిబ్బందికి డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా బకాయిలకు సంబంధించిన కీలకపత్రాలను లబ్దిదారులకు అందచేశారు. స్థానిక డిఆర్ఎం కార్యాలయం లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన బకాయిల చెల్లింపుల కార్యక్రమంలో డివిజన్ పరిధిలో ఆగస్టులో వివిధ విభాగాలలో స్టేషన్లలో పనిచేసిన ఏడుగురు రైల్వే సిబ్బంది పదవీ విరమణ చేశారు. వీరితో పాటు వివిధ కారణాల వల్ల ఉద్యోగ విరమణ చేసిన మరో నలుగురితో కలిపి మొత్తం 11మంది లబ్దిదారులకు రూ.3,90,41,998లను సిబ్బందికి సంబంధించిన బ్యాంకు ఖాతాలలో జమ చేశారు. ఇందుకు సంబంధించిన పెన్షన్ పేమెంట్ ఆర్డర్(పిపిఓ)పత్రాలతో పాటు,ఇతర కీలకమైన పత్రాలను లబ్దిదారులకు అందచేశారు. కార్యక్రమంలో డిపిఓ-కోఆర్డినేషన్ హెచ్ఎల్ఎన్ ప్రసాద్,సీనియర్ డిఎఫ్ఎం వై.సందీప్,పర్సనల్ బ్రాంచి సెటిల్మెంట్ విభాగం చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ మాబూ,పర్సనల్ అకౌంట్స్ విభాగాలకు చెందిన సంబంధిత అధికారులు, సీనియర్ సబార్డినెట్లు, పదవి విరమణ చేసిన సిబ్బంది,బంధుమిత్రులు పాల్గొన్నారు.

## రాజధానిలో డ్రైనేజ్ నీరు ట్రీట్మెంట్‌కు రూ.761 కోట్లు

### అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లు

**రాజంపేట, సెప్టెంబర్4 ప్రభాతవా ర్త** రాష్ట్ర రాజధాని అమరావతిలో డ్రైనేజీ నీటిని పూర్తిస్థాయిలో మరల వినియోగించుకునేలా ట్రీట్మెంట్ ప్లాంట్ల(ఎస్ టి పి) ఏర్పాటుకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్ణయించింది .ఈ మేరకు అమరావతి రాజధాని పరిధిలో 11 జోన్ లలో ఈ ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు 761 కోట్లు నిధులు మంజూరు చేసి చేసి బుధవారం టెండర్లు పిలిచారు. రాజధాని పరిధిలోని 1, 2, 3, 4 ,5 ,6 ,7, 9, 10,12, 12ఎ జోలలో ఈ పనులు చేపట్టనున్నారు. ప్రపంచ బ్యాంక్, ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ నిధులతో 47 ప్యాకేజీ కింద 262.48 కోట్లు, 48వ ప్యాకేజీ 290.93 కోట్ల తోను, 49వ ప్యాకేజీ 207.85 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపట్టాలని టెండర్లు పిలిచారు. సివేజ్ ట్రీట్మెంట్ ప్లాన్ ద్వారా డ్రైనేజీ నీటిని ట్రీట్మెంట్ చేసి (మంచినీటికి తప్ప) పొలాలకు ఇతర అవసరాలకు వినియోగిస్తారు. టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఈనెల 18న చివరి గడువు. పర్సెంటేజీ పద్ధతిలో టెండర్లను పిలిచారు. ఏడేళ్ల పాటు ఈ ప్లాంట్ల నిర్వహణ కూడా గుత్తేదారే నిర్వహించాల్సి ఉంటుంది.

## పిపిపి మోడల్‌లో లిడ్ క్యాప్ భూముల అభివృద్ధి

### మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

**విజయవాడ,సెప్టెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** లిడ్ క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడంతోపాటు వాటిని పీ.పీ.పీ మోడల్ లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం నాడు అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో లిడ్ క్యాప్ పై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో తిరుపతి, విజయవాడలో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణంపై మంత్రికి అధికారులు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎస్వీ ఆటో నగర్ లోని 4.5 ఎకరాలు, విజయవాడ ఆటో నగర్ లో 1 ఎకరా లిడ్ క్యాప్ స్థలాల్లో మల్టీ పర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణం చేసే అంశంపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి విధి, విధానాలు రూపొందిస్తామని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ సమీక్షలో లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎం. ఎం. నాయక్, లిడ్ క్యాప్ ఎండీ ప్రసన్న వెంకటేష్, ఈడీ టీవీఎస్ ప్రసాదరావు,సునీల్ రాజ్ కుమార్, లిడ్ క్యాప్ మేనేజన్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# 15న తిరుపతి జాతీయ మహిళా సాధికారత సదస్సు

### శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి ఏర్పాట్లున- పార్కింగ్‌ను పరిశీలించిన ఆర్‌డిఒ

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** తిరుపతిజిల్లాలోని తిరుపతి కేంద్రంలో ఈ నెల 14,15న జాతీయ స్థాయి 'మహిళా సాధికారిత సదస్సు'ను నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో వచ్చే అతిథులు పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్ళాలంటే పరిసరాల్లో పుణ్యక్షేత్రాల్లో పార్కింగ్ ఏర్పాట్లును అధికారులు పరిశీలిస్తున్నారు.ఈ మహిథా సాధారికత సదస్సుకు భారత దేశంలోని సుమారు 250 మంది మహిళా ఎంపిలు,ఎంఎల్ఏలు హాజరౌతారని సమాచారం. ఇందుకు సంబందించి తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేయుటకు రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. ఒక వేళ 15న ప్రజా ప్రతినిధులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వస్తే అన్ని వాహనాలకు పార్కింగ్ పరిస్థితి ఏమిటన్నది ప్రభుత్వ ప్రతినిధి రాజ్‌కుమార్ శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డితో కలసి సన్నిధివీధి పరిసరాలను పరిశీలించారు.ఇక్కడ పార్కింగ్‌కు సంబంధించి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తి తహాశీల్దార్ జనార్ధన్‌రాజు,సూర్యప్రకాష్‌రావు తదితరులు పరిశీలించారు.తిరుపతి పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేసిన 'జాతీయ మహిళా సాధికారిత సదస్సు' ప్రారంభానికి బహుశా ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు హాజరై సదస్సునుద్దేశించి రాష్ట్రం అమలు చేస్తున్న మహిళల సదుపాయాలు, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నారు. అంతేకాక కూటమి ప్రభుత్వంలో భారత దేశం యావత్తులో ప్రధాని నరేంద్రమోదీ అందిస్తున్న పథకాలకు సంబంధించి ముఖ్య మంత్రి వివరించనున్నట్లు సమాచారం. అంతేకాక ఇప్పటి వరకు రాజ్యాంగ పరంగా మహిళలకు కల్పిస్తున్న అవకాశాలతో పాటు రాబోవు రోజుల్లో మహిళా ప్రతినిధులు తెలుసుకోనున్నారు.కాగా ముగింపు సమావేశానికి రాష్ట్ర గవర్నర్ నజీర్ హాజరు కావచ్చునని భావిస్తున్నారు.ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల శాసనసభల స్పీకర్లు,ప్రముఖులు కూడా రానున్నారు. కాబట్టి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.


శ్రీకాళహస్తిలో పార్కింగ్ సదుపాయాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రతినిధి రాజ్‌కుమార్

## భక్తులను మోసంచేస్తే
# కఠిన చర్యలు
### దర్శనం, వసతి పేరుతో దళారులను నమ్మకండి :టిటిడి విజ్ఞప్తి

**తిరుమల,సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులను పలు రకాలుగా మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టిటిడి విజిలెన్స్ హెచ్చరించింది. భక్తులు కూడా దళారులను నమ్మవద్దని, టిటిడి అధికారిక వెబ్‌సైట్‌ద్వారానే దర్శనం,వసతి టిటిదేవస్థానమ్స్. ఎపి.జిఒవి.ఇన్, టిటిదేవస్థానమ్స్ మొబైల్‌యాప్ ద్వారానే బుక్‌చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఇతర వివరాలకు 155257 టిటిడి టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకోవాలని కోరింది. శ్రీవారి భక్తులను మాయమాటలతో మోసగిస్తే అటాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టిటిడి తెలిపింది. అంతేగాక వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొంది. గూగుల్‌ద్వారా వసతికోసం వెతికే క్రమంలో శ్రీనివాస్ రెస్ట్ హౌసెస్ అనే వెబ్‌సైట్‌లో ఇచ్చిన మొబైల్ నంబర్ 8062180 322 ను సంప్రదించగా అభిమాన్యు అనే వ్యక్తి తాను శ్రీనివాసం కాంప్లెక్స్‌లో రిసెప్షన్‌కు చెందిన వాడినని, తప్పుడు సమా చారంతో పరి చయం చేసుకుని భక్తులను మోసం చేశార న్నారు.

## 7న మొగలిచర్ల దత్తాత్రేయ మందిరంలో లక్ష్మీగణపతిహోమం

**తిరుపతి,సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** భాద్రపద మాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం 7వతేదీ లింగసముద్రం మండలం మొగలిచెర్లగ్రామంలోని అవధూత దత్తాత్రేయ మందిరంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నారు. ఈ హోమంలో ప్రత్యక్షంగా పరోక్షంగా గృహస్థ భక్తులు పాల్గొనవచ్చని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవనినాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆలయంలో జరిగే ఈ లక్ష్మీగణపతిహోమంలో ప్రత్యక్షంగా పాల్గొనవచ్చాన్నారు.

# సెప్టెంబర్‌కల్లా పొగాకు కొనుగోళ్లు పూర్తవ్వాలి

### మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడసెప్టెంబర్ 3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రైతులు పండించిన నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని, సెప్టెంబర్ నెలాఖరకు నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి అవ్వాలని మార్క్ ఫెడ్ అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని ఐదవ బ్లాక్ లో వ్యవసాయ శాఖ, అనుబంద శాఖల ఉన్నతాధికారులతో పొగాకు, ప్రత్తి కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతు శ్రమ వృథా కాకుండా, మార్కెట్‌లో సమయానికి పంట కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. రైతు ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాణిజ్య కేంద్రాల్లో ఎటువంటి అవినీతి, ఇబ్బందులు చోటుచేసుకోకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించామని, రైతు శ్రేయస్సే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో నల్లబర్లీ పొగాకును 80 మిలియన్ కిలోలు పండించటం జరిగిందని, ఇప్పటివరకు 22 కంపెనీలు 40 మిలియన్ కిలోలు కొన్నారని, అదే విధంగా 15 మిలియన్ కిలోలు ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 55 మిలియన్ కిలోలు కొనడంతో ఇంకా 20 మిలియన్ కిలోలు ప్రయివేట్ కంపెనీ వారు అత్యవసరంగా ఈ నెల చివరి లోగా కొనాలని ఆదేశించారు. మిగిలిన 5 కిలోలు మార్క్ ఫెడ్ కొనుగోలు చేస్తుందన్నారు 2025-26 రబి సీజన్ లో నల్లబెర్లి పొగాకు ను ఎవరు పండించకూడదని ఇందుకోసం 740 జీవో విడుదల చేసామన్నారు. కంపెనీలతో ఎంఓయాలు చేసుకున్న రైతులు మాత్రమే తెల్ల బర్లీ పొగాకును పండించాలని అన్నారు.

# కుప్పంలో వైద్యఆరోగ్యశాఖచే ఎన్‌సిడి పైలట్ ప్రాజెక్ట్

**కుప్పం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో వైద్య ఆరోగ్యశాఖ మరో కొత్త పైలట్ ప్రాజెక్టు చేపడుతోంది. నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ (ఎన్‌సిడి) వ్యాధులపై ఈ పైలట్ ప్రాజెక్టు నిర్వహించనున్నారు. అంటు వ్యాధులు కాని బి.పి., చక్కెర వ్యాధి, థైరాయిడ్, కిడ్నీ సమస్యల వంటి వ్యాధులు కలిగిన వ్యక్తులను ఈ కార్యక్రమంలో గుర్తించి వారి రక్త నమూనాలను సేకరించనున్నారు. అనంతరం వారికి ఉన్న వ్యాధిని గుర్తించి వారికి అవసరమైన చికిత్సల కోసం పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేయనున్నారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ కార్యక్రమం ద్వారా తొలుత ర్యాండమ్ పద్ధతిలో ప్రజలను గుర్తించి వారి ఆరోగ్య సమాచారం సేకరించిన అనంతరం డిజిటలైజ్ చేస్తారు. ఈ వివరాలు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ఉంటుంది. సంబంధిత వ్యక్తులకు హెల్త్ ఐడిని సైతం కేటాయిస్తారు. రక్తపోటు, మధుమేహం పరీక్షలను నేరుగా ఇళ్ల వద్దనే ఎఎన్ఎంలు నిర్వహిస్తారు. అలాగే చిన్నపిల్లల్లో రక_శాతాన్ని నిర్ధారించనున్నారు. ప్రాథమిక పరీక్షల్లో వ్యాధి అనుమానితులకు వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వ్యాధి నిర్ధారితులైన వారిని ప్రభుత్వ మరియు ఎన్టీఆర్ వైద్యసేవ సదుపాయం ఉన్న ఆస్పత్రుల్లో ఉచిత చికిత్సలు అందిస్తారు. ఒకవేళ ఇంకా మెరుగైన వైద్యం అవసరం ఉంటే కార్పోరేట్ స్థాయి ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. భవిష్యత్తులో ఈ నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ వ్యాధులు మరింత ప్రబలకుండా ఉండేందుకు ప్రభుత్వం ము ందస్తు చర్యగా ఈ ప్రాజెక్ట్ చేపడుతోంది.


# తిరుమల సమాచారం

## తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు 23న 'అంకురార్పణ'



**తిరుమల,సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు శ్రీమహావిష్ణువురూపమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ఆ బ్రహ్మదేవుడే విచ్చేసి నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఈనెల 23వతేదీ మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరగనుంది. ఆరోజు సాయంత్రం నిత్యకైంకర్యాలన్నీ పూర్తిచేసుకున్న తరువాత రాత్రి 7గంటలకు శ్రీనివాసుడి సర్వసేనాధిపతి విశ్వక్సేనాధిపతి ఆలయం నుండి వెలుపలకు వచ్చి నాలుగుమాఢవీధుల్లో ఊరేగుతూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం,బీజావాహనం అత్యంత ముఖ్యమైంది. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు అంకురార్పణ నిర్వహిస్తారు. 23వతేదీ రాత్రి 7గంటల నుండి 9గంటలవరకు సేనాధిపతిని వసంతమండపానికి వేంచేపుచేసి అక్కడ మృత్సంగ్రహణం,ఆస్థానం నిర్వహిస్తారు. ఆ తరువాత పవిత్రమండపంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపడతారు. భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్ను సేకరించి సుగంధద్రవ్యాలను నాటుతారు. నవధాన్యాలకు మొలకలొచ్చేవరకు నీరుపోస్తారు. అంకురాలనుఆరోపింపజేసే కార్యక్రమం కావున "అంకురార్పణం" అయ్యింది.

## 6న చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం



**తిరుమల,సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** అనంతపద్మనాభజయంతి సందర్భంగా 6వతేదీ శనివారం ఉదయం తిరుమల పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం జరగనుంది. ఆలయ అర్చకులు వేదోక్తంగా శనివారం రోజు ఉదయం 6గంటలకు ముందే ఆలయం నుండి చక్రత్తాళ్వార్‌ను పల్లకీలో మాఢవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి పవిత్రమైన పుష్కరిణిలో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరుపనున్నారు. ప్రతి ఏటా బాద్రపదచతుర్ధశిరోజు అనంతపద్మనాభ స్వామి జయంతిన చక్రస్నానం నిర్వహించడం సాంప్రదాయం. సాధారణంగా ఏటా మూడసార్లు చక్రస్నానమహోత్సవం జరుగుతుంది. వైకుంఠద్వాదశిన, బ్రహ్మోత్సవాలు చివరిరోజు, అనంతపద్మనాభజయంతిరోజు.

## రూ.1.33కోట్ల విద్యుత్ బస్ విరాళం



**తిరుమల,సెప్టెంబర్ 3పభాత వార్తప్రతి నిధి:** తిరుమలేశుని దర్శనం కోసం సప్తగిరులకు చేరుకుంటున్న భక్తులకు అవసరమైన రవాణా సౌకర్యం ఉచితంగా కల్పించేందుకు ఓదాత తనవంతుగా విద్యుత్‌తో నడిచే ఉచిత బస్సును విరాళంగా అందించారు. 1.33కోట్ల రూపాయలు విలువచేసే విద్యుత్‌తో నడిచే బస్సును బుధవారం ఉదయం చెన్నైకి చెందిన స్విచ్ మొబిలిటీ ఆటోమోటివ్ లిమిటెడ్ సిఇఒ గణేష్‌మణి, చీఫ్ కమర్షియల్ అధికారి వెంకటరమణ ఈ బస్సుకు ఉదయం ఆలయంముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బస్సు రికార్డులను, తాళాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, డిఐ వెంకటాద్రినాయుడుకు అందజేశారు.దాతను ఈ సందర్భంగా వెంకయ్యచౌదరి అభినందించారు.

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులకు నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఉచిత అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు డిడిని విరాళంగా అందించాడు. గుంటూరుకు చెందిన దాత ఆలపాటి సురేశ్ 10,11,111రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి తిరుమలలో అందజేశారు.

## శ్రీవారి సుప్రభాతసేవలో సినీనటుడు శ్రీకాంత్



**తిరుమల,సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం వేకువజామున సుప్రభాతసేవలో సినీనటుడు శ్రీకాంత్ కుటుంబం దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలోనికి చేరుకున్న నటుడు కుటుంబసభ్యులను టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామివారి సుప్రభాతసేవలో పాల్గొని దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## స్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి : ప్రముఖులు



**తిరుమల,సెప్టెంబర్ 3పభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు మనీంద్ర సింగ్‌భిట్టా తెలిపారు. అఖిలభారత యాంటీ టెర్రరిజం ఫ్రంట్ ఛైర్మన్ ఆయన కుటుంబంతో కలసి బుధఉదయం ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి దర్శనంతో అంతా మంచి జరుగుతుంది : హార్యానా మాజీ సిఎం



**తిరుమల,సెప్టెంబర్ 3పభాత వార్తప్రతి నిధి:** కలియుగప్ర త్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే మనసు ఎంతో అనుభూతి కలుగుతుందని,భగవంతుని వేడుకుంటే అంతా మంచి జరుగుతుందని హార్యానా మాజీ సిఎం భూపేందర్ సింగ్ హోడ విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీవారి ఆశీస్సులతోనే అంతా మంచి జరుగుతుందని తెలిపారు. బుధవారం ఉదయం కుటుంబసభ్యులతో,అనుచరులతో కలసి తిరుమలకు వచ్చిన మాజీ సిఎం హుడ ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి ఆశీస్సులందజేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వార్త

తెలివారితో మంచిగా జీవించు. నీ మంచితనాన్ని తెలివారికి పంచు. మంచితనం నిన్ను ఎల్లప్పుడూ కాపాడుతుంది.

-టాల్‌స్టాయ్

# ఉపశమనం లేదా?

ఈ భూమ్మీద 71 శాతం జలరాశులుంటే మిగతా దంతా భూభాగమే. ఇలాంటి చోట ప్రకృతి విధ్వంసాల సమయంలో భూభాగం మీదకొచ్చే జలాలు సృష్టించే విలయాలు అన్నీఇన్నీ కావు. ప్రకృతి ప్రకోపాలు పరాకాష్ఠకు చేరినప్పుడు మానవాళికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జరిగే నష్టాలు చెప్పనలవి కాదు. క్లౌడ్‌బరస్ట్, భూకంపాలు, వరదలు, తుఫాన్లు అన్నీ ఒక్కటొక్కటిగా మీద పడ్తున్నాయి.ప్రకృతి విధ్వంసాలు జరిగినప్పుడల్లా మానవ తప్పిదాలను ప్రభుత్వ వైఫల్యాలను గుర్తు చేసుకొని నిందిస్తుంటాం. కానీ వాటి దుష్ఫలితాలపై మానవాళి ఏమాత్రం పట్టించుకోవడం లేదనే చెప్పాలి. ఇటీవల కాలంలో ప్రకృతి విలయాలు హెచ్చుమీరిపోయాయి. 2024లో జులై 30న కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో కొండచరియలు మిరపడి ఆ గ్రామంలో 420మంది ప్రాణాలు కోల్పోయారు. ఆఫ్రికాలోని సూడాన్‌లో కూడా ఇలాంటి ఘోర విపత్తు సంభవించింది. మర్రాహ్ పర్వత శ్రేణుల సమీప గ్రామంపై విరిగిపడిన కొండచరియల కారణంగా'తరసిక్' అనే గ్రామం యావత్తు కొట్టుకుపోయింది. వెయ్యి మందికిపైగా సజీవ సమాధి అయ్యారు. ఆ విపత్తులో ఒకే ఒక్కడు బయటపడ్డాడంటే అదేదో దైవసంకల్పమేననిపిస్తోంది. భారీవర్షాలు ఆ ప్రాంతానికి కొత్తకాకపోయినా ఇలాంటి ప్రాణనష్టంలో ఇదే ఎక్కువ. పురాతన అగ్ని పర్వత ప్రాంతం ఇది. తీవ్ర కరువు ప్రబలడంతో అక్కడి వాసులు కేవలం గడ్డితినే బతుకుతున్నారని గతంలోనే ఐక్యరాజ్యసమితి తల్లడిల్లింది. వారిపై ఈ ఘోర విపత్తు కక్షగట్టినట్లుంది. ఇదేదో ఒక ప్రాంతానికో ఓ దేశానికో ఓ రాష్ట్రానికో సంబంధించిన విషయం కానందున ప్రపంచం యావత్తు ఆలోచించదగినవే. మరు భూముల్లో మృతదేహాలు కూడా కానరాని విపత్తులకు వగచి లాభం లేదు. పెను విపత్తులొస్తాయని గుర్తించే స్థాయికి శాస్త్ర విజ్ఞానం ఎదిగినా కూడా వాటి నుంచి భద్రత కల్పించుకోగల స్థాయిలో జనం ఆలోచించడం లేదేమోననిపిస్తుంది. చాలా సందర్భాల్లో ఎప్పుడూ తారసిల్లని జలప్రళయం సంభవిస్తోంటే కష్టాలను, కన్నీళ్లని మింగేసి ఆకాశం కేసి చూసి దేవుడి కృపాకటాక్షాల కోసం ఎదురుచూడటమే అవుతుంది. ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక సహాయాలు ఏమూలకీ సరిపడవు. అంతర్జాతీయ సమాజాలు అన్నివేళలా స్పందించి స్నేహ హస్తమందించే స్థితి లేదు. మొన్న ఆగస్టు 31న తూర్పు అఫ్ఘనిస్థాన్‌లోని పక్టికా ప్రావిన్స్‌లో సంభవించిన భూకంప ప్రకోపానికి 1400మంది మట్టిపాలయ్యారు. అక్కడ భూకంప తీవ్రతను తట్టుకునే గృహ నిర్మాణాలు అరుదు. వారి ఆర్థిక స్థితి అంతకన్నా ఎదగనివ్వవు. అఫ్ఘనిస్థాన్ ప్రపంచంలోనే అత్యంత క్రియాశీల భారత్ ప్లేట్‌లకు, యురేషియన్ ప్లేట్లకు మధ్య ఉంది. కనుక భూకంపాలనెదుర్కోవడం తప్పనిసరి పరిస్థితి ఆ దేశంలో ఉన్న రాజకీయ అస్థిరతతో జనం మంచి ఆర్థిక పరిస్థితులకు దూరంగాఉంటారు. అక్కడి పాలకులు తాలిబన్‌లు అంతర్జాతీయ సమాజానికి అందుబాటులో లేనందున బయటి నుంచి వచ్చే సహాయ సహకారాలు బహు తక్కువగా ఉంటాయి. 1998లో అఫ్ఘనిస్థాన్ భూకంపంలో నాలుగువేల మంది ప్రాణాలు కోల్పోయారు. జపాన్, టర్కీ వంటి దేశాలు పాటిస్తున్న భూకంపాల నుండి రక్షణ కల్పించే భవన నిర్మాణాలు చేపట్టడం ఒక ఎత్తయితే ఐక్యరాజ్యసమితి ఆర్థిక దాతృత్వ ఫలాలను అందుకోవడం మరో ఎత్తు. ఈ రెండూ అఫ్ఘాన్‌లకు దూరమే.భారతదేశంలో కనీసం 16రాష్ట్రాలు, హిమాలయ పర్వతశ్రేణుల్లో రెండు కేంద్రపాలిత ప్రాంతాలు ఈశాన్య ప్రాంతంలోని పర్వతప్రాంతాలు, పశ్చిమ కనుమల ప్రాంతాలన్నీ కొండచరియలు విరిగిపడే అవకాశాలున్న ప్రాంతాలేనని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో తేలింది. అయితే అక్కడ చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ఇంకా పరిశోధనలు చేయాల్సిన అవశ్యకత ఉంది.హిమాలయ ప్రాంతాల్లో చెట్లనుఅధిక స్థాయిలో కొట్టిపడేయడం వల్ల మట్టి వర్షాలకు కొట్టుకుపోయి కొండచరియలు విరిగిపడుతున్నాయన్న ఆందోళన ఉంది. ఆ కారణం చేతనే వరదతోపాటు బురద పంట పొలాల్లోకి, ఇళ్లల్లోకి చేరుతోంది. ఆప్రాంతంలో పర్యావరణం నాశనమౌతోంది. ఈ విషయం తెలిసినా అక్కడ ప్రభుత్వాలు తగిన జాగ్రత్తలు పాటించడం లేదు. ప్రయివేటు వ్యక్తులు సైతం తమ ఆర్థిక అవసరాల కోసం అడవులను నరికి వేస్తున్నారు. విపత్తులకు సంబంధించి ముందస్తు ప్రణాళికలేవీ ఆయా ప్రభుత్వాల వద్దలేకపోవడం చింతించాల్సిన విషయం. ఉత్తరాది రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాలు కూడా ప్రకృతి ప్రకోపానికి విలవిల్లాడుతున్నాయి. ఉత్తరాఖండ్‌లో సంభవిస్తున్న 'క్లౌడ్'బరస్ట్‌లు ఆ ప్రాంత వినాశనానికి దారితీస్తోంది. ఎన్నో ఇళ్లు కూలి ప్రాణనష్టం సంభవిస్తోంది. జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలలో విశేషమైన ప్రాణనష్టం వాటిల్లింది.జమ్మూకాశ్మీర్‌లో పాతికేళ్లుగా కనీవినీ ఎరుగని వర్షాలు కురుస్తున్నాయి. జమ్మూకాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ వర్ష బీభత్సానికి 50మందికి పైగా చనిపోయారు. పంజాబ్ పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ఉత్తరాది వర్షాల స్థాయిని గమనిస్తే గత యేడాదికన్నా 74 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైందని వాతావరణ సమాచారం కేంద్రం అంచనా. శ్రీనగర్, అనంత్‌నాగ్‌ల్లో నదులు ఎన్నడూ లేని విధంగా ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తోంది. తెలంగాణలోని నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రకృతి విధ్వంసం అంతా ఇంతా కాదు. క్లౌడ్‌బరస్ట్‌లో కుంభవృష్టి కురుస్తోంది. ఎక్కడికక్కడ జనజీవనం స్తంభిస్తోంది.పంటలన్నీ నీట మునిగాయి. అసాధారణ ప్రకృతి వైపరీత్యాల నుంచి చాకచక్యంగా బయటపడే ప్రణాళికలతో ప్రభుత్వాలు తమ ప్రజల్ని కాపాడుకోవాలి.



దేశభక్తులెప్పుడూ దేశం కోసం తాము మరణిస్తామంటారు. కాని ఎవరినైనా చంపుతామని మాత్రం అనరు.

బెర్ట్రండ్ రస్సెల్



తెలివిగల వ్యక్తికి తప్పనిసరిగా ఎల్లప్పుడూ ఉండే లక్షణం ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే ఆతృత.

శామ్యూల్ జాన్సన్

# మానవ అక్రమ రవాణా నిరోధంలో విఫలం!

**అక్రమ రవాణాలో బయటపడిన వారిని నేరస్థుల వలే షెల్టర్‌హోమ్‌లలో సంవత్సరాల పాటు నిర్బంధంలో ఉంచడం భావ్యంకాదు. అందుకు ప్రత్యామ్నయంగా కమ్యూనిటీ ఆధారిత పునరావాసం కోసం సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయవలసి ఉంది. తద్వారా వారు సమాజంలో కలిసిపోయి జీవించేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ రవాణా బాధిత మహిళలు కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, సహాయక సేవల సమీక్ష, పర్యవేక్షణ, వాటి అమలు కోసం ఏర్పాటు చేసే కమిటీలలో సెక్స్ వర్కర్లు, అక్రమ రవాణా నుండి బయటపడిన వారికి ప్రాతినిధ్యం కల్పించవలసి ఉంది. బాధితులు తమ హక్కులు తిరిగి పొందేందుకు, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు స్పష్టమైన, పటిష్టమైన విధానాలు, సంస్కరణలతో ప్రభుత్వాలు వీరిని అన్ని విధాల ఆదుకోవలసిన అవసరం ఉంది.**



శిరందాసు నాగార్జున

మానవ అక్రమ రవాణా, వ్యభిచారం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోంది. మానవ అక్రమ రవాణా విషయంలో ఆడ, మగ తేడాలేదు. అయితే, ఆడపిల్లలే అధికంగా ఉన్నారని సమాచారం. బాలికలను, మహిళలను వ్యభిచార గృహాలకు తరలిస్తున్నారు. అవయవాల కోసం కూడా మానవ అక్రమ రవాణా జరుగుతోంది. రాష్ట్రంలో మహిళా సెక్స్ వర్కర్లు గణనీయంగా ఉన్నారు. ఓ పక్క అక్రమ రవాణా, మరోపక్క ఆర్థిక పరిస్థితుల వల్ల సెక్స్ వర్కర్ల సంఖ్య పెరుగుతోంది. ఇది చాలా ఆందోళనకరమైన అంశం. ఒక నివేదిక ప్రకారం 2021లో 1,33,447 మంది మహిళా సెక్స్ వర్కర్లతో రాష్ట్రం మొదటి స్థానంలో ఉండగా, 2024లో 1,19,367 మందితో రెండవ స్థానంలో ఉంది. మానవ అక్రమరవాణా, వ్యభిచారం నిరోధించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఈ అంశాన్ని ప్రభుత్వాలు ఏవీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు కనిపించడంలేదు. ఇందుకోసం రాష్ట్రంలో ఓ పటిష్టవంతమైన వ్యవస్థలేదు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో మానవ అక్రమరవాణా నిరోధక యూనిట్స్ (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏహెచ్‌టీయూ)లను ఏర్పాటు చేశారు. వాటికి పోలీస్ స్టేషన్ హోదా కల్పించారు. అయితే, ఇప్పటి వరకు ఏ ఒక్క యూనిట్‌లో ఒక్క ఎఫ్ఐఆర్ కూడా నేరుగా నమోదు చేయలేదు. స్థానిక పోలీస్ స్టేషన్‌లు తమ వద్ద ఉన్న పిల్లలు, యువతుల మిస్సింగ్, అక్రమ రవాణా కేసులు ఈ మానవ అక్రమరవాణా నిరోధక యూనిట్స్‌కు బదిలీ చేయవలసి ఉంది. ఆ కేసులను ఏహెచ్‌టీయూలు స్వతంత్రంగా దర్యాప్తు చేపట్టాలి, కానీ వాస్తవ పరిస్థితుల్లో అలా జరగడం లేదు. దాంతో ఆ కేసులు విచారణ నీరుగారిపోతోంది. గత 5 ఏళ్లుగా కనీసం 10 శాతం మంది నిందితులకు కూడా శిక్షలు పడలేదు. శారీరక దోపిడీ లేదాలైంగిక దోపిడీ, బానిసత్వం, దాస్యం లేదా అవయవాలను బలవంతంగా తొలగించడం, పిల్లలు, మానవ అక్రమ రవాణా ముప్పును ఎదుర్కోవడానికి భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 370, 370ఎ ఉన్నాయి. లైంగిక వేధింపులు, దోపిడీనుండి పిల్లలను రక్షించడానికి లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ పోక్సో (పీఓసీఎస్ఓ) చట్టం చేశారు. బాలికలు, మహిళలను అమ్మడం, కొనడం, స్త్రీలు, పిల్లల అక్రమ రవాణాకు సంబంధించి భారతీయ శిక్షాస్మృతిలో నిర్దిష్ట చట్టాలు అనేకం ఉన్నాయి. ఇన్ని చట్టాలు, జీఓలు ఉన్నప్పటికీ ఫలితంలేదు. వాటిని అమలు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతోంది. బాధిత బాలికలకు, మహిళలకు తగిన రీతిలో పునరావాసం, పరిహారం లభించడంలేదు. 2016 నుండి 2022 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 2,460 మందిని అక్రమ రవాణా, వ్యభిచార గృహాల నుంచి రక్షించారు. వారిలో పది శాతం మందికి కూడా పునరావాస సహాయం లభించలేదు. దీని వలన వారు తిరిగి లైంగిక దోపిడీకి గురయ్యే



ప్రమాదం ఉంది. అక్రమ రవాణాదారులకు శిక్ష విధించేరేటు 8 శాతం మించిలేదు.వీరికి అందాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఏవీ అందలేదు. పునరావాస కార్యక్రమాలు, నష్టపరిహారం అందించడంలో ఆ నాటి రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. ముఖ్యంగా నల్సా (నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ) వారు 2015లో రూపొందించిన పథకం ప్రకారం నరక కూపాల నుంచి విముక్తి పొందిన ప్రతి మహిళకు లేదా బాలికకు లక్ష రూపాయల నుంచి రూ.8 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి. అదేవిధంగా, జీవో ఎంఎస్ నెంబర్ 28ప్రకారం విముక్తి పొందిన బాధితులకు రూ.20 వేలు తక్షణ ఆర్థిక సహాయం అందజేయాలి. కానీ, విముక్తి పొందినవారిలో ఐదు శాతం మందికి మించి ఆర్థిక సహాయం అందలేదు. బాధితులకు రక్షణ కరువైంది. బాధితుల పిల్లలు వివక్షకు గురవడం మరో తీవ్రమైన అంశం. ఇది బాధిత మహిళలకు అయిన గాయాలను ఇంకా తీవ్ర చేస్తోంది. సెక్స్ వర్కర్లను అనధికారిక కార్మికులుగా పరిగణించి, వారికి అందించే అన్ని సంక్షేమ పథకాలు వీరికి కూడా వర్తింపచేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఆ ఆదేశాలు అమలు కావడంలేదు. న్యాయవ్యవస్థ కూడా ఈ బాధిత మహిళలు, బాలికలరక్షణ, వారి పునరావాసం, ఉపాధి వంటి విషయాలలో ప్రత్యేక దృష్టి సారించవలసి ఉంది. సెక్స్ వర్కర్లను, వ్యభిచార గృహాలు, అక్రమ రవాణా నుంచి రక్షించబడినవారి సంక్షేమం కోసం అక్రమరవాణా బాధిత మహిళల రాష్ట్ర సమాఖ్య విముక్తి, హెచ్ఈఎల్‌పీ(సొసైటీ ఫర్ హెల్ప్ ఎంటైర్ లోయర్ అండ్ రూరల్ పీపుల్)వంటి స్వచ్ఛంద సంస్థలు ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్నాయి. బాధిత మహిళల తరపున పోరాటం చేస్తున్నాయి. అయినా, ప్రభుత్వాల నుంచి తగినంత స్థాయిలో స్పందన రాకపోవడం బాధాకరం. విముక్తి పొందిన బాలికలు, యువతుల సంక్షేమంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టవలసి ఉంది. వారికి న్యాయం, గౌరవం, ఉపాధి, ఆర్థిక భద్రత కల్పించడం వంటి అంశాల విషయమై ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవలసి ఉంది. వ్యభిచారం, అక్రమ రవాణా నుండి బయటపడేవారికి ప్రత్యామ్నాయ జీవనోపాధిని కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించాలి. దానిని పటిష్టవంతంగా అమలు చేయాలి. వారు మళ్లీ గౌరప్రదంగా సమాజంలో బతికే వెసులుబాటు కల్పించాలి. వ్యభిచారం,అక్రమ రవాణా నుండి బయటపడిన వారికి రక్షణ, సంక్షేమం, నష్ట పరిహారం కోసం సింగిల్ విండో విధానం ద్వారా వారు ప్రయోజనాలు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసి ఉంది. అక్రమ రవాణాలో బయటపడిన వారిని నేరస్థుల వలే షెల్టర్‌హోమ్‌లలో సంవత్సరాల పాటు నిర్బంధంలో ఉంచడం భావ్యంకాదు. అందుకు ప్రత్యామ్నయంగా కమ్యూనిటీ ఆధారిత పునరావాసం కోసం సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయవలసి ఉంది.తద్వారా వారు సమాజంలో కలిసిపోయి జీవించేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ రవాణా బాధిత మహిళలు కోసంఅమలు చేస్తున్న వివిధసంక్షేమ పథకాలు, సహాయక సేవల సమీక్ష, పర్యవేక్షణ, వాటి అమలు కోసం ఏర్పాటు చేసే కమిటీలలో సెక్స్ వర్కర్లు, అక్రమ రవాణా నుండి బయటపడిన వారికి ప్రాతినిధ్యం కల్పించవలసి ఉంది.బాధితులు తమ హక్కులు తిరిగి పొందేందుకు, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు స్పష్టమైన, పటిష్టమైన విధానాలు, సంస్కరణలతో ప్రభుత్వాలు వీరిని అన్ని విధాల ఆదుకోవలసిన అవసరం ఉంది. ●

# భారత్, చైనా సంబంధాల్లో కొత్త పరిణామాలు

సి.హెచ్.ప్రతాప్

భారత్, చైనా సంబంధాలు ఎన్నాళ్లుగానో ఉద్రిక్తతలతో, విరుద్ధ సంకేతాలతో నిండిపోయి ఉన్నాయి. సరిహద్దు వివాదాలు, సైనిక ఉద్రిక్తతలు తరచూ ఇరుదేశాల మధ్య ఉద్విగ్న వాతావరణాన్ని సృష్టిస్తుంటే, మరోవైపు వాణిజ్య రంగంలో మాత్రం అపూర్వ స్థాయిలో పరస్పర ఆధారపడుతున్న దృశ్యం కనబడుతోంది. ఇటీవల జరిగిన బ్రిక్స్ సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన భేటీ ఈ సంబంధాలకు కొత్త ఊపిరి నింపినట్లైంది. ఇరువురు నాయకులు సరిహద్దు సమస్యలను పరిష్కరించేందుకు రాజకీయ స్థాయిలో చర్చలు కొనసాగించాలని అంగీకరించడం, పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించే సంకేతంగా భావించబడుతోంది. ఈ సమావేశం తక్షణ ఫలితాలను ఇవ్వకపోయినా, రెండు దేశాల మధ్య ఏర్పడిన గోడలను కొంతమేర దాటే ప్రయత్నంగా చూడవచ్చు. అయితే, సరిహద్దు సమస్యల విషయంలో పూర్తి స్థాయి పరిష్కారం ఇంకా అందని ద్రాక్షగా మిగిలిపోవడం సమస్య క్లిష్టతను బయటపెడుతోంది. గల్వాన్ లోయ ఘర్షణతర్వాత ఇరుదేశాల మధ్య ఏర్పడిన అనుమానాలు ఇంకా తొలగిపోలేదు. చైనా తరచూ సరిహద్దు వద్ద కొత్త మౌలిక వసతులు నిర్మించటం, భారతదేశం కూడా తన సైనిక సన్నాహాలను పెంచటం ఇవి పరస్పర నమ్మకానికి పెద్ద అడ్డంకులుగా మారుతున్నాయి.ఇక వాణిజ్య రంగం పూర్తిగా భిన్న దృశ్యాన్ని చూపిస్తోంది. భారత్-చైనా ద్వైపాక్షిక వాణిజ్యం గత దాదిలోనే 136 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటింది. ఇందులో భారత్ చైనాపై అధికంగా ఆధారపడిన దృశ్యం కనిపిస్తోంది. ఔషధాల ఉత్పత్తి, ఎలక్ట్రానిక్స్,



పరికరాల రంగాల్లో చైనా సరఫరాలు భారత్‌కు అనివార్యమవుతున్నాయి. ఈ విరుద్ధతల కలయికే ఇరుదేశాల సంబంధాల అసలు స్వరూపాన్ని ప్రతిబింబిస్తోంది. మోదీ- జిన్‌పింగ్ సమావేశం కనీసం ఈ సంబంధాలను సరైన దిశలో మళ్లించాలనే ఆకాంక్షను వ్యక్తం చేసింది. సరిహద్దు వివాదాలు పరిష్కార దిశగా కదిలితే, వాణిజ్య సంబంధాలు మరింత బలపడటమే కాక, ఆసియా ఖండంలోని శాంతి, స్థిరత్వం, ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి. భారత్, చైనా ప్రపంచంలో అతిపెద్ద అభివృద్ధి చెందుతున్న దేశాలు కావడంతో, వీరి మధ్య సహకారం లేకుండా ప్రపంచ వేదికపై పెద్ద మార్పులు సాధ్యం కావు. ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలపరచడానికి కొన్ని కీలకమైన చర్యలుఅవసరం. లడఖ్, అక్సాయ్ చిన్, అరుణాచల్‌ప్రదేశ్ వంటి ప్రాంతాల్లో సరిహద్దు స్పష్టతపై స్థిరమైన ఒప్పందం కుదుర్చుకోవాలి. ఇరుదేశాల సైన్యాల మధ్య విశ్వాసం పెంచేందుకు హాట్‌లైన్ లు,సంయుక్త శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలి. భారత్ నుంచి ఎగుమతులను ప్రోత్సహించి, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే విధానాలను చైనా సహకరించాలి.విద్యార్థుల మార్పి డి కార్యక్రమాలు, పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజలమధ్య సాన్నిహిత్యం పెంచుకోవాలి. అలాగే వాతా వరణ మార్పు, ఉగ్రవాదం, గ్లోబల్ ట్రేడ్ వంటి సమస్యల్లో కలిసి పని చేస్తే రెండు దేశాల ప్రభావం మరింత బలపడు తుంది. అందుకే ఇరుదేశాలు పరస్పర అనుమానాలను పక్కనపెట్టి, విశ్వాస వాతావరణాన్ని పునరుద్ధరించే దిశగా కృషి చేయాలి. సరిహద్దు సమస్యలపై స్పష్టమైన చర్చలు, వాణిజ్యరంగంలో పరస్పర న్యాయమైన విధానాలు, సాం స్కృతిక, విద్యా మార్పిడి వంటి మార్గాల్లో సంబంధాలు మెరుగుపరిస్తే, భారత్-చైనా సంబంధాలు కొత్త శకాన్ని ఆరంభించగలవు. ●

# ప్రజావాక్కు



### స్థానిక యువతకు కొత్త అవకాశాల దారులు

స్థానికకోటాకు సంబంధించిన రాష్ట్ర నియమాలను సుప్రీం కోర్టు సమర్థించడం ఒక ముఖ్యమైన తీర్పు. విద్యా సంస్థలు లేదా ఉద్యోగాలలో స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యత ఇచ్చే విధానాలను రూపొందించే అధికారం రాష్ట్రాలకు ఉందనే సూత్రాన్ని ఇది బలోపేతం చేస్తుంది. ఈ నిర్ణయం స్థానిక యువతకు అవకాశాలను నిర్ధారిస్తుంది కాబట్టి, అనేక ప్రాంతీయ సమూహాలు ఈ నిర్ణయాన్ని స్వాగతించే అవకాశం ఉంది.అయితే, ఇది స్థానిక ప్రయోజనాలను జాతీయ సమైక్యత అన్ని పౌరులకు సమాన అవకాశాలతో సమతుల్యం చేయడం గురించి చర్చలకు కూడా దారి తీయవచ్చు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### మాతృభాషలో విద్యకు ప్రాధాన్యమివ్వాలి

భారత విద్యావ్యవస్థలో రోటు లెర్నింగ్ పద్ధతి ఇంకా ప్రబలంగా ఉంది. విద్యార్థులు పాఠ్యాంశాలను కంఠస్థం చేయడంలోనే పరిమితం అవ్వడంతో, వారి ఆలోచన శక్తి,సృజనాత్మకత,సమస్య పరిష్కార నైపుణ్యాలు పరిమితమవుతున్నాయి. ఈపరిస్థితిని మార్చేందుకు సృజనాత్మకత, లేటరల్ థింకింగ్, సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి అత్యవసరం.విద్యపరీక్షల మార్కులకు మాత్రమే పరిమితం కాకుండా,విద్యార్థుల మేధో వికాసానికి దోహదపడేలా ఉండాలి. ప్రపంచంలోని ఉత్తమ విద్యా విధానాలు వ్యక్తిత్వ వికాసం, స్వతంత్ర ఆలోచన, సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. భారత విద్యలో కూడా ఇలాంటి మార్పులు అవసరం. మాతృభాషలో విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- సి.హెచ్. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### అమెరికానే ఆధారమా?

మన దేశంలోవిద్యనుండి ఉద్యోగంవ్యాపారం అన్నీ రంగాలు అమెరికా పై ఆధారపడుతున్నాయి. మన దేశంలో చదివి విదేశంలో ఉద్యోగం. మన దేశంలో గ్రాడ్యుయేట్ అమెరికాలో ఉన్నత విద్య. అమెరికాలో వరుడితోనే వివాహం. ఇలా ప్రతిదీ అమెరికాపై ఆధార పడుతున్నాం. వ్యాపార ఎగుమతులు దిగుమతులకు కూడా ఆ దేశంపైనే విపరీతంగా ఆధారపడిన మనంఇప్పుడు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అనే పరిస్థితిలో ఉన్నాం.కావునా ఇకనైనా అమెరికాపై అతిగా ఆధారపడవద్దు.

- సి. శేషగిరి, సికింద్రాబాద్

### ప్రకృతి విలయం

ఈ మధ్య విరామం లేకుండా కుండ పోతగా కురిసిన వర్షాలకు ప్రజా జీవనం అతలాకుతలమై పోయింది. ఆస్తులు, పంటలు బాగా దెబ్బతిన్నాయి. తెలంగాణ జిల్లాలలో ఇళ్ళు నీట మునిగి పోగా రహదారులన్నీ పాడయి పోయాయి. ఎక్కడ చూసినా గుంతల మయమే. ఇళ్ళల్లోకి విషపు పురుగులు ప్రవేశించాయి. రోగాలు చుట్టు ముట్టాయి.ఆసుపత్రులు ఖాళీ లేకుండా పోయాయి. బీద బిక్కి చేతిలో డబ్బులు లేక విలవిల్లాడి పోయారు. కొందరు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయి మరణించారు. ఎన్.డి.ఆర్ ఎఫ్. ఎస్.డి.ఆర్. ఎఫ్. దళాలు చేతనయినంత సహాయం చేసాయి. ఇటువంటి ప్రకృతి ప్రళయాలు సంభవించినప్పుడు వాటిని ఒడుపుగా తట్టుకొని పైన ఉదహరించిన ఉపద్రవాల నుండి సురక్షితంగా బయటపడే మార్గాలను అన్వేషించి ఆచరణలో పెట్టవలసిన గురుతర బాధ్యత కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### నిజాయితీకి తూట్లు

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ విద్యావ్యవస్థలో రెగ్యులర్, ఎం.టి. ఎస్, పార్ట్ టైం, కాంట్రాక్ట్, గెస్ట్ అని ఐదు రకాల నియా మకాలతో ప్రభుత్వం ద్వారా తరగతులు నడుస్తున్నాయి. అందరు చేసేది పనిఒకటే.కాని వేతనాల వ్యత్యాసం కొండకు కొమ్మకు ఉన్నంత ఉంటుంది. వీరిలోనే అన్ని రకాలఉన్నత విద్యావంతులున్నప్పటికీ గౌరవ మర్యాదల్లో కూడా చాలా వ్యత్యాసముంటుంది. ఏదో ఒకరూపంలో పనిచేయించుకొని పబ్బంగడుపుకొనే ధోరణే తప్ప మాన వతా దృక్పథంతో ఆలోచించేవారు లేరు.అంతే కాదు గెస్ట్ లెక్చరర్ల వంటికొన్ని నియామకాలలో తమ కనుకూలురను నియమించు కొని నిజాయితీకి తూట్లు పొడిచారు.

-డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### తగ్గిన పేదరికం..

భారత్‌లో పేదరికం భారీగా తగ్గిపోయిందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు పేర్కొన్నాయి.ఈ లెక్కలు చెప్పిన వారు పట్టణాల్లో గ్రామాల్లో సర్వేలు చేసే చెప్పారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోలేనివారు గంజి నీళ్లకు కష్టపడుతున్నారు. మన దేశం చాలా పేద దేశమని పూర్వ రిజర్వుబ్యాంకు గవర్నరు రఘురామ్ రాజన్ ఈ మధ్యనే అన్నారు. ఈ పేదరి కంలోఉద్యోగం చేసి రిటైర్ అయిన వారు కూడా ఉన్నారు.

- ఎం. రామారావు, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఉచిత పథకాలు ఖజానా ఖాళీకి గ్యారంటీలు

పూసాల సత్యనారాయణ

ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చింది అన్న చందంగా ఉంది పాలకుల విధానాలు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చుటకు సర్కారీ ఖజానా ఖాళీచేసి అప్పులు కుప్పలుగా చేసి ప్రజల నడ్డివిరుస్తున్నారు. కేంద్రం అప్పు 200లక్షల కోట్లు. కేంద్రం చేసిన అప్పు 140 లక్షల కోట్లు. అప్పుల్లో 70శాతం ప్రధాని చేసింది. విదేశీ పర్యటనల కొరకు 1846 కోట్లు ఖర్చు పెట్టి11 ఏళ్లలో 144 దేశాలు చుట్టివచ్చి గ్లోబల్ లీడర్‌గా ఎదిగాడు. ఆదాయంలో 37శాతం వడ్డీ కట్టవలసి వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ నేతగా ప్రసిద్ధి చెందారు. దేశాభివృద్ధి ముక్కోటి దేవతలెరుగు, అప్పుల్లో మాత్రం పరుగో పరుగు. దేశానికి స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు ఇంకెప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడేది. 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి' అదెక్కడా మచ్చుకైనా కానరాదు. లౌకిక రాజ్యంలో దేశ ప్రధాని హిందూ భావజాలంతో పరిపాలన సాగించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. ఎలక్షన్ కమిషన్‌తో కుమ్మక్కై దొంగ నోట్లతో అధికారం చేబట్టారని తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొనుచున్నాడు. ఇదేకాకుండా పారిశ్రామిక దిగ్గజాలకు 16 లక్షల కోట్లు మాఫీచేశాడని, బ్యాంకు ఖాతాలో మినిమం బ్యాలెన్స్ ఉంచే స్థోమత లేని పేదల నుండి 8500కోట్లు వసూల్ చేసి విమర్శలకు గురి అయ్యాడని సోషల్ మీడియా కోడైకూస్తున్నది. కేంద్రం ఇలా అప్పులు చేసుకొంటూ ప్రజాధనం వృధా చేస్తూనే రాష్ట్రాలు అప్పు చేయవద్దని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. మతానికి అంటిపెట్టుకొని ఉన్న పాలనతో అభివృద్ధి చెందడం అనేది గొంతెమ్మ కోరికే అవుతుంది. అందుకే అన్నాడు అరుణ్ ప్రకాశ్ నావికా దళ మాజీ చీఫ్ 'ఓ పక్క చైనా జపాన్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సుతో యంత్ర రంగాలలో పోటీపడి ఎదుగుతుంటే మనం మాత్రం గుళ్లు, గోపురాలు, మక్కాలు, మసీదులు, చర్చిలు గురు ద్వారాలంటూ కాలాన్ని వృధా చేస్తున్నాం' ఇది నగ్నసత్యం. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఒరిగింది ఏమి లేదు. చిల్లి కుండలో పోసిన నీరు లాగా వృధా అవుతుంది. తద్వారా ప్రజాధనం ధనవంతుల చేతికే పోతుంది. ఆర్థిక నియంత్రణ గాడి తప్పి అనేక దుష్పరిణామాలకు దారి తీస్తుంది. అభివృద్ధి హామీలు పక్కకు పెట్టి మతపరమైన రాజకీయాలకు ముందుకు రావడం ప్రతిపక్షాల తీవ్ర విమర్శలకు కారణమవుతుంది. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ మాటలు ప్రస్తావించవలసి వస్తుంది.'సిరా చుక్కమౌనం వహిస్తే మద్యం చుక్క రాజ్యమేలుతుంది.మేధావులు మౌనం వహించినంత కాలం మూర్ఖులు రాజ్యం ఏలుతారు'యదార్థవాది లోక విరోధి. తెలంగాణ ప్రభుత్వం విషయానికి వస్తే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేక ప్రజలలో విశ్వాసం క్రమేణా కోల్పోతుంది.ఈ బలహీనతనుఆసరా చేసుకొని సొంత పార్టీ నాయకులే గాకుండా ప్రతిపక్షాలు చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విరుచుక పడుతున్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమ పథకాలలో లక్షల కోట్ల అవినీతి కుంభకోణాలు చోటు చేసుకున్నట్లు వార్తలు చక్కెర్లు కొట్టాయి. బిఆర్ఎస్ ప్రవేశ పెట్టిన పథకాలు ఆదాయానికి మించి ఉండడంతో అవే పథకాలు కొనసాగించుటకు తలకుమించిన భారమై తలలు పట్టుకుంటు




న్నారు. ఖర్చు చేసే ముందు ఆలోచన లేకనే ఈ ఇబ్బందులు. ఆర్థిక క్రమశిక్షణ లేని పనులు రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నాయి. ఆసరా పింఛను పథకాలకు ఆసరా లేకుండా పోయింది. వికలాంగులు,ఒంటరి మహిళలు ఆర్థిక సహాయం అందక లబోదిబో అని మొత్తుకొంటున్నారు. ఇంకో దిక్కు ఆర్టీసీ సంస్థకు లక్షల కోట్ల రూపాయలు మహిళల ఉచిత ప్రయాణాలకు చెల్లించుతున్నారు. తెచ్చిన అప్పులపై వడ్డీకి కూడా సరిపోవడం లేదని పాలకులు చెబుతున్నారు. 'మింగ మెతుకు లేదు మీసాలకు సంపంగి నూనె' అన్న చందంగా ఉంది ప్రభుత్వ వైఖరి. బోనాల పండుగకు ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి వేడుకలు చెయ్యడమేమిటి? సంస్కృతి సంప్రదాయం పేరిట ప్రజాధనం వృధాకాక మరేమిటి?ఇది అసమర్థ పరిపాలనకు కొండంత నిదర్శనం.ప్రభుత్వకార్యాలయాలకు, విద్యాసంస్థలకు సొంత భవనాలు ఉన్నాయా? సరిపోయే సిబ్బందిఉన్నారా? అద్దెభవనాలు ఎందుకు? కులభవనాలు కట్టడం అవసరమా? గాడి తప్పిన ఆర్థిక క్రమశిక్షణ పాలకులకు గొడ్డలి దెబ్బ. ప్రభుత్వ ఖజానా ఖాళీచేసి అప్పులు కుప్పలుగా తెస్తే ఆ భారంఎవరు మోయాలి? ప్రజలే కదా? పాలకులు సొంత జేబు నుండి ఖర్చు పెడుతున్నారా?. మేధస్సు ఉపయోగించకుండా చెమట చిందించకుండా ఉచితాలతో లబ్దిపొందడం అనేది ప్రకృతికి సిద్ధాంతానికి విరుద్ధం. అధికారం కొరకు రాజకీయ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారు.పనిచేయకుండా కూర్చొని తింటే హిమాలయాలు కూడా కరిగిపోతాయి. సోమరిపోతులుగా తయారై తన కాళ్లపై తాను నిలబడకుండా మానసిక,శారీరిక,వికలాంగులై ప్రభుత్వాలకు గుదిబండగా తయారవుతారు ఇలా అయితే దేశమేగతి బాగుపడాలి?. ఆర్థికవ్యవస్థ విషయంలో అరిస్టాటిల్ చెప్పినది ఆచరణీయం ఆమోదయోగ్యం 'నీవు సంపాదించే దాని కన్న తక్కువ ఖర్చు చేయగలిగితే నిన్ను మించిన ఆర్థిక నిపుణుడు ఉండడు' ఇది పాటించే ప్రభుత్వాలు కనబడితే ఒట్టు పాలనా యంత్రాంగంలో ఆర్థిక నిపుణులు ముఖ్య సలహాదారుల సేవలు ఎక్కడా కనబడవు సెక్రటేరియట్‌లో అనవసరమైన పోస్టులను కలుపు మొక్కల్లా ఏరివేయాలి.ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచితంగా ప్రయాణాలెందుకు? ఒకరి సిగలు ఒకరు పట్టుకొని దారుణంగా కొట్టుకోవడానికా! ఓవర్ లోడ్ చేసుకొని బస్సుప్రసవ వేదన పడి ఆక్సిడెంట్‌లు కావడానికా? కండక్టర్ డ్రైవర్‌ల పై దాడులు చేయడానికేనా? తగిలించి తమాషా చూసే ప్రభుత్వాలు ఫలితం అనుభవించక తప్పదు. 'పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు తెలంగాణ రాష్ట్రం నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాల తెగులు వేరే రాష్ట్రాలకు క్రమేణా కరోనాలా పాకుతుండడం చూస్తున్నాం. రాష్ట్రాలు అప్పుల పాలై సునామీలా వచ్చేదుష్పరిణామాలు ఎదుర్కోక తప్పదు. తెలంగాణ ప్రభుత్వం అప్పుల ఊబిలో ఎంత లోతు వరకు దిగబడిందో. 2024 మార్చి 31 నాటికి తెలంగాణ ప్రభుత్వం అప్పులు రూ.350520.39కోట్లని ఆర్థిక శాఖ వెల్లడించింది.ఎం.పి రఘునందన్ రావు ప్రశ్నకులిఖిత పూర్వక సమాధానం ఇచ్చింది. 10ఏళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం రూ. 314545 కోట్లు అప్పులు చేసినట్లు తేల్చింది. 2014-2015లో రాష్ట్ర అప్పులు 69603.87 కోట్లు. ఉచిత పథకాలు ఎన్నికల ముందు కురిపించే వరాల జల్లులు. ఓటు కోసం వేసే చిక్కువలలు. తాత్కాలిక సంతోషం మాత్రమే శాశ్వత పరిష్కారాలు ముమ్మాటికి కావు. ప్రభుత్వ ఖజానా ఖాళీ కాకుండా అప్పులు చేయకుండా దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపాలంటే ప్రజాస్వామ్యం చిగురులు తొడిగేలా ఉండాలంటే ఉచితాలకు బదులు ఉపాధి మార్గాలు చూపాలి. ఆదాయానికి మించి ఖర్చు పెట్టకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి ఉత్పత్తులు ఎగుమతులు విరివిగా పెరగాలి. ఒక్క దేశం పై ఆధారపడకుండా పలు దేశాలతో వాణిజ్య సంబంధాలు పెట్టుకోవాలి. మతానికి సంప్రదాయానికి సంబంధించిన ఖర్చులు చేయకుండా విద్య, వైద్య ,గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులపై ఫోకస్ చేయాలి. ఆ దిశగా ప్రభుత్వాలు అడుగులు వేస్తాయని ఆశిద్దాం. ●

# భారత్, అమెరికా బంధం ఏకపక్షమే: ట్రంప్



వాషింగ్టన్, సెప్టెంబరు 3: భారత్, అమెరికాల బంధం ఇప్పటివరకూ ఏకపక్షంగా కొనసాగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్ పై మొన్నటి వరకు అమెరికా ఎలాంటి సుంకాలు విధించలేదని, భారత్ మాత్రం అమెరికా వస్తువులపై 100 శాతం పన్నులు విధించిందని ఆరోపించారు. దీంతో భారత వస్తువులు అమెరికాలోకి డంప్ అయ్యేవనీ, అమెరికా మాత్రం భారత్ కు ఎలాంటి ఎగుమతులు చేయలేకపోయిందని చెప్పారు. భారత దేశం మనపై ప్రపంచంలోనే అత్యధికంగా సుంకాలు విధిస్తుంటే మనమేమో ఫూలిష్ గా భారత్ పై అసలు సుంకాలే వేయలేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ సుంకాల వ్యత్యాసం వల్ల భారత వస్తువులు మన మార్కెట్ ను ఆక్రమించాయని, ఆ వస్తువులు ఇక్కడ తయారయ్యే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. భారత్ సుంకాల విధానం కారణంగా అమెరికా కంపెనీలు బయటకు వెళ్లి నిర్మాణాలు చేపడుతున్నాయన్నారు. ఈ మేరకు మంగళవారం ఓవెల్ కార్యాలయంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్ పై విధించిన సుంకాలను తగ్గించే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు జవాబిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికాల మధ్య ఆర్థిక సంబంధాలు ఇన్నాళ్లూ ఏకపక్షంగా కొనసాగాయని, తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాకే మార్పు వచ్చిందన్నారు. అధిక సుంకాల కారణంగా హార్లే డేవిడ్ సన్ కంపెనీ భారత్‌లో ప్లాంట్‌ను నిర్మించి విక్రయాలు జరపాల్సిన పరిస్థితి వచ్చిందని ట్రంప్ ఆరోపించారు.

తాజాగా తాను విధించిన సుంకాల వల్ల వేలాది కంపెనీలు అమెరికాకు వస్తున్నాయని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు.

# రష్యా నుంచి అదనంగా ఎస్-400 క్షిపణుల కొనుగోలు

## చైనా, అమెరికా, పాకిస్థాన్‌కు భారత్ చెక్!



న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: అమెరికాతో టారిఫ్స్ యుద్ధం, పాక్‌తో ఉద్రిక్తతల వేళ భారత రక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థగా పేరుగాంచిన ఎస్400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ అదనపు యూనిట్స్‌ని రష్యా నుంచి మరిన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. మాస్కోతో చర్చలు ప్రారంభించింది. భారత్ ఇప్పటికే ఎస్400 వ్యవస్థలను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే పాకిస్థాన్‌తో ఘర్షణల సమయంలో ఈ ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసింది. పాకిస్థాన్ డ్రోన్లు, మిసైల్స్‌తో దాడికి ప్రయత్నించగా ఎస్400 సహాయంతో వాటిని భారత్ విజయవంతంగా కూల్చివేసింది. సరిహద్దుల్లో మోహరించిన ఎస్ 400 మిస్సైల్ సిస్టమ్ అడ్డుకున్న విషయం తెలిసిందే. ఖచ్చితత్వంతో సరిహద్దు నుంచి వైమానిక ముప్పును ఎదుర్కోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పని చేసిన నేపథ్యంలో భారత్ తన వైమానిక రక్షణ సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు నిర్ణయం తీసుకుంది. చైనా నుంచి పెరుగుతున్న సైనిక ముప్పును ఎదుర్కొనే లక్ష్యంతో ఎస్400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు రష్యాతో ఇండియా 5 బిలియన్ల డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం 2018లో కుదిరింది. ఈ ఒప్పందం కింద మొత్తం ఐదు ఎస్400 వ్యవస్థలను కొనుగోలు చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల సరఫరాలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో భారత్‌కు ఇవ్వాల్సిన మిగిలిన రెండు యూనిట్లను 2026లోగా అందజేసేందుకు కట్టుబడి ఉన్నామని రష్యా ఇటీవలే ప్రకటించింది. ఇప్పుడు ఎస్400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ అదనపు యూనిట్స్ కోసం రష్యాతో భారత్ చర్చలు ప్రారంభించింది. ఎస్ 400 ట్రయాంఫ్ అనేది భూమిపై నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ. దీన్ని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి కూడా మోహరించవచ్చు. ఆకాశంలో దూసుకొచ్చే శత్రువుల జెట్స్, రాకెట్లను ఇది భూమిపై నుంచే కూల్చివేయగల సామర్థం వీటికి ఉంది. విమానాలు, మానవరహిత వైమానిక విమానాలు, క్రూయిజ్ క్షిపణులను ధ్వంసం చేస్తుంది. ఇది టెర్మినల్ బాలిస్టిక్ క్షిపణి రక్షణ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటుంది. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తక్షణమే వీటిని 1993లో అభివృద్ధి చేయడం ప్రారంభించారు. మిస్సైల్ స్టోరేజ్ కంటైనర్లు, లాంచర్లు, రాడార్లు ఇలా వివిధ రకాల ఆయుధాలతో దీన్ని తయారు చేశారు. 2007వ సంవత్సరంలో ఇది వినియోగంలోకి వచ్చింది. రష్యాకు చెందిన ఈ ఎస్400 మిస్సైళ్ల సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైళ్ల రక్షణ వ్యవస్థలో మోస్ట్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలుగా పేర్కొంటారు. ఎస్400 ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన మొబైల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్. దీన్ని సులభంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు అవకాశం ఉంటుంది. దాన్ని ఓ వాహనంపై అమర్చవచ్చు. ఒకేసారి మల్టిపుల్ టార్గెట్స్‌ని ధ్వంసం చేస్తుంది. ఒకేసారి 36 టార్గెట్‌లను ట్రాక్ చేసే సామర్థ్యం దీనికి ఉంది. అలాగే, 12 టార్గెట్స్‌పై ఒకే సారి దాడి చేస్తుంది. 600 కిలోమీటర్ల దూరం నుంచే ట్రాక్ చేస్తూ.. 400 కిలోమీటర్ల పరిధిలోనే శత్రువుల మిస్సైల్స్‌ను కూల్చే సత్తా వీటి సొంతం. విమానాలు, డ్రోన్లు, క్రూయిజ్ మిసైల్స్, బాలిస్టిక్ మిసైల్స్ ఇలా వేర్వేరు లక్ష్యాలను ఒకేసారి టార్గెట్ చేసి ఛేదిస్తుంది. వీటి రియాక్షన్ టైమ్ చేలా వేగంగా ఉంటుంది. ఎస్400 యాంటీ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఫైర్ చేసేందుకు ఐదు నిమిషాల్లోనే రెడీ చేయొచ్చు. ఇందులో 3డీ ఫేజ్‌డ్ అరే రాడార్ ట్రాకింగ్ సిస్టమ్ ఉంటుంది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం, 2020-2024 మధ్య కాలంలో భారత్ ఆయుధ దిగుమతుల్లో 36 శాతం వాటా రష్యాదే. బ్రహ్మోస్ క్షిపణులు, సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానాలు, టీ90 ట్యాంకులు, ఏకే 203 రైఫిళ్ల తయారీ వంటి ఎన్నో కీలక రక్షణ ప్రాజెక్టుల్లో ఇరు దేశాలు దశాబ్దాలుగా కలిసి పనిచేస్తున్నాయి. ఇప్పుడు మరో భారీ డీల్‌కు ఇరు దేశాలు సిద్ధమవడం విశేషం.



# చైనా మిలటరీ పెరేడ్‌కు తండ్రితోపాటు పాల్గొన్న కిమ్ కుమార్తె

బీజింగ్, సెప్టెంబరు 3: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన రాజకీయ వారసురాలు ఎవరనే దానిపై మరోసారి బలమైన సంకేతాలు పంపారు. చైనాలో జరిగిన భారీ సైనిక కవాతుకు ఆయన తన 13 ఏళ్ల కుమార్తె కిమ్ జు యేతో కలిసి హాజరయ్యారు. ఒక విదేశీ పర్యటనకు కిమ్ తన కుమార్తెను వెంట తీసుకురావడం ఇదే మొదటిసారి కావడంతో, తదుపరి పాలకురాలు ఆమే అనే ప్రచారం ఊపందుకుంది. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై చైనా సాధించిన విజయానికి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజింగ్‌లో ఈ సైనిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కిమ్ నిన్న తన ప్రత్యేక బుల్లెట్ ప్రూఫ్ రైలులో బీజింగ్ చేరుకున్నారు. రైలు దిగే సమయంలో ఆయన వెంటే కిమ్ జు యే కూడా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కిమ్ తన కుమార్తెను ప్రపంచానికి పరిచయం చేయడం ఇది కొత్తేమీ కాదు. 2022లో తొలిసారిగా ఒక ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ కేంద్రం వద్ద ఆమె కనిపించారు. ఆ తర్వాత 2023లో జరిగిన మిలిటరీ వ్యవస్థాపక దినోత్సవ పరేడ్‌లో కూడా తండ్రితో పాటు పాల్గొన్నారు. అప్పటి నుంచి పలు కీలక అధికారిక కార్యక్రమాల్లో ఆమె కనిపిస్తూనే ఉన్నారు. భవిష్యత్తులో పాలన తన వారసుల చేతిలోనే ఉంటుందని చెప్పడానికే కిమ్ ఇలా చేస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆమె వారసురాలు అనే వాదనలకు ఉత్తర కొరియా అధికారిక మీడియా కూడా బలం చేకూరుస్తోంది. మొదట్లో ఆమెను ప్రియమైన కుమార్తెగా పేర్కొన్న మీడియా, ఆ తర్వాత గౌరవనీయ కుమార్తెగా అభివర్ణించడం మొదలుపెట్టింది. దేశంలో అత్యున్నత గౌరవం ఉన్న వ్యక్తులకు మాత్రమే ఈ విశ్లేషణాన్ని వాడతారు. కిమ్ కూడా అధికార పగ్గాలు చేపట్టడానికి ముందు గౌరవనీయ కామ్రేడ్‌గా పిలవబడ్డారు. ఈ పరిణామాలన్నీ వారసత్వ ప్రచారాన్ని బలపరుస్తున్నాయి. అయితే, ప్రస్తుతం కిమ్ జు యే వయసు 13 సంవత్సరాలే కావడంతో, వారసత్వ మార్పిడికి ఇంకా చాలా సమయం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దక్షిణ కొరియా నిఘా వర్గాల సమాచారం ప్రకారం, కిమ్‌కు ముగ్గురు సంతానం కాగా, వారిలో కిమ్ జు యే రెండో సంతానం. అయినప్పటికీ, ఆమెకే పాలనా పగ్గాలు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి.

# గనుల యజమాని నన్ను ప్రలోభ పెట్టాలనిచూసారు

## మధ్యప్రదేశ్‌లో న్యాయమూర్తి సంచలన ప్రకటనలు

భోపాల్, సెప్టెంబర్ 3 : అధికార బీజేపీ ఎమ్మెల్యే ఒకరు ఒక కేసులో తనను ప్రభావితం చేయడానికి, ప్రలోభ పెట్టడానికి నేరుగా సంప్రదింపులు జరిపాడని రాతపూర్వకంగా పేర్కొంటూ, ఆ కేసును విచారించనని ఒక జడ్జి బహిరంగంగా ప్రకటించడం బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో సంచలనం సృష్టించింది. గనుల కంపెనీ యజమాని, బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ పాఠక్ కేసు విషయమై తనతో చర్చించడానికి ప్రయత్నించాడని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశాల్ మిశ్రా ఈ నెల 1న జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొని, ఆ పిటిషన్‌ను విచారించడానికి తిరస్కరించారు. జడ్జి నిర్ణయం కోర్టు రూములో బాంబులా పేలి న్యాయవర్గాల్లో సంచలనం సృష్టించింది. అధికార బీజేపీ ఎమ్మెల్యే తనను నేరుగా కలిసి, కేసు విషయమై ప్రభావితం చేయడానికి ప్రయత్నించాడని సిట్టింగ్ జడ్జి ప్రకటించడం ఇదే తొలిసారి. ఈ కేసును చూస్తే మైనింగ్ మాఫియా ఎంత శక్తివంతమైనదో అర్థమవుతున్నది. ఎమ్మెల్యే పాఠక్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన మైనింగ్ కంపెనీలు పలు అక్రమాలకు పాల్పడుతున్నాయని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా దర్యాప్తు సంస్థలు కూడా ఏమీ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ కాట్నీకి చెందిన అశుతోష్ మను దీక్షిత్ ఈ ఏడాది జూన్‌లో హైకోర్టును ఆశ్రయించారు.



# దావణ్‌గెరే ఎస్పీపై ఎమ్మెల్యే వ్యక్తిగత విమర్శలు కేసు నమోదు!

దావణ్‌గేరే, సెప్టెంబరు 3: కర్ణాటకలో ఓ బీజేపీ ఎమ్మెల్యే మహిళా పోలీస్ ఉన్నతాధికారిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. దావణగెరె జిల్లా ఎస్పీ ఉమా ప్రశాంత్‌ను ఉద్దేశించి, ఆమె కాంగ్రెస్ నేతల ఇంట్లో 'పెంపుడు కుక్క'లా వ్యవహరిస్తున్నారంటూ హరిహర బీజేపీ ఎమ్మెల్యే బి.పి. హరీశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్వయంగా ఎస్పీ ఉమా ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం దావణగెరెలోని కేటీజే నగర్ పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దావణగెరెలో రిపోర్టర్స్ గిల్డ్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్ మాట్లాడుతూ.. "నేనొక ఎమ్మెల్యేని. కానీ, ఎస్పీ నన్ను ఏదైనా కార్యక్రమంలో చూస్తే ముఖం చిట్లించుకుంటున్నారు. అదే కాంగ్రెస్‌కు చెందిన శమనూరు కుటుంబ సభ్యుల కోసం మాత్రం గేటు వద్ద పడిగాపులు కాస్తున్నారు. అచ్చం వాళ్లింట్లోని పోమరేనియన్ కుక్కలా ఆమె ప్రవర్తన ఉంటోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత శమనూరు శివశంకరప్ప ఎమ్మెల్యేగా ఉండగా, ఆయన కుమారుడు ఎస్.ఎస్. మల్లికార్జున్ రాష్ట్ర మంత్రిగా, కోడలు ప్రభా మల్లికార్జున్ దావణగెరె ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కొన్ని సంఘటనలను ఉదాహరణగా చూపుతూ, హరిహరలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎస్పీ తనను పట్టించుకోకుండా, అగౌరవంగా వేదికపై కూర్చున్నారని హరీశ్ ఆరోపించారు.

గాంధీ భవన్ వద్ద మండుటెండలో ఎంపీ ప్రభా మల్లికార్జున్ కోసం ఎస్పీ గంటల తరబడి ఎదురుచూశారు. నేనూ ప్రజాప్రతినిధినే, ఆమె కూడా ప్రజాప్రతినిధే. మరి ఈ వివక్ష ఎందుకని ఆయన ప్రశ్నించారు. అధికారంలో ఉన్నవారి అండ చూసుకుంటే మంచిదని ఎస్పీ భావిస్తున్నారని, కానీ ఇదంతా తాత్కాలికమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, ఇటీవల మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆర్.వి. దేశ్‌పాండే సైతం ఓ మహిళా రిపోర్టర్‌తో అనుచితంగా ప్రవర్తించడం వివాదాస్పదమైంది. రాష్ట్రంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మహిళలపై రాజకీయ నాయకులు చేస్తున్న ఇలాంటి వ్యాఖ్యలపై సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నాం!

## బెల్జియం ప్రధాని అధికారిక ప్రకటన



బ్రస్సెల్స్, సెప్టెంబరు 3: ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతకు, పాలస్తీనా పట్ల పెరుగుతున్న అంతర్జాతీయ సానుభూతికి అద్దం పడుతూ బెల్జియం పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తామని ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో పాలస్తీనాను పూర్తి స్థాయి దేశంగా గుర్తించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్‌పై పన్నెండు కఠినమైన ఆంక్షలను విధించనున్నట్లు కూడా స్పష్టం చేసింది. గాజాలో ఇజ్రాయెల్ బలగాలు జరుపుతున్న దాడులు, అక్కడ నెలకొన్న భయంకరమైన మానవతా సంక్షోభం, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బెల్జియం విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రివోట్ తెలిపారు. ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ప్రివోట్ వెల్లడించిన ఆంక్షలలో ప్రధానంగా ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో ఉన్న అక్రమ నివాసాల నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై నిషేధం విధించారు. అలాగే ఇజ్రాయెల్ కంపెనీలతో ప్రభుత్వ ఒప్పందాలను సమీక్షించడం వంటివి కూడా ఇందులో ఉన్నాయి. తమ ఈ చర్య ఇజ్రాయెల్ ప్రజలకు వ్యతిరేకం కాదని కేవలం ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ, మానవతా చట్టాలను గౌరవించేలా ఒత్తిడి తీసుకురావడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. ఈ నిర్ణయం ద్వారా ఇజ్రాయెల్ సైన్యం, హమాస్ ఉగ్రవాదులపై ఒత్తిడి పెరుగుతుందని బెల్జియం భావిస్తోంది. పాలస్తీనాను దేశంగా గుర్తించింది ఒక్క బెల్జియం మాత్రమే కాదు. ఇప్పటికే ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఆస్ట్రేలియా వంటి పలు పాశ్చాత్య దేశాలు ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని ప్రకటించాయి. ఈ దేశాలన్నీ కూడా సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు న్యూయార్క్‌లో జరగనున్న ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో తమ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తాయి. స్పెయిన్, ఐర్లాండ్, నార్వే వంటి దేశాలు గత ఏడాదిలోనే పాలస్తీనాకు దేశ హోదాను కల్పించాయి. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితిలోని 193 సభ్య దేశాలలో 147 దేశాలు ఇప్పటికే పాలస్తీనాను దేశంగా గుర్తించాయి.

# సంక్షిప్తంగా..

## లష్కరేకు అందిన నిధులపై దర్యాప్తు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన లష్కరే సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌కు పలు దేశాల నుంచి నిధులు అందినట్లు తేలింది. ఈ దాడి ఇన్వెస్టిగేషన్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ వేగవంతం చేసింది. తాజాగా టీఆర్‌ఎఫ్‌కు ఏ దేశాల నుంచి నిధులు అందాయో అన్న వివరాలను వెల్లడించింది. ఇందుకోసం ఉగ్ర మూక చేసిన మొత్తం 463 ఫోన్‌కాల్స్‌ను విశ్లేషించింది. వీటిల్లో ముఖ్యంగా పాకిస్తాన్, మలేసియా, గల్ఫ్ దేశాల నుంచి టీఆర్‌ఎఫ్‌కు నిధులు అందినట్లు గుర్తించింది. టీఆర్‌ఎఫ్‌కు మలేసియాకు చెందిన యాసిర్ హాయత్ అనే వ్యక్తి రూ.9 లక్షలు అందించాడు.

## విమానంలో హారహారమహాదేవ అంటూ అల్లరి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: విమాన ప్రయాణంలో చోటు చేసుకునే కొన్ని ఘటనలు ప్రముఖంగా వార్తల్లో నిలుస్తుంటాయి. ముఖ్యంగా ప్రయాణికుల ప్రవర్తన చర్చకు దారితీస్తుంటుంది. కొందరు వ్యక్తులు తప్పతాగి వికృతచేష్టలకు పాల్పడుతుంటారు. మరికొందరు తోటి ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటారు. తాజాగా ఓ వ్యక్తి ఇండిగో విమానంలో హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో మతపరమైన నినాదాలు చేస్తూ తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేశారు. ఢిల్లీ నుండి కోల్‌కతాకు వెళుతున్న ఇండిగో విమానం 6571లో ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో గందరగోళం సృష్టించాడు. 31డీ సీటులో కూర్చున్న ప్రయాణికుడు విమానం గాల్లో ఉండగా 'హర హర మహాదేవ' నినాదాలతో హోరెత్తించాడు. క్యాబిన్ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించాడు. అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో క్యాబిన్ సిబ్బంది అతడిపై అధికారులకు ఫిర్యాదు చేశారు.

## ఆ మూడు దేశాల బాధితులు ఫ్రీగా భారత్‌లో తిరగొచ్చు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: పొరుగు దేశాల నుంచి వచ్చిన మైనారిటీలకు భారత ప్రభుత్వం పాస్‌పోర్టుల విషయంలో ఊరటనిచ్చింది. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ దేశాల్లో మతపరమైన పీడనను భరించలేక భారత్‌కు వచ్చిన మైనారిటీలు (హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రిస్టియన్ మతస్తులు) మన దేశంలో పాస్‌పోర్టుగానీ, ఎలాంటి ట్రావెల్ డాక్యుమెంట్లుగానీ లేకుండా ఉండేందుకు కేంద్ర హోంశాఖ అనుమతినిచ్చింది. అయితే గత ఏడాది అమల్లోకి వచ్చిన సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ ఆక్ట్ ప్రకారం, 2014 డిసెంబర్ 31 కంటే ముందు పాక్, ఆఫ్ఘన్, బంగ్లాదేశ్‌ల నుంచి భారత్‌కు వచ్చిన మైనారిటీలకు మాత్రమే పాస్‌పోర్టు లేకున్నా నివాసం ఉండే అవకాశం ఉంటుంది. కానీ 2014 తర్వాత కూడా వచ్చిన చాలామంది మైనారిటీల పరిస్థితి దయనీయంగా మారుతుంది. అందుకే కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ - 2025' కింద తాజా ఆదేశాలు జారీచేశారు.


# మళ్లీ నవ్వులపాలయిన పాక్ ప్రధాని షరీఫ్



బీజింగ్, సెప్టెంబరు 3: పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను పాత ఇబ్బందే మళ్లీ వెంటాడింది. అంతర్జాతీయ వేదికపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎదుట ఆయన మరోసారి నవ్వుల పాలయ్యారు. మూడేళ్ల క్రితం జరిగిన ఘటనే పునరావృతం కావడంతో ఆయన ఇబ్బంది పడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా షెహబాజ్ షరీఫ్, పుతిన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇద్దరు నేతలు చర్చలు ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, షెహబాజ్ తన ఇయర్‌ఫోన్‌ను చెవికి సరిగ్గా పెట్టుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డారు. అది పదేపదే జారిపోతుండటంతో ఆయన అసహనానికి గురయ్యారు. షెహబాజ్ అవస్థను గమనించిన పుతిన్, ముసిముసిగా నవ్వుతూ తన ఇయర్‌ఫోన్‌ను తీసి దాన్ని ఎలా పెట్టుకోవాలో చేతి సైగలతో చూపించారు. ఈ ఘటనతో పాక్ ప్రధాని తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సరిగ్గా ఇలాంటి ఘటనే 2022లో ఉజ్బెకిస్థాన్‌లో జరిగిన సదస్సులోనూ చోటుచేసుకుంది. అప్పుడు కూడా పుతిన్ ఎదుటే షెహబాజ్ తన ఇయర్‌ఫోన్‌తో కుస్తీ పడ్డారు. అధికారులు సహాయం చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ వీడియో కూడా అప్పట్లో విపరీతంగా వైరల్ అయింది. 'బీజింగ్‌లో షెహబాజ్ హెడ్‌ఫోన్ జారిపోవడం చూసి పుతిన్ నవ్వారు. మళ్లీ అదే జరిగింది' అని ఓ నెటిజన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. చైనా పర్యటనలో షెహబాజ్ షరీఫ్‌కు ఇదొక్కటే కాదు, మరికొన్ని ఇబ్బందికర సంఘటనలు కూడా ఎదురయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్‌తో కలిసి నడుస్తుండగా షెహబాజ్ ఒంటరిగా పక్కన నిలబడి ఉన్న వీడియో కూడా వైరల్ అయింది.

# కర్ణాటకలో మళ్లీ రాజకీయ అలజడి

## పార్టీలు మారుతున్నారంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు



బెంగళూరు, సెప్టెంబరు 3: కర్ణాటక కాంగ్రెస్‌లో మరోసారి ముసలం మొదలైంది. పదవుల పంచాయితీ మళ్లీ మొదటికొచ్చింది. అధికారంలోకి రాగానే సీఎం పదవి కోసం డీకే శివకుమార్ సిద్ధరామయ్య తలపడగా మరోసారి అత్యున్నత పదవి కోసం కాంగ్రెస్‌లో కుమ్ములాటలు జోరందుకున్నాయి. సీఎం పదవి నుంచి సిద్ధరామయ్యని తప్పించి ఆ స్థానంలో డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టాలంటూ మెజారిటీ ఎమ్మెల్యేలు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వివాదం వేళ డీకే శివకుమార్ బీజేపీలో చేరబోతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఇప్పుడు తాజాగా మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. డీకే, సిద్ధరామయ్య వర్గీయులు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఒకరిపై ఒకరు మాటల యుద్ధానికి దిగుతున్నారు. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు అని బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. మాజీ మంత్రి కేఎన్ రాజన్న బీజేపీలో చేరబోతున్నారంటూ ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాజన్న రాష్ట్ర సహకార మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. రాహుల్ గాంధీ ఓట్ల చోరీ ఆరోపణలపై వ్యతిరేక గళం వినిపించడంతోనే ఆయనను గత నెల పదవి నుంచి తప్పించారు. ఈ నేపథ్యంలో తన తండ్రి రాజన్న పార్టీ మారుతున్నారని ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ, మాజీ మంత్రి తనయుడు రాజేంద్ర రాజన్న తీవ్రంగా స్పందించారు. బీజేపీలో చేరే బృందంలో బాలకృష్ణ ఉన్నారంటూ ఆరోపించారు. సీఎం పదవి కోసం పాకులాడుతున్న నేత (డీకే శివకుమార్‌ను ఉద్దేశించి)వెళ్లబోతున్నారన్నారు.


# ఆ ముగ్గురూ అమెరికాపై కుట్రపన్నుతున్నారు: ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 3: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌లతో కలిసి జిన్‌పింగ్ అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. చైనా నిర్వహించిన భారీ సైనిక పరేడ్‌కు పుతిన్, కిమ్ హాజరు కావడంపై ట్రంప్ మండిపడ్డారు. బుధవారం ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా మీరు కుట్ర పన్నుతున్నప్పుడు, వ్లాదిమిర్ పుతిన్, కిమ్ జోంగ్ ఉన్‌లకు దయచేసి నా హృదయపూర్వక శుభాకాంక్షలుతెలియజేయండని ఆయన వ్యంగ్యంగా పోస్ట్ చేశారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో చైనా స్వాతంత్రం కోసం అమెరికా సైనికులు తమ రక్తాన్ని ధారపోశారని, ఆ త్యాగాలను జిన్‌పింగ్ ప్రభుత్వం గౌరవిస్తుందో లేదో చూడాలని ప్రశ్నించారు.

చైనా విజయం కోసం ఎందరో అమెరికన్లు ప్రాణాలర్పించారని, వారి ధైర్యసాహసాలను, త్యాగాలను చైనా గుర్తుంచుకోవాలని ఆశిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

# పెర్‌ఫ్యూమ్ ఇకపై దేశీయంగా తయారీ..

## ఉత్తరాఖండ్‌లో యువతకు శిక్షణ



డెహ్రాడూన్, సెప్టెంబర్ 3: పర్‌ఫ్యూమ్ అనగానే మనకు గుర్తొచ్చేది ఫ్రాన్స్ రాజధాని పారిస్ మాత్రమే. అయితే ఇకపై దేశీయ సువాసనలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఉత్తరాఖండ్‌లోని స్కూల్ ఆఫ్ పర్‌ఫ్యూమరీ ఇన్‌స్టిట్యూట్ సిద్ధమైంది. దేశంలో పర్‌ఫ్యూమ్‌ల తయారీని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఉత్తరాఖండ్‌లోని స్కూల్ ఆఫ్ పర్‌ఫ్యూమరీ ఇన్‌స్టిట్యూట్ పలు చర్యలు తీసుకుంటోంది. పర్‌ఫ్యూమ్‌లను తయారు చేసే విధానంపై యువతకు శిక్షణనిస్తోంది. పర్‌ఫ్యూమ్‌ల తయారీలో ఏఏ మొక్కలను వాడాలనే విషయంపై వారికి తరగతులు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పర్‌ఫ్యూమ్‌లకు మంచి డిమాండ్ ఉండడంతో యువత దీనిని ఉపాధిగా కూడా చేసుకోవచ్చని సూచించారు. తాము తయారు చేస్తున్న ఉత్పత్తులకు త్వరలో అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ఇన్‌స్టిట్యూట్ నేతృత్వంలో తయారు చేసిన పర్‌ఫ్యూమ్‌లను ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారని అన్నారు. అయితే దేశీయంగా సంప్రదాయంగా వేల సంవత్సరాల నుంచి పరిమళాలను తయారుచేస్తున్నారు. దీనికి ప్రధాన కేంద్రం ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్.

# ప్రతి గ్రామంలోనూ బిజెపిని బలమైన పార్టీగా తీర్చి దిద్దాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

**ఏలూరు ప్రభాతవార్త సెప్టెంబర్ 3** బిజెపి నేతలు ప్రజానాయకులుగా మారి ప్రజల సమస్యలను పరిష్కరించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సారథ్యం యాత్రలో భాగంగా ఏలూరులోని క్రాంతి కళ్యాణమండపంలో జిల్లా అధ్యక్షులు విక్రమ కిషోర్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జిల్లా విస్తృత స్థాయి బిజెపి కార్యకర్తల సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏలూరు పార్లమెంటు జిల్లా కార్యకర్తలు శోభాయాత్రలో బీజేపీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి పొందుతోందని, ఆ స్ఫూర్తితోనే తాము సారథ్యం యాత్ర నిర్వహిస్తున్నామని మాధవ్ తెలిపారు. ప్రతి జిల్లాలో కొత్త ఉత్సాహం కనిపిస్తోందని, కార్యకర్తలు సిద్ధాంతాల భూమికపై పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ వంటి మహనీయుల త్యాగాలతో, అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అద్వానీ వంటి నేతల కృషితో బలపడిన బిజెపి నేడు నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశానికి మంచి రోజులు తెస్తోందన్నారు. ప్రతి గ్రామంలోనూ బిజెపిని బలమైన పార్టీగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల ఇంటికి వచ్చారని, ఈ విషయాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని మాధవ్ సూచించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అపక్రమ సమస్యలను పరిష్కరిస్తుందని, పోలవరం జాతీయ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం పూర్తి చేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టుకు రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. జాతీయ రహదారుల నిర్మాణం, హైవేల అనుసంధానం ద్వారా పర్యాటక, రవాణా రంగాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కొల్లేరు రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, కొల్లేరు జీవవైవిధ్యాన్ని కాపాడటంతో పాటు, అరాచక శక్తులను అణచివేస్తామని మాధవ్ చెప్పారు. ఆక్వా ఎగుమతులకు చర్యలు తీసుకుంటామని, ఆక్వా రంగానికి ప్రత్యామ్నాయ మార్కెట్ల కోసం ఆలోచిస్తున్నామని ఆయన వివరించారు. చైనా, రష్యాలతో కలిసి ట్రంప్‌కు సమాధానం చెబుతామని, నిమ్మ మార్కెట్‌పై కార్యాచరణ రూపొందిస్తామని మాధవ్ పేర్కొన్నారు. ప్రజలు స్వదేశీ వస్తువులను కొనుగోలు చేసి, ఆర్థిక స్వావలంబనను దెబ్బతీసేవారికి బుద్ధి చెప్పడానికి స్వదేశీ ఉద్యమం చేపట్టాలని మాధవ్ పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు జిల్లా బిజెపి కార్యాలయాలను పరిపాలనా భవనాలుగా మార్చాలని మాధవ్ సూచించారు.


పర్యాటక శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు..

# అరకు కాఫీ, కూచిపూడి, ఎర్రచందనం ఉత్పత్తులు, చేనేతలు పర్యాటక బ్రాండ్స్:సిఎం చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబర్ 3,ప్రభాతవార్తప్రతినిధి:** టెంపుల్ టౌన్స్‌లో హోమ్ స్టేలను ప్రోత్సహించాలని, ముఖ్యంగా తిరుపతితో పాటు ఇతర ప్రముఖ దేవాలయాల పట్టణాల్లో వీటిపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కోనసీమలో గ్రామీణ వాతావరణం అనుభూతి చెందేలా హోమ్ స్టేలను అభివృద్ధి చేయాలని, ఎన్ఆర్ఐలు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ హోమ్ స్టేలు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండేలా చూడాలన్నారు. బుధవారం సచివాలయంలో పర్యాటక శాఖపై సీఎం సమీక్షించారు. విశాఖ, విజయవాడ, అమరావతి, తిరుపతి, అనంతపురం, కర్నూలు ఇలా వేర్వేరు ప్రాంతాల్లో నిరంతరం ఏదోక టూరిజం ఈవెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకోసం గదుల నిర్మాణం, నూతన ప్రాజెక్టులు, పర్యాటక ఉత్సవాల నిర్వహణ వంటి అంశాలపై దృష్టి సారించాలని సీఎం చెప్పారు. నిర్దేశించిన గడువులోగా వేర్వేరు పర్యాటక ప్రాంతాల్లో బస కోసం హోటల్ గదులను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. 2026 మార్చి నాటికి రాష్ట్రంలో 10 వేల గదులు అందుబాటులోకి రావాలని సీఎం సూచించారు. అలాగే 2029 నాటికి 50 వేల గదుల లక్ష్యాన్ని కూడా చేరుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు స్థలాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు. పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక ప్రాంతాలు, టౌన్ షిప్ లతో పాటు పర్యాటకంగానూ అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. అనంతపురంలో డిస్నీ వరల్డ్ సిటీ ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధుల్ని సంప్రదించాలని అధికారులకు సీఎం చెప్పారు. కొండపల్లి ఖిల్లా లాంటి ప్రాజెక్టులను దత్తత తీసుకునేలా ప్రైవేటు భాగస్వాములను గుర్తించాలన్నారు. ఉండవల్లి గుహల వద్ద లైట్ అండ్ సౌండ్ షో ఏర్పాటుతో పాటు, చింతపల్లిలో ఎకో టూరిజం, కుప్పంలో ఏనుగుల సఫారీ, విశాఖలో డాల్ఫిన్ షో వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వివిధ పథకాల కింద రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. స్వదేశ్ దర్శన్ పథకం కింద బొర్రా గుహలు, అరకు, లంబసింగిలో పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం చెప్పారు. సూర్య లంక బీచ్ ఎక్స్ పీరియన్స్ ప్రాజెక్టు పనులను రూ.97 కోట్లతో చేపట్టామని.. 2026 జూన్ నాటికి ఈ ప్రాజెక్టు సిద్ధం అవుతుందని వెల్లడించారు. ప్రసాద్ పథకం కింద సింహాచలం, అన్నవరం దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనులపైనా సీఎం ఆరా తీశారు. గండికోట టెంట్ సిటీని వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తైడ, అరకు, గండికోట, సూర్యలంక, బ్రిడ్జిలంక, లంబసింగి వంటి ప్రాంతాల్లో టెంట్ సిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద హేవ్ లాక్ బ్రిడ్జిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టును పర్యాటకులకు అందుబాటులోకి తేవాలన్నారు. రాజమండ్రిని స్పెషల్ టూరిజం హబ్ గా చేపట్టేలా ప్రాజెక్టులను తీసుకువచ్చే అంశం మీద దృష్టి సారించాలని సూచించారు. సుదీర్ఘ తీర ప్రాంతంలో ఆకర్షణీయమైన బీచ్ ఫ్రంట్ లను గుర్తించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హెలీ, సీప్లేన్ టూరిజానికి సంబంధించి విజయవాడశ్రీశైలం, గండికోట బెంగుళూరు, విశాఖఅరకు లాంటి కొత్త మార్గాలను కూడా గుర్తించాలని స్పష్టం చేశారు. కోనసీమలో కాటేజ్ లైఫ్, విలేజ్ లైఫ్ వచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. సీ క్రూజ్ ప్రాజెక్టులతో పాటు రివర్ క్రూయిజ్ ను కూడా ప్రోత్సహించాలన్నారు. మరోవైపు విజయవాడలో దసరా ఉత్సవాలను మైసూరు ఉత్సవాల తరహాలోనే నిర్వహించేందుకు ప్రణాళిక చేసినట్టు అధికారులు తెలిపారు.

# పిఎస్‌లలో చాలని సిసికెమెరాలు

## హైకోర్టుకు అడ్వకేట్ కమిషన్ నివేదిక

**విజయవాడ,సెప్టెంబరు 3,ప్రభాత వార్తప్రతినిధి:** ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో తాను పరిశీలించిన ఆరు పోలీసు స్టేషన్లలో సగటున పది సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసినా సరే ఠాణాలోని మొత్తం ప్రాంతాన్ని రికార్డు చేయాలంటే అవి సరిపోవని అడ్వొకేట్ కమిషనర్ ఎమ్మార్కే చక్రవర్తి హైకోర్టుకు నివేదించారు. డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) నుంచి వీడియో ఫుటేజి పొందేందుకు తమకు అవకాశం లేదని పోలీసులు వెల్లడించినట్లు నివేదికలో పేర్కొన్నారు. విచారణను వాయిదా వేసిన ధర్మాసనం: ఏదైనా కేసు దర్యాప్తులో ఫుటేజీ అవసరమంటూ ఫిర్యాదు లేవనెత్తితే సంబంధిత ఎస్పీ కార్యాలయం నుంచి ఈ మెయిల్ ద్వారా పంపుతారని పోలీసులు వెల్లడించారని పేర్కొన్నారు. డీవీఆర్‌లో రికార్డయిన ఫుటేజీ ఎక్కడ ఉంటుందో తెలుసుకొని వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం కావాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) విష్ణుతేజ అభ్యర్థించారు. దీనికి అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం విచారణను బుధవారానికి వాయిదా వేసింది. పోలీసుస్టేషన్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయలేదంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో కోర్టుధిక్కరణ వ్యాజ్యం వేశారు. ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం ఆరు ఠాణాలను తనిఖీ చేసి నివేదిక ఇచ్చేందుకు న్యాయవాది ఎమ్మార్కే చక్రవర్తిని అడ్వొకేట్ కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం కమిషనర్ హైకోర్టుకు నివేదిక సమర్పించారు. అందులో కొన్ని వివరాలు పొందుపరిచి ఉన్నాయి. ప్రతి పోలీసుస్టేషన్లో సగటున 10 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేశారు. మంగళగిరిలో 11 కెమెరాలు ఉన్నాయి. నల్లపాడు, పెనమలూరు ఠాణాల్లోని పై అంతస్తులను రికార్డు చేయడానికి కెమెరాలు లేవు. ఫుటేజి అవసరమైనప్పుడు తమకు పాస్‌వర్డ్ చెబుతారనీ, డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత ఎస్పీ కార్యాలయానికి చెందినవారు పాస్‌వర్డ్‌ను మారుస్తారని పెనమలూరు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

# దుర్గమ్మ ఆలయంలో దసరాకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త** దుర్గమ్మ ఆలయంలో ఈ ఏడాది జరగబోయే దసరా ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. బుధవారం ఆయన దసరా ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్లకు సింహాచలం దేవస్థానం నుండి తెప్పించిన క్యూఫ్రేంలను వినియోగిస్తున్నారు. పోటు నిర్మాణంలో పలు సూచనలు చేశారు. పలు చోట్ల దసరా కోసం చేస్తున్న పెయింటింగ్‌లు పరిశీలించారు. అన్నదాన భవనం నాణ్యతతో పనులు సాగాలన్నారు. ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణం పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ భక్తులకు మెరుగైన దర్శనం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దుర్గమ్మ వారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.2లక్షల విరాళాన్ని మచిలీపట్నంకు చెందిన సర్వ కృష్ణమోహన్ ప్రసాద్ దంపతులు బుధవారం విరాళంగా అందించారు. అలాగే విజయవాడకు చెందిన విశ్వశ్రీ ప్రాజెక్టు, ఆరోఫామ్స్ ప్రై లి. యాజమాని చింత శివ రామకృష్ణ రు.1,00,116ల విరాళాన్ని అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.


దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపకనందిస్తున్న దృశ్యం

# సుప్రసిద్ధ రచయిత్రి కోకా విమలకుమారి మృతి

**విజయవాడ,సెప్టెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** డా ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు, సుప్రసిద్ధ రచయిత్రి కోకా విమలకుమారి విజయవాడలోని స్వగ్రహంలో ఈరోజు కన్నుమూశారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో ఇంటివద్దనే వుంటున్నారు. ఆమె వయసు 82 సంవత్సరాలు. విమలకుమారి కృష్ణాజిల్లా పులిగడ్డలో 1943 జులై 15న జన్మించారు. ఆదిని సుబ్బారావు శేషమ్మ తల్లిదండ్రులు. ఎం.ఏ తెలుగు లిటరేచర్ చేశారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేసి 2001లో ఉద్యోగ విరమణ పొందారు. భర్త కోకా నాగేంద్రరావు ఇప్పటికే కన్నుమూశారు. తెలుగు భాషా చైతన్య సమితి కార్యదర్శిగా, డా. ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలిగా అటు భాషకూ, సాహిత్యానికి ఎనలేని సేవలు చేశారు. వివిధ సాహితీ సంస్థలకు ఆమె సేవలందించారు. అక్షర సందేశం, అరుణమి కోసం, నిశ్శబ్ద వేదన, నవ్యపథం కవితా సంపుటాలు, తరుణీ తరంగాలు, విమలభారతి, కనుపర్తి వరలక్ష్మమ్మ జీవితంసాహిత్యం, శ్రీకృష్ణదేవరాయ ప్రతిభాపుష్పంవ్యాస సంపుటాలు, పున్నమి నవ్వింది, మనసు కదిలింది కథా సంపుటాలు వెలువరించారు. 1988లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు గారి చేతులమీదుగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉగాది పురస్కారం, ఢిల్లీ తెలుగు అకాడమీ వారి ఉత్తమ కవయిత్రి పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ వారి ఉత్తమ కవయిత్రి పురస్కారం, ఫౌండేషన్ ఫర్ ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ వారిచే ఉత్తమ కవయిత్రి ఉగాది పురస్కారం, నాళం కృష్ణారావు డా ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ అవార్డు, వి. ఆర్. నార్ల స్మారక విశిష్ట సేవా అవార్డు,యునెస్కోఖి ఇంటర్నేషనల్ రేపల్లె వారి అవార్డు, వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్, హైదరాబాద్ వారిచే ఉత్తమ కవయిత్రి పురస్కారం, నెల్లూరి వారిచే నాగభైరవ కోటేశ్వరరావు స్మారక సాహితీ స్ఫూర్తి అవార్డు, పెన్నా రచయితల సంఘం వారి పురస్కారం 2013, ఇన్నర్వీల్ క్లబ్ ఏలూరువారిచే ఉత్తమ రచయిత్రి అవార్డు, తెలుగుభాషోద్యమ సమాఖ్య, గుంటూరు వారి ప్రతిభా పురస్కారం,

నల్లూరి బసవ శంకర కళాపీఠం, విజయవాడ వారి పురస్కారం, పి.ఎమ్.కె.ఎమ్.ఫైన్ ఆర్ట్స్ వారి సేవారత్న అవార్డు, సాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వారి బాలసేవారత్న అవార్డు, ఆకాశవాణి స్వర్ణోత్సవాల సందర్భంగా అప్పటి మంత్రివర్యులు మండలి బుద్ధప్రసాద్ గారిచే ఉత్తమ రచయిత్రి పురస్కారం అందుకున్నారు. డా ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ గారి చేతుల మీదుగా కవితరంగిణి బిరుదు, యునెస్కో రేపల్లె వారి సాహితీ సరస్వతిఖి బిరుదు, సాయిమంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి బాలసేవారత్న బిరుదు పొందారు.

# లిక్కర్ కుంభకోణంలో విజయానందరెడ్డికి లింకులు

## - చిత్తూరులో సిట్ దర్యాప్తు బృందం విస్తృతంగా తనిఖీలు

చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం కల్గిస్తున్న లిక్కర్ స్కాం లింకులు జిల్లా కేంద్రం చిత్తూరుకు చేరాయి. లిక్కర్ కుంభకోణంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డికి లింకులు వున్నాయని నిర్ధారణకు వచ్చిన సిట్ ప్రత్యేక బృంద అధికారులు బుధవారం చిత్తూరులోని ఎంసి విజయానందరెడ్డి ఇంటిని చుట్టుముట్టారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సిట్ ప్రత్యేక బృందం ఎంసి విజయానందరెడ్డి ఇంటిని విస్తృతంగా తనిఖీలు చేస్తూనే వున్నారు. గత వైకాపా ప్రభుత్వం అధికారంలో వున్న ఐదేళ్ళలో పెద్ద ఎత్తున లిక్కర్ కుంభకోణంకు పాల్పడిందని భావించి రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మద్యం కుంభకోణంపై దర్యాప్తు చేపట్టడానికి ప్రత్యేక సిట్ బృందంను ఏర్పాటు చేసింది. ఈ సిట్ ప్రత్యేక బృందం ఇప్పటికే చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిని అరెస్టు చేయడంతో వారిద్దరు ప్రస్తుతం జైలులో రిమాండ్‌లో వున్నారు. అలాగే మద్యం కుంభకోణంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు మోహిత్‌రెడ్డి ప్రమేయం సైతం వుందని భావించిన సిట్ ప్రత్యేక బృందం ఆయనను సైతం విచారణ చేస్తున్నారు. ఇటీవల మాజీ డిప్యుటీ సిఎం, గత మంత్రి వర్గంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా విధులు నిర్వర్తించిన నారాయణస్వామిని సిట్ అధికారులు దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో సిట్ అధికారులు పక్కా సమాచారంతో ఈ స్కాంలో చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డికి లింకులు వున్నాయని భావించి బుధవారం సిట్ అధికారులు ఆయన ఇంటిని చుట్టుముట్టారు. గత ప్రభుత్వంలో ఎంసి విజయానందరెడ్డి మద్యం డిపోల నుండి మద్యం షాపులకు మద్యం సరఫరా చేయడానికి వాహనాలు ఏర్పాటు చేసే కాంట్రాక్టర్ అని, ఈ క్రమంలో సిట్ అధికారులు విజయానందరెడ్డి ఇంటిని చుట్టూముట్టి ఆధారాల కోసం విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. అయితే సిట్ అధికారులు మాత్రం విజయానందరెడ్డి ఇంటి నుండి ఏమి స్వాధీనం చేసుకున్నారు! ఏం తనిఖీలు నిర్వహించారనే విషయం మాత్రం బయటికి పొక్కకుండా చేస్తున్నారు.




# ఏషియన్ మస్క్యూలో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా డా వివిఎన్ వరప్రసాద్

**విజయవాడ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** ఏషియన్ మస్కూ ్యలో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షునిగా ప్రముఖ రేడియాలజిస్టు డా వివిఎన్ వరప్రసాద్ పదవీ బాధ్యతలు చేపట్టడం శుభపరిణామమని పలువురు వక్తలు ప్రశంసించారు. ఇండియన్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు జివి మోహన్ ప్రసాద్ విజయవాడలో జరిగిన మీడియా సమావేశంలో డా వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం మోహన్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ పదవి నిర్వహిస్తున్న మొదటి బారతీయ రేడియాలజిస్టు డా వేమూరి నాగప్రసాద్ ఎంపికవడం గర్వకారణమన్నారు. డా వరప్రసాద్ మాట్లాడుతూ వివిధ దేశాల్లో గల సొసైటీలు, రేడియాలజీలోని మస్క్యూలో స్కెలిటల్ విభాగంలో వున్న పద్ధతుల అంతరాన్ని సరిచేసి, వాటిని అనుసందానం చేయడమనే నినాదంతో సింగపూర్లో నిర్వహించిన 27వ వార్షిక సమావేశంలో ఎన్నికైన తాను వచ్చే రెండేళ్లలో ఈ థీం లక్ష్యాన్ని నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో ఐఆర్ ఐఏ, సెంట్రల్ కౌన్సెల్ మెంబర్ డా చలసాని కులదీప్, ఐఆర్ఐ ఏ విజయవాడ చాప్టర్ ప్రెసిడెంట్ డా బి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# 10న అనంతకు సిఎం చంద్రబాబు రాక

## - బహిరంగ సభ ఏర్పాటుకు సన్నాహాలు

**అనంతపురం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 10వ తేదీన అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న జిఎంఆర్ గ్రౌండ్స్ వద్ద బుధవారం రాత్రి ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వెంకటరాముడు తదితరులు పరిశీలించారు. మ్యాప్ ద్వారా ఏర్పాట్లను పరిశీలించి వివరాలను తదితరులు ఆరా తీశారు. హెలిప్యాడ్, సభాస్థలి, పార్కింగ్, తదితర ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి వద్ద, హార్మోని సిటీలో పలు స్థలాలు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, అనంతపురం ఆర్డిఓ కేశవ నాయుడు, తహసిల్దార్లు హరికుమార్, మోహన్ కుమార్, ఆయా శాఖల అధికారులు, పాల్గొన్నారు.


సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి పర్యటన కో ఆర్డినేటర్, ఇతర ముఖ్యులు

# గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పూర్తయిన గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 3,ప్రభాతవార్త** కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్, విద్యుత్ రైలు మార్గం పనులను రాయలసీమ జిల్లాలలోని అనంతపురం, ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొమ్మిది దశల్లో చేపట్టి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత కాలవ్యవధిలోపు ప్రాజెక్టు పనులను పూర్తి చేసి సరికొత్త రికార్డు నెలకొల్పింది. దీంతో కేంద్ర పౌర విమానయాన శాఖకు చెందిన రైల్వే భద్రతా కమీషనర్ మాధవి బృందం ఈ నెల 1న పాణ్యం-నంద్యాల మధ్య విస్తృత తనిఖీలు నిర్వహించి పలు సలహా,సూచనలతో అంచెలంచెలుగా నిర్ణీత వేగంతో రైళ్లు నడిపేందుకు సూచన ప్రాయంగా అనుమతులు మంజూరు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో 9దశల్లో పూర్తయిన డబ్లింగ్, విద్యుదీకరణ ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. డోన్-పెండేకల్లు మధ్య 27.441కి.మీలను 8-3-2020నుంచి అందుబాటులోకి తెచ్చారు. పెండేకల్లు-ఎద్దులదొడ్డి మధ్య 8.581కి.మీలను 21-1-2021నుంచి, ఎద్దులదొడ్డి-మద్దికెర మధ్య 22.546కి.మీలను 22-2-2022న ుంచి, బేతంచెర్ల-మల్కాపురం మధ్య 25.285కి.మీలను 26-3-2023 నుంచి,మద్దికెర- గుంతకల్లు మధ్య 10.748కి.మీలను 25-7-2023నుంచి, మల్కాపురం-డోన్ మధ్య 11.232కి.మీలను 26-11-2023నుంచి, బుగ్గానిపల్లి సిమెంట్ నగర్-బేతంచెర్ల మధ్య 6.233కి.మీలను 27-3-2024నుంచి, ఈ మార్గంలో అత్యంత కీలకమైంది నలమల్ల అటవీ ప్రాంతం ప్రారంభమయ్యే పాణ్యం-క్రిష్ణమ్మ కోన-బుగ్గానిపల్లి సిమెంట్ నగర్ మధ్య 19.035కి.మీలను 27-12-2024నుంచి, పాణ్యం-నంద్యాల మధ్య పూర్తి చేసిన 14.53కి.మీల డబ్లింగ్ రైలు మార్గాన్ని ఈ నెల 1న రైల్వే భద్రతా కమిషన్ విస్తృత తనిఖీలు నిర్వహించి వేగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ప్రత్యేక రైలు గరిష్ట వేగం 130కి.మీల మైలురాయిని చేరుకుంది.

# వైభవోపేతం.. కాణిపాకం రథోత్సవం -పోటెత్తిన భక్తజనం

**కాణిపాకం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారికి రథోత్సవం అంగరంగ వైభవోపేతంగా జరిగింది. ఈమేరకు వేకువజామున దేవస్దానం వారిచే అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి సర్వాంగసుందరంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుండి తీసుకువచ్చి రథంపై ప్రతిషి ్టంచి శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్లకు అర్చకస్వాములు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు, అశేషంగా తరలివచ్చిన భక్తజనం గణేష్ నామస్మరణల నడుమ కొంత దూరం లాగి వదిలిపెట్టారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ కర్పూర హారతులతో పాటు రథంపై భక్తులు బొరుగులు, మిరియాలు, ఉప్పు చల్లి మొక్కులను తీర్చుకున్నారు. అలాగే మహిళలు పెత్తఎత్తున పిండి తలిగలు వేసి మొక్కులు తీర్చుకున్నారు.తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా రథానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా.... పదాతి దళాలు, విచిత్ర వేషదారణలు, కోలాటాలు, చెక్కభజనలు, వివిధ రకాల వేషదారణలు, పిల్లనగ్రోవి,నృత్యాలు వంటి పలు రకాల వైవిద్యభరితమైన సాంస ్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు భక్తుల గణేష్ నామస్మరణలు మిన్నంటుతుండగా స్వామివారు రథంపై కాణిపాకం పురవీదుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చిన అశేష భక్తజనంతో కాణిపాకం పురవీధులన్ని కిక్కిరిశాయి. రథోత్సవం సందర్భంగా ప్రఖ్యాత కళాకారులచే ప్రదర్శించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. అలాగే రథోత్సవం సందర్భంగా ప్రధాన ఆలయాని ్న వివిధ రకాల స్వదేశీ,విదేశీ జాతి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చిత్తూరు డీఎస్పీ సాయినాధ్,, రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడుల ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# వరసిద్ధునికి ద్వారకా తిరుమల తరపున పట్టువస్త్రాల సమర్పణ

**కాణిపాకం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సిద్ధి, బుద్ధి సమేత స్వామి,అమ్మవార్లకు శ్రీద్వారకా తిరుమల దేవస్థానం తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రముఖ ఆలయాల నుండి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించడం గత కొన్నేళ్ళుగా ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు శ్రీద్వారకా తిరుమల దేవస్థానం తరపున ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణ మూర్తి దంపతులు, ఆలయ అధికారులు, అర్చకులు బుధవారం ఉదయం కాణిపాకం ఆలయం చేరుకుని స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి పట్టువస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామివారి ఎదుట వుంచి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఈఓ, అధికారులకు దర్శనానంతరం స్వామివారి శేషవస్త్రాలను, చిత్రపటాలను,ప్రసాదాలను అందజేశారు. ఇదిలా వుండగా కాణిపాకం ఆలయానికి పట్టు వస్త్రాలను తీసుకువచ్చిన ద్వారకాతిరుమల ఈఓ, ఆలయ అధికారులు, సిబ్బందిని కాణిపాకం దేవస్థానం తరపున సత్కరించగా, ద్వారకా తిరుమల దేవస్థానం తరపున కాణిపాకం ఆలయ ఈఓ పెంచల కిషోర్, అధికారులు, సిబ్బందిని సత ్కరించారు. ఈకార్యక్రమంలో కాణిపాకం, ద్వారకా తిరుమల దేవస్థానం ఏఈఓ రమణరాజు,అధికారులు, అర్చకులు, కాణిపాకం ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ధనుంజయ, ధనపాల్, ఎస్వీ,కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు, అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు. అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో పవిత్రోత్సవాలకు శ్రీకారం

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో వార్షిక పవిత్రోత్సవాలు గురువారం భక్తి శ్రద్ధలతో స్థానిక సంప్రదాయం ప్రకారం ప్రారంభమయ్యాయి. ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆలయ డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిచే సంకల్పం చేయించారు.ఆలయంలో నిత్యం జరిగే పూజలు,అభిషేకాలు,సేవలకు సంబంధించి తెలిసి తెలియక జరిగే తప్పిదాలను నివృత్తి చేయటానికి మూలవిరాట్లకు పునరేత్తేజం తెచ్చే విధంగా పూజలను చేపట్టారు. ఐదు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించే ఈ పూజలకు ఎంతో ప్రాధాన్యత చోటు చేసుకుంది. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లను మహర్షి భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి విశేష అభిషేక పూజలు నిర్వహించారు.ఉత్సవర్లకు వివిధ రకాల పూజ ద్రవ్యాలతో అబిషేకాలు నిర్వహించారు.విశిష్ట అలంకారాలు, ధూపదీప నైవేద్యాలు నివేదించి పూర్ణాహుతి అందించారు. శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో నిర్వహించే ప్రతి ధార్మిక కార్యక్రమాల్ని లోక క ళ్యాణార్థం నిర్వహించుటకు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి తో చర్చించి కార్యక్రమాల్ని రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇక్కడి ఆచార వ్యవహారాలు ప్రత్యేకత ఉంటుందన్నారు. మూలవిరాట్లకు మంత్రంతో నూతన తేజస్సు తీసుకురావటం వల్ల ఈ ప్రాంతాలన్నీ సస్యశ్యామలం కావాలని దర్శించుకున్న భక్తులకు దేవతా మూర్తుల ఆశీస్సులు లభించి ప్రతి ఒక్కరు ఆయూరారోగ్యాలతో అష్యూశ్వర్యాలతో తుల తూగాలని, పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని దోషాలన్ని హరించాలని పూజా కార్యక్రమాలు సంప్రదాయపద్ధతిలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమాలు ఐదు రోజులుగా నిర్వహిస్తున్నట్లు ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రదానార్చకులు డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరిస్వామి,ప్రధానార్చకులు కరుణాకర్ గురుకకుల్,సంబంధం గురుకుల్,దక్షిణామూర్తి శ్రీనివాస గురుకుల్, తేజస్వామి, గోవింద్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య డీల్‌తో

# కమిషన్ నివేదిక లోపభూయిష్టం

### బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య జరిగిన డీల్ వల్లే కమిషన్ నివేదిక లోపభూయిష్టంగా ఉందని బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బీహార్ ఎన్నికల కోసం ఖజానా చోరీ జరిగిందని, సూటికేసులు అందాక బిఆర్ఎస్ కోర్టుకు వెళ్లి ఉపశమనం పొందిందన్నారు. విచారణ కోసం సిబిఐకి ఇస్తున్నట్లు కొత్త నాటకానికి తెర లేపిందన్నారు. ప్రభుత్వం కాంగ్రెస్ వ్యవహారం తెలిసే బిజెపి ముందు నుంచి సిబిఐకి ఇవ్వాలని డిమాండ్ చేసిందన్నారు. రేవంత్ కమిషన్ వేస్తే రాహుల్ గాంధీ కమీషన్ దండుకోవాలని చూస్తున్నారన్నారు. కెసిఆర్, హరీష్ రావును కాపాడుతుంది రాహుల్ గాంధీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఏజీ న్యాయస్థానంలో ఎవరి కోసం వాదిస్తున్నారనే అనుమానం ప్రజలకు కలుగుతుందన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ప్రభుత్వం సిబిఐ విచారణ కోరిందన్నారు. పిసి ఘోష్ కమిషన్ నివేదికపై రాష్ట్ర హైకోర్టులో ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ బలమైన వాదనలు వినిపించకపోవడంవల్లనే టిఆర్ఎస్ నాయకులు కెసిఆర్‌కి, హరీష్‌రావుకి ఉపశమనం కలిగిందన్నారు.

# 20 శాతం అదనపు సీట్లు కేటాయించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 100 బీసీ కాలేజీ హాస్టల్‌ను మంజూరు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. ప్రస్తుత కొనసాగుతున్న హాస్టల్లో 20 శాతం అదనపు సీట్లు కేటాయించాలన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, సంగారెడ్డి, నిజాంబాద్ జిల్లా హెడ్ క్వార్టర్లలో సీట్లు లభించక వేలాది మంది విద్యార్థులు సీట్ల కోసం ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి డిమాండ్ అధికంగా ఉన్న జిల్లాలలో బిసి కాలేజీ హాస్టళ్లను మంజూరు చేయాలని ఆయన సీఎంకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లాలో 10 బాలికల,10 బాలుర హాస్టల్స్ చొప్పున మంజూరు చేయాలని, అలాగే మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్, సంగారెడ్డి జిల్లాలో ఐదు బాలికల,ఐదు బాలుర హాస్టల్స్,వికారాబాద్ జిల్లాలో ఐదుబాలుర ,ఐదు బాలికల హాస్టల్స్, వరంగల్ జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్, నల్లగొండ జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్, వరంగల్ జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్,మేడ్చల్ జిల్లాలో ఐదు బాలికల,ఐదు బాలురు హాస్టల్స్,రంగారెడ్డి జిల్లాలో ఐదు బాలికల, ఐదు బాలుర హాస్టల్స్‌లను మంజూరు చేయాలని ఆర్.కృష్ణయ్య సిఎంకు విజ్ఞప్తి చేశారు.

# అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

### మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేసిన ఎఐటియుసి నాయకులు

**హైదరాబాద్,సెప్టెంబరు 3,ప్రభాతవార్త:** అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ హెల్పర్స్ అసోషియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షురాలు సాయీశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి,రాష్ట్ర డిప్యూటి జనరల్ సెక్రటరి సీతా మహాలక్ష్మిలు మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు బుధవారం సచివాలయంలో ఆమెకు వినతి పత్రం అందించారు. పోషణ్ ట్రాకర్ యాప్‌లో భాగంగా ఫేస్‌రికగ్నిజేషన్ సిస్టమ్‌ను అమలు చేయడంతో అంగన్‌వాడీలు సేవలు అందించేందుకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఐసిడిఎస్ పరిధిలో అంగన్‌వాడీ సేవలు గర్భిణీలకు, పాలిచ్చే తల్లులకు, 6 నెలల నుండి 3 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు టేక్ హోమ్ రేషన్ (టిహెచ్‌ఆర్) మరియు పోషక సహాయం అందించేవని, అయితే, ఇప్పుడు ఎఫ్‌ఆర్ఎస్ అమలుతో అనేక మంది లబ్ధిదారులు పోషకాహారాన్ని పొందలేక పోతున్నారు. డిజిటైలేజషన్ ఆమోదించదగ్గదే కాని ఇది బలహీన వర్గాల కోసం ఇబ్బంది కలిగించే సాధనంగా మారకూడదన్నారు. ఎఫ్‌ఆర్ఎస్ తప్పనిసరి అమలు రద్దు చేయాలని, ఆధార్ లేదా ఫేస్ రికగ్నిషన్ లేకుండా అర్హులైన లబ్ధిదారులు పోషణ పొందేలా చూడాలన్నారు. ఎన్‌హెచ్‌టిఎస్ పోషణ ట్రాకర్ యాప్‌లను ఒకటిగా రూపొందించి సరళతరం చేయాలని మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు.


### కాళేశ్వరం అవినీతి బయటపడ్డాక, కెసిఆర్

## కుటుంబంలో పంచాయతీ: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** కాళేశ్వరం అవినీతి బయట పడిన తరువాత కెసిఆర్ కుటుంబంలో పంచాయతీ మొదలైందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. అది కుటుంబ తగాదా అని, కవిత టిఆర్ఎస్‌పై అనేకసార్లు దాడి చేసిందన్నారు. కల్వకుంట్ల కుటుంబంలో ఆరు నెలల నుంచి ఇంటర్నల్ పంచాయతీ జరుగుతుందన్నారు. లక్ష కోట్లు దోచుకున్నాక మాట్లాడడం ఏంటి? అంటూ ప్రశ్నించారు. హరీష్ రావు వెనుక రేవంత్ రెడ్డి ఉంటే కాళేశ్వరంపై విచారణ ఎందుకు చేయిస్తారు, కమిషన్ ఎందుకు వేస్తారు అన్నారు. మీ కుటుంబం దొంగతనం చేసిందని ఒప్పుకుంటున్నావు కదా? కాళేశ్వరం అవినీతిలో హరీష్ రావు, సంతోష్ రావు బాధ్యులని కవిత ఒప్పుకుందన్నారు. వారు మీ కుటుంబ సభ్యులే కదా, మాకేం సంబంధం అనడం ఏమిటన్నారు. పది ఏళ్లలో రాష్ట్ర ఖజానలో వేల కోట్లు ఖూనీ చేశారని, హరీష్ రావు వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారనేది గ్లోబల్ ప్రచారం మాత్రమే అన్నారు. కవితని బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాల్సింది ఇప్పుడు కాదు, లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయినప్పుడే సస్పెండ్ చేయాలి కదా అన్నారు.

# తాటికుంట రిజర్వాయర్‌లో భార్య భర్తలు గల్లంతు

### బోటులో వెళ్లి పరిశీలించిన ఎమ్మెల్యే, ఎస్పీ




**మల్దకల్ ఆగస్టు 3, ప్రభాతవార్త:** మల్దకల్ మండలం తాటికుంట గ్రామంలో చేపల వేటకు వెళ్లిన దంపతులు గల్లంతవడంతో గ్రామంలో విషాదం చాయలు అలుముకున్నాయి. పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తాటికుంట గ్రామానికి చెందిన దుబ్బోనీబావి రాముడు (40), భార్య సంధ్య (35) ఇద్దరూ తాటికుంట రిజర్వాయర్ కు చేపల వేట కోసం వెళ్లారు. అయితే రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు వెతికినా ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో వెంటనే అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఇప్పటివరకు దంపతుల ఆచూకీ తెలియకపోవడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి , జిల్లా ఎస్పీ శ్రీనివాసులు రావు సంఘటన స్థలానికి చేరుకుని రిజర్వాయర్‌లోకి బోటులో వెళ్లి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తీవ్ర విషాద సంఘటన జరగడం చాలా బాధాకరం అని తెలిపారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం నుండి వారికి సహాయమందించే విధంగా కృషి చేయడం జరుగుతుంది తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు ప్రభాకర్ గౌడ్, అజమ్, చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంపులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

**ఊట్కూర్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :**ఊట్కూర్ మండలం పరిధిలోని తిమిరెడ్డిపల్లె తండాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు జయమ్మ-పునే నాయక్ దంపతులకు ఇద్దరు కుమారులు అభి, ఆకాష్ నీటి సంపులో జారిపడి ప్రాణాలు కోల్పోయారు. జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న కుటుంబం, వినాయక నిమజ్జనానికై స్వగ్రామానికి వచ్చింది. ఇటీవల ఇంటి నిర్మాణం కోసం గ్రామంలో కొత్తగా నీటి సంపు తవ్వించగా, అందులో చిన్నారులు జారిపడినట్లు గ్రామస్థులు తెలిపారు.

## స్థానిక సంస్థలలో వికలాంగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కోరిన వికలాంగుల సాధన కమిటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ సభ్యులు టిపిసిసి ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను వికలాంగుల సాధన కమిటీ సభ్యులు కోరారు. బుధవారం గాంధీభవన్‌లో మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రతి మండలానికి కనీసం రెండు ఎంపిటిసి స్థానాల్లో వికలాంగులు ప్రాతినిధ్యం వహించేలా ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకోవాలని వారు కోరారు.

# సమ్మక్కసారక్క జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి

### మేడారం మాస్టర్ ప్లాన్ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



బుధవారం జరిగిన సమీక్షలో పాల్గొన్న మంత్రులు కొండాసురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్,సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సమ్మక్క సారక్క వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్‌శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో మేడారం మాస్టర్ ప్లాన్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మ పూజారుల సూచనల మేరకు మేడారం దేవాలయ ప్రాంగణ నూతన డిజైన్‌ను మంత్రులు ప్రత్యేకంగా పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై మంత్రులు సూచనలు చేశారు. మేడారం నిర్వహణ పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహా మేడారం జాతరలోపు పూర్తి చేయాల్సిన పనులను త్వరగా చేపట్టాలని మంత్రులు సూచించారు. భక్తుల సందర్శనార్థం అమ్మవారి గద్దెల ఎత్తు పెంచాలని పూజారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా తగిన మేరకు డిజైన్లు మార్చాలన్నారు. భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలు ఒకే వరుస క్రమంలో ఉండేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తద్వారా ఎలాంటి జాప్యం లేకుండా సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకునేందుకు అనువుగా ఉంటుందని మంత్రులు చెప్పారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మక్క సారలమ్మ సేవ కోసం జాతర సమయంలో భక్తులకు సహాయపడేందుకు వాలంటీర్లను నియమించాలన్నారు. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయ బద్ధంగా మేడారం పరిసరాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. మేడారం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ మహా మేడారం జాతరకు రూ. 150 కోట్లు ప్రజా ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. అవసరమైతే ఇతర శాఖల సహాయంతో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, మేడారం మాస్టర్ ప్లాన్ డిజైన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి ఆయన అనుమతి తీసుకున్న తర్వాత ముందుకు వెళతామన్నారు. మేడారం అభివృద్ధి ప్రతి దశలో పూజారుల ను భాగస్వామ్యం చేస్తామన్నారు. సమ్మక్క సారలమ్మల త్యాగాన్ని ఔన్నత్యాన్ని మరింత చాటి చెప్పే విధంగా మేడారం ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తామన్నారు. సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తుందని మంత్రులు చెప్పారు. దేశ విదేశాల నుంచి వచ్చే వారి కోసం సకల సౌకర్యాలు కల్పించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు జరిగితే మేడారం జాతరమరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతర సమయంలో వెహికల్ మేనేజ్మెంట్ సరైన విధంగా ఉండేలా డిజైన్‌లు రూపకల్పన చేయాలని, ప్యూరిఫైడ్ వాటర్ అందించాలని మంత్రి సురేఖ సూచించారు. బెల్లం కింద పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అడ్లూరి సలహానిచ్చారు. బ్యాటరీ వెహికల్స్‌ను వినియోగించుకోవాలన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంటుకి ఏఐ ఎనబుల్డ్ కెమోరాలను ఉపయోగించాలని, సేవా పద్ధతిన భక్తులను మ్యాన్ పవర్ కింది వినియోగించుకోవాలన్నారు. వనజాతర వస్తున్న తరుణంలో దారి పొంటి ఉన్న టెంపుల్స్‌ను కూడా అవసరమైన మేరకు అలంకరణ చేయాలన్నారు. ఈ క్రమంలో భక్తులు ఆయా టెంపుల్‌లను దర్శించుకుంటారని మంత్రి సురేఖ చెప్పారు. జాతర వెళ్ళే దారి ఇందిరా మహిళా క్యాంటీలను ద్వారా తినుబండారాలను అందే విధంగా చూడాలన్నారు. అవసరమైతే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలను వివిధ ప్రదేశాల్లో ఉపయోగించుకొని తగు సేవలు భక్తులకు అందజేయాలన్నారు. జాతర విజయవంతం రహదారులపై ఆధారపడి ఉంటుందని అందుకే, మేడారం ఊరట్టం, మేడారం కన్నెపల్లితో పాటు మరో నాలుగు మార్గాల విస్తరణ పనులు చేపడుతున్న వివరాలు మంత్రులకు అధికారులు తెలిపారు. నేషనల్ హైవే అధికారులతో అవసరమైతే మరొకసారి రివ్యూ చేయాలని మంత్రులు నిర్ణయించారు. సమ్మక్క, సారక్క అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పూర్వం నుంచి చోటుచేసుకున్న మార్పులు, పూజారుల ప్రమేయం, అంగీకారంతోనే చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు. గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దాన్ని క్రమబద్దీకరించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. డిసెంబర్ వరకు ఎంతమేరకు వర్కులు పూర్తవుతాయో చెప్పాలన్నారు. మాస్టర్ ప్లాన్‌లో మొత్తం రెండు ఫేజ్‌లుగా స్థానికంగా అభివృద్ధి పనులు చేపడుతున్నరని అన్నారు. గతం కంటే ఈ సారి చాలా ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలోఎండోమెంటు ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ములుగు కలెక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. పలుమార్లు కుంభమేళలు నిర్వహించిన సంస్థకు మాస్టర్ ప్లాన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్టు అధికారులు మంత్రులకు వివరించారు. మొత్తం రూ. 236.2 కోట్లతో మాస్టర్ రూపొందించగా, గద్దెల అభివృద్ధికి రూ. 58.2 కోట్లు గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ. 6.8 కోట్లు జంపన్న వాగు అభివృద్ధి కోసం రూ. రూ39 కోట్లు. భక్తుల అకామిడేషన్ నిమిత్తం రూ. 50 కోట్లు రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ. 52.5కోట్లు మిగతావి ఇతరత్రా ఖర్చుల నిమిత్తం వెచ్చించనున్నారు.

# అక్రమ సంబంధం అడ్డుతోనే డబుల్ మర్డర్..

### జూన్ 25న కవిత భర్త కుమారస్వామి, ఆగస్టు 3న వర్షిణీ హత్య

### క్షుద్రపూజలుగా చిత్రీకరించిన వైనం

### హత్య కేసును ఛేదించిన కాటారం పోలీసులు




మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** కాటారం పోలీస్ స్టేషన్‌లో గత నెల ఆగస్టు 25న నమోదైన కప్పల వర్షిణీ హత్య కేసుకు సంబంధించిన వివరాలను జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మీడియాకు వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ కథనం మేరకు గత నెల 28న కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలో కమలాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని అమ్మాయి మృతదేహంపడి ఉందని, శవానికి చుట్టు పక్కల క్షుద్ర పూజలు చేసినట్టుగా ఆనవాళ్లు ఉన్నాయని సమాచారం రాగా కాటారం ఎస్సై ఆకుల శ్రీనివాస్,సిఐ నాగార్జునరావు, డిఎస్పి సూర్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా చనిపోయిన అమ్మాయి కప్పల వర్షిణీ గుర్తించారన్నారు. గత నెల 3వ తేదీ నుండి కనిపించడం లేదని వర్షిణి తల్లి అయిన కప్పల కవిత స్థానిక పోలీస్ స్టేషన్ చిట్యాలలో గత నెల 6న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా మంగళవారం కాటారం సిఐ నాగార్జున రావు తన సిబ్బందితో గంగారం క్రాస్ రోడ్ సమీపంలో వాహన తనిఖీ చేస్తుండగా టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్ పైన మృతురాలి తల్లి అయిన కప్పల కవిత, మరొక వ్యక్తితో కొయ్యూరు నుండి కాటారం వైపుగా వస్తుండగా పోలీసు చూసి తమ వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకొని విచారించగా వారి నేరమును అంగీకరించినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసు విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పల కుమారస్వామి తండ్రి సమ్మయ్య మొదటి భార్య చనిపోగా కొయ్యూరు మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన మాదరవేణి కవితను రెండో వివాహం చేసుకొన్నారు. వీరి ఇరువురికి ఇద్దరు ఆడ సంతానం. కాగా వారిలో పెద్ద అమ్మాయి కప్పల వర్షిణీ(22), చిన్న అమ్మాయి కప్పల హాన్సిక (21) ఉన్నారు. కాగా చిన్న అమ్మాయికి వివాహమై ఇంటి నుండి వెళ్లిపోగా ఒడతల గ్రామంలో పెద్దమ్మాయి వర్షిణీతో పాటు భార్య భర్తలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా గత ఐదు సంవత్సరముల క్రితం కవిత భర్తకు పక్షవాతం వచ్చి ఇంటికి పరిమిత మయ్యాడు. కాగా కప్పల కవితకు అదే గ్రామానికి చెందిన అవివాహితుడైన జంజర్ల రాజ్ కుమార్ తండ్రి మారయ్య (24) పరిచయంతో అక్రమ సంబంధం ఏర్పడిందన్నారు. ఈ విషయం కప్పల కవిత భర్త కుమారస్వామికి తెలియడంతో తరచూ తగాదాలు జరుగుతున్నాయన్నారు. భర్తఅడ్డును తొలగించాలని భావించి జూన్ 25న తన కూతురు ఇంట్లోలేని సమయంలో భర్తను కవిత కదలకుండా కాళ్లు పట్టుకోగా రాజ్ కుమార్ నోరు మూసి గొంతు నొలిమి హత్య చేసి, అక్కడి నుండి వెళ్లిపోగా కవిత తన భర్త అనారోగ్యంతో చనిపోయాడని ఊరివారిని, బంధువులని నమ్మించి అంత్యక్రియలు జరిపించారు. తర్వాత కొన్ని రోజులకు వర్షిణీ తన తల్లిని నిలదీయడంతో అమ్మాయిని అడ్డు తొలగిస్తే, అక్రమ సంబంధానికి ఎటువంటి అడ్డంకులు ఉండవని రాజ్ కుమార్ తెలుపగా దానికి అంగీకరించిన కవిత ఇద్దరు కలిసి ముందస్తు పన్నాగంతో గత నెల 2న అర్ధరాత్రి తెల్లవారితే 03/08/2025 ఉదయం రెండు గంటల సమయంలో ఇంట్లో గాఢ నిద్రలో ఉన్న తన కూతురు వర్షిణీని తన భర్తను చంపిన విధంగానే హత్య చేసి మృతురాలిని తన ఇంట్లో ఉన్న సంచిలో మూటకట్టి ఇంటి వెనకాల ఉన్న చెట్ల పొదలలో దాచిపెట్టి, అదే రోజు రాత్రి అక్కడి నుండి ఒడితల గ్రామ శివారులో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్ వెనకాల ఉన్న దుబ్బగట్టుగుట్ట చెట్ల పొదలలో పడవేశారన్నారు. కాగా గత నెల 6న కప్పల కవిత చిట్యాల పోలీస్ స్టేషన్‌కి వచ్చి తన కూతురైన వర్షిణీ కనిపించడం లేదని ఫిర్యాదు చేయగా చిట్యాల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఇదిలా ఉండగా దుబ్బగట్టు గుట్టలో దాచిన శవంను రాజకుమార్ రెండు రోజులకు ఒకసారి వెళ్లి చూసి వస్తూ ఆట్టి శవాన్ని ఎవరైనా చూస్తే వారి ఇరువురి పైకి వస్తుందనే భయంతో గత నెల 25సాయంత్రం ఏడు గంటల సమయంలో శవాన్ని రాజ్ కుమార్ యూరియా సంచిలో ఉంచి దానికి తాడుకట్టి టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్ పైన మధ్యలో శవాన్ని ఉంచుకొని ఒడితల గ్రామం నుంచి తీసుకొని వచ్చి కమలాపూర్ క్రాస్ రోడ్ దాటిన తర్వాత నేషనల్ హైవేకి పక్కన పడేయడం జరిగిందన్నారు. పోలీసువారి దృష్టి మరల్చడం కోసం శవం పైన పసుపు, కుంకుమ చల్లి, నిమ్మకాయలు ఉంచి శవం చుట్టూ ఇనుప మేకులు కొట్టి క్షుద్ర పూజలు చేసి చంపినట్లుగా చిత్రీకరించి అక్కడ నుండి ఒడితల గ్రామానికి వెళ్లిపోయి ఎవరికి ఏమీ తెలియనట్లుగా ఎవరింట్లో వారు ఉన్నారన్నారు. కవిత తన భర్తను, కూతురిని చంపిన విషయం ఎప్పటికైనా బయటకి వస్తుందన్న భయంతో రాజ్‌కుమార్‌తో కలిసి ఒడితల గ్రామంనుండి బస్వాపూర్ రోడ్డు మీదుగా కొయ్యూరు నుండి గంగారం క్రాస్ మీదుగా మహారాష్ట్రవెళ్లే ఉద్దేశంతో వస్తూ ఉండగా పోలీసు వారు వారినిపట్టుకుని అరెస్టు చేసికోర్టుకు తరలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా హత్య కేసులను చాకచక్యంగా ఛేదించిన అధికారులను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అభినందించినట్లు తెలిపారు.

## విధుల్లో చేరిన లెఫ్టినెంట్ జనరల్ హార్పల్ సింగ్

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాహుల్ బొజ్జాలను మర్యాద పూర్వకంగా కలిసిన సింగ్



**హైదరాబాద్,సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖా సలహాదారుడిగా నియమితులైన లెఫ్టినెంట్ జెనరల్ కల్నల్ హార్పల్ సింగ్ విధుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసేందుకు రూపొందించిన ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ నిమిత్తం బుధవారం రోజున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్‌బొజ్జ, సల హాదారు ఆదిత్యా దాస్ నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ లతో పాటు ఇ. ఎన్.సిలు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. సివిల్ ఇంజినీరింగ్ లో పట్టభద్రుడైన లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ టన్నెల్ నిర్మాణ రంగంలో అపార అనుభవం గడించిన దృష్ట్యా ఆయనను ఈ శాఖలో నియమించిన విషయం విదితమే. ముఖ్యంగా మూడు లక్షల ఎకరాలకు సాగు నీటితో పాటు ఫ్లోరోసిస్ బారిన పడిన నల్లగొండ జిల్లా ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు ఉద్దేశించ బడిన ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం తవ్వకంలో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం లెఫ్టినెంట్ జెనరల్ హార్పల్ సింగ్ అనుభవాన్ని వినియోగించుకునేందుకు వీలుగా ఈ నియామకం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి ఎస్.ఎల్. బి.సి పనులు పూర్తి చేసి త్వరితగతిన పూర్తి చేయాలని నియమించిన నేపద్యంలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి తెనుంది. ఈ క్రమంలోనే సొరంగ మార్గం తవ్వకాలలో అపార అనుభవం గడించిన హార్పల్ సింగ్ సేవలు వినియోగించుకోనుంది.

## పార్టీని ధిక్కరిస్తే సస్పెండ్ చేయాల్సిందే : మాజీ మంత్రి మల్లారెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** పార్టీలో కొనసాగుతూ.. పార్టీ నియమాలు, విధానాలను ధిక్కరిస్తేవారు ఎంతటివారైనా సరే నిరాక్షిణ్యంగా సస్పెండ్ చేయాల్సిందేనని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం కల్వకుంట కవిత మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావులపై చేసిన ఆరోపణలపై మలారెడి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కవిత ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారన్నారు. పార్టీకి నష్టం చేకూర్చే ఎవరినీ ఊపేక్షించేది లేదని, తమ పార్టీ అధినేత కెసిఆర్‌కు కన్నబిడ్డ కన్నా ప్రజలు, తెలంగాణే ముఖ్యమన్నారు. కుటుంబంలో సమస్యలు సర్వసాధారణమని అవన్నీ త్వరలోనే సమసిపోతాయని కామెంట్ చేశారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రపంచంలోనే గొప్ప ప్రాజెక్ట్ అని.. కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మండిపడ్డారు. సిబిఐ పేరుతో కేసి ఆర్‌ను ఇబ్బంది పెటాలనుకోవడం సరికాద న్నారు. తెలంగాణ తెచ్చిన వ్యక్తి మనందరికీ నాయకుడిగా ఉండటం అదృష్టమని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు.

## మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు దరఖాస్తులకు ఆహ్వానం

**హైదరాబాద్,సెప్టెంబరు 3,ప్రభాతవార్త:** టీసీయుఆర్ (తెలంగాణ కోర్ అర్బన్ రీజన్),6 మునిసిఫల్ కార్పొరేషన్లలో మైక్రోబ్రీవరీల ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతోమైక్రోబ్రీవరీల ఏర్పాటుకు పలు సంస్థలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కలగడంతోప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కొత్త మైక్రోబ్రీవరీ 25 పాలసీకి శ్రీకారం చుట్టినట్లయ్యింది. ఈ పాలసీ వల్ల పలు సంస్థలు కొత్తగా మైక్రోబ్రీవరీలను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఏర్పడనుంది. ఈ మేరకు కొత్త మైక్రోబ్రీవరీల ఏర్పాటుకు అవసరమైన నోటి పికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 3 నుంచి 25 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ప్రతి దరఖాస్తుకు రూ.1,00,000 (లక్ష)గా నిర్ణయించారు. మైక్రోబ్రీవరీలను బార్లు, ఎ్కలెట్ బార్లు, క్లబ్‌లకు, టూరిజం స్థలాల్లోను, హోటల్, రెస్టారెంట్, ఆహార పదార్థలను అందజేసే సంస్థలు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. మైక్రో బ్రీవరీల ఏర్పాటుకు అవసరమైన 1000 స్క్వేర్ ఫిట్ స్థలాన్ని ఉండే విధంగా చూసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులు సంబంధిత శాఖలు జారీ చేసిన అనుమతి పత్రాలను కలిగిన వారు మాత్రమే దరఖాస్తులకు అర్హులుగా ఉంటారని పేర్కొన్నారు.

## సహాకార సంఘాల బలోపేతానికి కృషి: నాబార్డు ఛైర్మన్ శాజి

**హైదరాబాద్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణ లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఎసిఎస్)బలోపేతానికి కృషి చేస్తున్నట్లు జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) ఛైర్మన్ కెవి శాజి తెలిపారు. సహకార సంఘాల బలోపేతంపై హైదరాబాద్‌లో బుధవారం వర్క్‌షాప్ జరిగింది. ఇందులో పాల్గొన్న ఛైర్మన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రాజెక్టు మంచిఫలితాలు ఇస్తోందన్నారు. ఇప్పటి వరకు 52,500కి పైగా పిఎసి ఎస్ డే-ఎండ్ ఆపరేషన్స్ పూర్తి చేశాయని వివరించారు. 9 వేలకుపైగాసంఘాల డైనమిక్-డే ఎండ్ నిర్వహిస్తున్నాయని వెల్లడిం చారు. కాగా 33 వేలకు పైగా ఆడిట్లు ఈపాస్ సాఫ్ట్‌వేర్ ద్వారా పూర్తయ్యాయని చెప్పారు. సహకార మం త్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సిద్దార్థ్ జైన్ మా ట్లాడుతూ సహకార సంఘాలు గ్రామీణ సమృద్ధిని పెంచడంలో, ఆహార భద్రతను మెరుగు పరచడంలో, సమగ్ర అభి వృద్ధిని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. ఈ వర్క్‌షాప్‌లో నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్ గోవర్ధన్ సింగ్ రావత్, తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఉదయ భాస్కర్, నాబార్డు ప్రధాన కార్యాలయం సిజిఎం సంజయ్ గుప్తా, డాక్టర్ సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

## కారుణ్య ఉద్యోగులకు డిగ్రీ ఉంటే క్లర్క్: సిఎండి బలరామ్

**హైదరాబాద్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** బొగ్గు గని ప్రమాద ఘటనల్లో కారుణ్య వారసులకు డిగ్రీ విద్యార్హత ఉంటే అటువంటి వారికి గ్రేడ్3 క్లర్క్ పోస్టులకు అర్హత కలిగి ఉంటుందని సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ తెలిపారు. హైదరాబాద్ లోని సింగరేణి భవన్‌లో జరిగిన చర్చల్లో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి సంబంధించి త్వరలోనే ఆదేశాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఈ విద్యార్హత కలిగిన వారు జనరల్ అసిస్టెంట్లుగా మాత్రమే పనిచేసే అవకాశం ఉండేదన్నారు.

అయితే 2009 లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీలైన మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీ రింగ్, డిప్లొమా (మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రి కల్), ఐటీఐ (ఎలక్ట్రికల్, ఫిట్టర్, వెల్డర్) కోర్సులు పూర్తి చేసిన వారికి విద్యార్హతలకు తగిన ఉద్యో గాలు కల్పించడానికి అంగీకరించడం జరిగిం దన్నారు. తాజాగా డిగ్రీ అర్హతను కూడా చేర్చినట్లు చెప్పారు.

# 'ఘాటీ'లో శీలావతి క్యారెక్టర్ నా కెరీర్‌లో ఎప్పటికీ నిలిచిపోతుంది

## - క్వీన్ అనుష్క శెట్టి



**క్వీన్ అనుష్క శెట్టి** మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి. విక్రమ్ ప్రభు మేల్ లీడ్‌గా నటించిన ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యువి క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఎంటర్‌టైన్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో క్వీన్ అనుష్క శెట్టి విలేకర్ల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ ఫిలిం జర్నీలో 20 ఇయర్ ఇది. ఇలాంటి సందర్భంలో ఘాటి లాంటి యాక్షన్ అడ్వెంచర్ సినిమా చేయడం ఎలా అనిపిస్తుంది?** చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. ఘాటీలో చేసిన శీలావతి అమేజింగ్ క్యారెక్టర్.చాలా బ్యూటిఫుల్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్. కంఫర్ట్ జోన్ ని దాటి చేసిన సినిమా ఇది. అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి, భాగమతి.. ఈ సినిమాలన్నిటిలోనూ చాలా బలమైన పాత్రలు చేశాను. ఘాటిలో చేసిన శీలావతి క్యారెక్టర్ కూడా అంత బలంగా ఉంటూనే ఒక డిఫరెంట్ షేడ్ తో ఉంటుంది.

**ఘాటీ కథ విన్నప్పుడు మీ రియాక్షన్ ఏమిటి?** క్రిష్ గారు, రచయిత శ్రీనివాస్ గారు ఈ కథ చెప్పినప్పుడు ఆ కల్చర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. లొకేషన్స్‌కి వెళ్లిన తర్వాత ఒక కొత్త క్యారెక్టర్, కల్చర్, ఒక కొత్త విజువల్‌ని ఆడియన్స్‌కి చూపించబోతున్నామనే ఎక్సైట్మెంట్ కలిగింది.

**ఘాటిలో గంజాయి ఎలిమెంట్ ఉంది కదా.. అది ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది?** క్రిష్‌గారు ఎప్పుడుకూడా సోషల్‌గా రెలెవెంట్‌ఉండే కథలనే ఎంచుకుంటారు. సొసైటీలో ఉండే సీరియస్ ఇష్యూ ఇది. మేము ఈ సినిమాని యాక్షన్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ గానే తీసాం. ఐతే ఈ కథలోనే చక్కని సందేశం కూడా ఉంది. అది చాలా పాజిటివ్‌గా ఉంటుంది.

**వేదం తర్వాత క్రిష్ గారు మీరు కలిసి చేస్తున్న సినిమా ఇది. ఆ అంచనాల్ని ఉంటుందా?** కచ్చితంగా. వేదంలో సరోజ పాత్రకి కొనసాగింపుగా ఒక సినిమా చేద్దాం అనుకున్నాం.అలాంటి సమయంలో ఘాటి లాంటి అద్భుతమైన కథ కుదిరింది. క్రిష్ గారు నాకు ఎప్పుడు కూడా చాలా అద్భుతమైన పాత్రలు ఇస్తున్నారు. ఇందులో శీలావతి క్యారెక్టర్ నాఫిల్మోగ్రఫీలో ఎప్పటికీ నిలిచిపోతుంది.

**ఘాటీ నిర్మాతల గురించి?** రాజీవ్ రెడ్డి గారికి, యువి క్రియేషన్స్‌కి థాంక్స్ చెప్పాలి. ఇలాంటి ఒక డిఫరెంట్ సబ్జెక్ట్ ని బిలీవ్ చేసి నాపై నమ్మకం ఉంచి ఇంత గ్రాండ్ స్కేల్లో సినిమా చేసినందుకు వారికి కృతజ్ఞతలు. వారితో జర్నీ ఎప్పుడూ అద్భుతంగానే వుంటుంది.

**విక్రమ్ ప్రభు గారితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?** విక్రమ్ ప్రభుగారు నాకు ముందు నుంచే తెలుసు. ఆయన కుమ్కి సినిమా నాకుచాలా ఇష్టం. విక్రమ్‌గారు వెరీనైస్ జెంటిల్మెన్.

**డిఒపి మనోజ్ గురించి?** మనోజ్ కెమెరా వర్క్, సాగర్ మ్యూజిక్ ఈ సినిమాకి ఫ్రెష్ నెస్ తీసుకొచ్చాయి. ఈ సినిమాలో మ్యూజిక్ ఒక క్యారెక్టర్ లాగా ఉంటుంది. క్రిష్ గారు ఈ సినిమా కోసం మూడు పాటలు రాశారు. ఆయన చిన్నచిన్న మాటలతో కథలో గొప్ప డెప్త్‌ని తీసుకొస్తారు.

**మీరు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండరు. బయట కూడా ఎక్కువగా కనిపించరు. మీ లిజర్ టైం లో ఏం చేస్తుంటారు?** నేను చాలా ఎక్కువ ట్రావెల్‌చేస్తాను, చదువుతాను. ప్రస్తుతం మహాభారతం చదువుతున్నాను. మూవీస్‌కూడా చూస్తాను. గత రెండేళ్లుగాఎక్కువగా ఫ్యామిలీతో సమయం గడుపుతున్నాను.

**మీరు ఇంకా చేయాలనుకునే క్యారెక్టర్ ఏదైనా ఉందా?** అవుట్ అండ్ అవుట్ నెగిటివ్ క్యారెక్టర్ చేయాలని ఉంది. ఒక బలమైన క్యారెక్టర్ కుదిరితే కచ్చితంగా నెగిటివ్ రోల్ చేస్తాను.

**కొత్తగా కథలు వింటున్నారా?** వింటున్నాను. మంచి లైన్ అప్ ఉంది. మలయాళంలో ఓ సినిమా చేస్తున్నాను. అది నా ఫస్ట్ మలయాళం ఫిల్మ్. తెలుగులో కొత్త సినిమా అనౌన్స్మెంట్ ఉంటుంది. అది కూడా చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది.

# 'జటాధర'లో శిల్పా శిరోద్కర్ అవార్డ్ విన్నింగ్ పెర్ఫార్మెన్స్

**సుధీర్ బాబు,** సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలో 'జటాధర' చిత్రానికి సంబంధించిన బజ్ ఎలా ఉందో అందరికీ తెలిసిందే. సుధీర్ బాబు చాలా కొత్తగా కనిపించబోతోన్న ఈ మూవీని ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్ బాబు ప్రొడక్షన్స్ పతాకం నిర్మిస్తోంది. ఈ సినిమాను వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు వదిలిన పోస్టర్లు, గ్లింప్స్ మూవీపై అంచనాలు పెంచేశాయి. ఈ క్రమంలో ఈ చిత్రం నుంచి శిల్పా శిరోద్కర్ పాత్రకు సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. ఖుదా గవా, మృత్యుదండ్ వంటి చిత్రాలలో అద్భుతమైన నటనతో అందరినీ ఆకట్టుకున్న శిల్పా శిరోద్కర్ జటాధర చిత్రంలోని పర్ఫామెన్స్‌తో అవార్డులన్నీ గెలిచేస్తారని ప్రేరణ అరోరా అన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. 'జటాధర'లోని శోభ అనే పాత్రలో నటించిన శిల్పా శిరోద్కర్‌కు అన్ని అవార్డులు వస్తాయని ఎంతో నమ్మకంగా చెబుతున్నాను.



శోభ ఒక శక్తివంతమైన, సంక్లిష్టమైన పాత్ర. ఈ పాత్రకు ఆమె తన నటనతో ఎంతో ఇంటెన్స్‌ను తీసుకు వచ్చి న్యాయం చేశారు. ఆమె ప్రేక్షకులకు పూర్తిగా ఆశ్చర్యపరుస్తుంది' అని అన్నారు. 'జటాధర' సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా అందరినీ ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నారు. సస్పెన్స్, యాక్షన్, మిస్టరీల ప్రత్యేకమైన కథతో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. 'జటాధర'లో శిల్పా శిరోద్కర్, సోనాక్షి సిన్హా, సుధీర్ బాబు, ఇందిరా కృష్ణ, రవి ప్రకాష్, దివ్య ఖోస్లా, రాజీవ్ కనకాల, శుభలేఖ సుధాకర్, రోహిత్ పాఠక్ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటికే శోభ పాత్రలో నటి శిల్పా శిరోద్కర్ ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. 'జటాధర' ప్రేక్షకులకు ఓ విజువల్ వండర్, సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా


# శివ కార్తికేయన్ లాంటి మాస్ హీరోతో 'మదరాసి' కథ చెబితే ఎక్కువ రీచ్ అవుతుంది

## - దర్శకుడు ఎఆర్ మురుగదాస్



**శివ కార్తికేయన్,** రుక్మిణి వసంత్, విద్యుత్ జమ్వాల్ ప్రధాన పాత్రలో ఎఆర్ మురుగదాస్ తెరకెక్కించిన చిత్రం 'మదరాసి'. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతాన్ని అందించారు. ఈమూవీని సెప్టెంబర్ 5న విడుదల చేయబోతోన్నారు. తెలుగులో ఈచిత్రాన్ని శ్రీలక్ష్మీ మూవీస్ బ్యానర్ మీద భారీ ఎత్తున రిలీజ్ చేయనున్నారు. ఈ క్రమంలో దర్శకుడు మురుగదాస్ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఆయన ఏం చెప్పారంటే..

**సెప్టెంబర్ 5న 'మదరాసి' చిత్రం రాబోతోంది? డైరెక్టర్‌గా మీకు ఎలా అనిపిస్తోంది?** నేను ప్రతీ సినిమాను మొదటి సినిమాగానే భావిస్తాను. 'మదరాసి' విషయంలోనూ అలాంటి ఫీలింగ్‌తోనే ఉన్నాను. డిఫరెంట్ కథతో అందరి ముందుకు రాబోతోన్నాను. ఈ మూవీ అందరినీ ఆకట్టుకుంటుందనే కాన్ఫిడెంట్‌తో ఉన్నాను. **'మదరాసి' టైటిల్ పెట్టడానికి గల కారణం ఏంటి?** మామూలుగా మన దక్షిణాది వారిని ఉత్తరాదిలో మదరాసి అని పిలుస్తుంటారు. ఈ చిత్రం ఎక్కువగా విలన్ పాయింట్ ఆఫ్ వ్యూలో సాగుతుంది. విలన్ ఈ మూవీలోని హీరోని మదరాసి అని పిలుస్తుంటాడు. అందుకే టైటిల్ కూడా 'మదరాసి' అని పెట్టాను. **'మదరాసి' టైటిల్‌ను ఇతర ప్రాంతాల వారు రిసీవ్ చేసుకుంటారని భావిస్తున్నారా?** 'మదరాసి' కథ మొత్తంగా తమిళనాడు నేపథ్యంలో సాగుతుంది. అందుకే టైటిల్ అలాపెట్టాం. ఇందులోని కంటెంట్, కథ అన్ని ప్రాంతాలకు కనెక్ట్ అవుతుంది. **'మదరాసి'లో కథ ఎలా ఉండబోతోంది?** వెస్ట్రన్ కంట్రీస్‌లో ఆల్రెడీ ఉన్న సమస్యలు, మన దేశంలోకి వస్తున్న ఇలాంటి ఓ కొత్త సమస్యను బేస్ చేసుకుని ఈ 'మదరాసి' కథను రాసుకున్నాను. ఇందులోని సబ్జెక్ట్ చాలా డిఫరెంట్‌గా, కొత్తగా ఉంటుంది. అందరూ తెలుసుకోవాల్సిన పాయింట్ అనుకుని.. ఈ 'మదరాసి' మూవీని తెరకెక్కించాను. **'మదరాసి' కోసం శివ కార్తికేయన్‌ను ఎందుకు అప్రోచ్ అయ్యారు?** 'మదరాసి' చిత్రంలో హీరో పాత్ర చాలా డిఫరెంట్‌గా, కొత్తగా ఉంటుంది. శివ కార్తికేయన్‌కు ఈ కథ చెప్పిన వెంటనే నచ్చడం, వెంటనే ఓకే చెప్పడం జరిగిపోయింది. ప్రస్తుతం శివ కార్తికేయన్‌కు మాస్‌లో మంచి ఇమేజ్ పెరిగింది. అలాంటి మాస్ హీరోతో నేను చెప్పాలనుకున్న ఈ పాయింట్‌ను చెబితే ఎక్కువ రీచ్ అవుతుంది. **'మదరాసి'లో రుక్మిణి వసంత్ పాత్ర ఎలా ఉంటుంది?** 'మదరాసి' చిత్రంలో రుక్మిణి వసంత్ పాత్ర చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. అందరికి రిలేట్ అయ్యే కారెక్టర్‌ను ఆమె చేశారు. ప్రస్తుతం రుక్మిణి వసంత్‌గారు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయారు. **విద్యుత్ జమ్వాల్ ప్రస్తుతం హీరోగా చేస్తున్నారు. మీరు మళ్లీ విలన్ పాత్రకి ఎలా ఒప్పించారు?** 'తుపాకి' కథను విద్యుత్ జమ్వాల్‌కి చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయి ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా సినిమాలు చేస్తున్నారు.ఈ 'మదరాసి' కథను ఆయనకు చెప్పిన వెంటనే చాలా నచ్చడంతో విలన్‌గా చేసేందుకు ఒప్పుకున్నారు. **'మదరాసి'లో అనిరుధ్ మ్యూజిక్ ఎలా ఉండబోతోంది?** ప్రస్తుతం అనిరుధ్ మ్యూజిక్‌కు బ్రాండ్‌గా ఉన్నారు. ఇంత వరకు మ్యూజిక్ అంటే.. పాటలు, లిరిక్స్ అనుకునేవారు. కానీ అనిరుధ్ మాత్రం బిజిఎంతో దేశాన్ని ఊపేస్తున్నారు. ఈ చిత్రంలో అనిరుధ్ అద్భుతమైన మ్యూజిక్, ఆర్ఆర్ ఇచ్చారు. **'మదరాసి' విషయంలో నిర్మాత సపోర్ట్ ఎలా ఉంది?** శ్రీ లక్ష్మీ మూవీస్, ఎన్వీ ప్రసాద్ గారితో నాకు ఎన్నో ఏళ్ల నుంచి అనుబంధం ఉంది. ఆయన ఈ మూవీ కోసం ఎంతో ఖర్చు పెట్టారు. **దర్శకుడిగా నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి చెప్పండి?** ప్రస్తుతానికి నా వద్ద చాలా ఐడియాలు, కాన్సెప్ట్‌లు ఉన్నాయి. కానీ పర్టిక్యులర్‌గా ఏమీ అనుకోలేదు. స్క్రిప్ట్ ఫైనలైజ్ అయ్యాక నెక్స్ట్ చెబుతాను.



# 'మార్క్' టైటిల్ గ్లింప్స్ రిలీజ్

**కన్నడ స్టార్ హీరో** కిచ్చా సుదీప్ నటిస్తున్న 47వ చిత్రానికి 'మార్క్' టైటిల్ ఖరారు చేశారు. ఈ రోజు ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'మార్క్' చిత్రాన్ని టిజి త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలింస్, కిచ్చా క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సెంథిల్, త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భారీ యాక్షన్ డ్రామా కథతో దర్శకుడు విజయ్ కార్తికేయా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. "మార్క్" సినిమా ఈ క్రిస్మస్ పండగకు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

'మార్క్' సినిమా టైటిల్ గ్లింప్స్ పవర్ ఫుల్‌గా ఉండి ఆకట్టుకుంటోంది. మ్యాడ్, ఆటిట్యూడ్, రూత్ లెస్, కింగ్...అంటూ మార్క్ పేరులోని అక్షరాలకు డెఫనేషన్ ఇచ్చారు. ఈ గ్లింప్స్‌లో అజయ్ మార్కండేయ పాత్రలో కిచ్చా సుదీప్‌ను ఇంటెన్స్ లుక్‌లో పరిచయం చేశారు. ఆయన క్యారెక్టర్ పేరుతోనే టైటిల్ 'మార్క్' ఉండబోతోంది. ఈ గ్లింప్స్‌కు అజనీష్ లోకనాథ్ అందించిన బిజిఎం ఆకర్షణగా నిలుస్తోంది. కిచ్చా సుదీప్ కెరీర్‌లో బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న "మార్క్" సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

# 'కిష్కింధపురి' ట్రైలర్ లాంచ్



**బెల్లంకొండ సాయి శ్రీనివాస్** మిస్టీరియస్ అకల్ట్ థ్రిల్లర్ 'కిష్కింధపురి' అలరించబోతున్నారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచింది. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ రోజు మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు.

'ఊరికి ఉత్తరాన, దారికి దక్షిణాన పశ్చిమ దిక్కున ప్రేతాత్మలన్నీ పేరు వినగానే తూర్పుకు తిరిగే ప్రదేశం' అనే డైలాగులతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం కట్టిపడేసింది. హీరో, హీరోయిన్ సహా కొంతమంది స్నేహితుల ఆత్మలని అన్వేషిస్తూ సువర్ణ మాయ ఇంటి లోకి వెళ్తారు. అక్కడ వారు ఊహించని భయంకరమైన పరిస్థితులు ఎదురుకావడం మైండ్ బ్లోయింగ్ థ్రిల్ ని అందించాయి. దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి ఒక యూనిక్ హారర్ థ్రిల్లర్ ని ప్రజెంట్ చేశారు. మిస్టరీ, టెర్రిఫిక్ విజువల్స్, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చాయి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టారు. ట్రైలర్ క్లైమాక్స్‌లో అనుపమ పరమేశ్వరన్ కనిపించిన తీరు హైలెట్‌గా నిలిచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'మా సినిమాని సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఆడియన్స్‌కి మంచి థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఉండాలని కిష్కింధపురి చేయడం జరిగింది. మంచి సినిమా వస్తే తప్పకుండా జనం థియేటర్స్‌కి వస్తారు. అది నేను నమ్ముతున్నాను. మా కిష్కింధపురి అలాంటి సినిమానే. ఒక మంచి థియేటర్ సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ ఇవ్వబోతున్నాం. మా డైరెక్టర్ గారు చాలా అద్భుతమైన కథ చేసుకున్నారు. మీకు ఒక ఎడ్జ్ ఆఫ్ సీట్ థ్రిల్లర్ లాగా అనిపిస్తుంది. అంత మంచి కథ తీసినందుకు డైరెక్టర్ గారికి థాంక్యూ. మా మ్యూజిక్ డైరెక్టర్ చైతన్ భరద్వాజ్ గారు ఈ సినిమాతో నెక్స్ట్ లెవెల్‌కి వెళ్తారు. ఈ సినిమా వీఎఫ్ఎక్స్ కూడా చాలా ఇంపార్టెంట్. ఎక్స్ట్రార్డినరీ విజువల్ ఎఫెక్ట్స్ ఉంటాయి. చాలా నమ్మకంతో ఈ సినిమా చేశాం. మీ అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. మా నిర్మాత సాహుగారి పాషన్ ప్రతిఫ్రేంలో కనిపిస్తుంది అన్నారు. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ.. 'మీ అందరికీ ట్రైలర్ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. హారర్ నాకు ఇష్టమైన జానర్. డైరెక్టర్ కౌశిక్ ఈ సినిమా కథ చెప్పిన వెంటనే నాకు నచ్చింది. చాలా డిఫరెంట్ క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ కౌశిక్‌కి థాంక్యూ అన్నారు.

డైరెక్టర్ కౌశిక్ మాట్లాడుతూ... 'సాహు గారికి ఈ కథ చెప్పగానే సింగిల్ సిట్టింగ్లో ఓకే చెప్పారు. అలాగే సాయి గారికి కథ చెప్పిన వెంటనే నచ్చింది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నాకు సపోర్ట్ చేసిన మా టెక్నికల్ టీంఅందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సినిమాలో ఫెంటాస్టిక్ విజువల్స్ ఉంటాయి. చైతన్ అద్భుతమైన బ్యాగ్రౌండ్ స్కోర్ చేశారు. టెక్నికల్ గా సినిమా చాలా ఉన్నతంగా ఉంటుంది. మమ్మల్ని బిలీవ్‌చేసిన నిర్మాత సాహు గారికి థాంక్యూ. కచ్చితంగా మీకుచాలామంచి ఎక్స్పీరియన్స్ ఉంటుంది. ప్రొడ్యూసర్ సాహు గారపాటి మాట్లాడుతూ..'ట్రైలర్‌కి ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. మేము ఎలాగైతే ఎక్సైట్ అయ్యామో ఆడియన్స్ కూడా అదే రకంగా ఎక్సైట్ అయ్యారు. ఈ సినిమా మీ అంచనాలకు తగ్గకుండా ఉంటుంది. సినిమా మీద చాలా నమ్మకంగా ఉన్నాం. ఖచ్చితంగా ఆడియన్స్‌కి సినిమా నచ్చుతుంది. మా హీరో హీరోయిన్ టీమ్ అందరూ చాలా కష్టపడి పనిచేశారు. వారి కష్టానికి మంచి గుర్తింపు తెచ్చే సినిమా అవుతుంది అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ చైతన్ భరద్వాజ్ మాట్లాడుతూ.. 'చాలా కొత్తగా చేసిన సినిమా ఇది. ఇలాంటి అవకాశాన్ని ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. మన నిర్మాత సాహు గారు చాలా ప్యాషన్ తో చాలా బిగ్ స్కేల్ లో ఈ సినిమా చేశారు. మా మ్యూజిక్ టీమ్ అందరికీ థాంక్యూ. సినిమాలో చాలా హై మూమెంట్స్ ఉన్నాయి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేసినప్పుడు చాలా ఎక్స్ట్రాడినరీగా అనిపించింది. ఖచ్చితంగా థియేటర్స్‌లో చూడండి. మంచి సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ ఉంటుంది అన్నారు.



నభా నటేష్

# 'నిశాంచి' ట్రైలర్ విడుదల



**అమెజాన్ ఎంజిఎం స్టూడియో ఇండియా** తన రాబోయే నిశాంచి ట్రైలర్ ను ఈరోజు విడుదల చేశారు .. అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. జార్ పిక్చర్స్ బ్యానర్‌పై అజయ్ రాయ్, రంజన్ సింగ్ నిర్మాణంలో, ఫ్లిప్ ఫిల్మ్స్ సహకారంతో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రసూన్ మిశ్రా, రంజన్ చండేల్, అనురాగ్ కశ్యప్ కథనాన్ని అందించారు. డెబ్యూటెంట్ ఐశ్వరి థాకరే బబ్లూ – దబ్లూ అనే కవల సోదరుల ద్విపాత్రాభినయం చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోబోతున్నారు. వేదిక పింటో, మోనిక పన్వర్, మొహమ్మద్ జీషాన్ ఆయుబ్, కుముద్ మిశ్రా తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 2000వ దశకపు చిన్న పట్టణ ఉత్తర్ ప్రదేశ్ నేపథ్యంలో సాగిన ఈ కథలో యాక్షన్, డ్రామా, రొమాన్స్, హాస్యం, మా కా ప్యార్తో పాటు ఫుల్ మసాలా ఎంటర్టైయిన్‌మెంట్ ప్యాకేజీని అందించేలా ట్రైలర్ రూపొందింది. భారతీయ సినిమాకు తనదైన ముద్ర వేసిన అనురాగ్ కశ్యప్‌తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఐశ్వరి, వేదిక పింటో సహా మొత్తం తారాగణం అద్భుతమైన నటనను ప్రదర్శించారు. థియేటర్లలో ఈ మాయాజాలాన్ని చూడాలని ఎదురుచూస్తున్నాం," అని నిఖిల్ మధోక్, డైరెక్టర్ హెడ్ ఆఫ్ ఇండియా ఒరిజినల్స్, అమెజాన్ MGM స్టూడియో ఇండియా ప్రైమ్ వీడియో అన్నారు.



# నేటినుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానున్న 'కన్నప్ప'

**డైనమిక్ హీరో** విష్ణు మంచు 'కన్నప్ప'తో అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. బాక్సాఫీస్ వద్ద డివైన్ బ్లాక్ బస్టర్‌గా 'కన్నప్ప' నిలిచింది. థియేటర్లలో దూసుకుపోయిన ఈ 'కన్నప్ప' చిత్రం ప్రస్తుతం ఒటిటిలోకి రాబోతోంది. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ చారిత్రక చిత్రం ఇక సెప్టెంబర్ 4 నుండి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. 'కన్నప్ప' చిత్రం విష్ణు మంచు కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. తిన్నడు పాత్రలో ఓ గిరిజన యోధుడిగా ఆయన పోషించిన పాత్ర అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంది. ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలను సైతం అందుకుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, శరత్‌కుమార్, మోహన్‌లాల్, అర్పిత్ రాంకా, ప్రీతి ముకుందన్ వంటి తారాగణం కీలక పాత్రల్లో నటించారు. ఇక ప్రభాస్, అక్షయ్ కుమార్ ప్రత్యేక పాత్రలు పోషించడం వల్ల ఈ చిత్రం మరింత ఆకర్షణీయంగా మారింది. వీరి స్పెషల్ అప్పియరెన్స్ సినిమాను అందరి దగ్గరకు తీసుకు వెళ్లింది. కాజల్ అగర్వాల్, మధుబాలా ఇతర ముఖ్యమైన పాత్రలను పోషించారు. విష్ణు మంచు కుమారుడు అవ్రామ్ మంచు నటుడిగా అరంగేట్రం చేయడం, అతని కుమార్తెలు అరియానా, వివియానా ఓ పాటలో నటించడంతో మరింత స్పెషల్‌గా మారింది. స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందరి హృదయాల్ని తాకింది. శివా శివా శంకర్తా అనే పాట దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచింది. 'కన్నప్ప' చిత్రం తిన్నడు అనే గిరిజన యోధుడి ఆకర్షణీయమైన కథను చూపిస్తుంది. ఇది విశ్వాసం, పరివర్తన, అంతర్గత బలానికి సంబంధించిన కాలాతీత కథగా ప్రతిధ్వనిస్తుంది. ఇక సెప్టెంబర్ 4 నుంచి ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్‌లో రానుంది. ఈ డివైన్ బ్లాక్ బస్టర్ చిత్రాన్ని అందరూ చూసి ఆస్వాధించండి.

# కూలీ ఇంట్లో కొలువుల లక్ష్మి

**మారుమూల గ్రామం.. సరైన రహదారి లేని ప్రాంతం... 20 ఏళ్లలో గ్రామంలో ఒక్క ఉపాధ్యాయ ఉద్యోగమూ రాలేదు. అలాంటిది ఏకంగా మూడు ఉపాధ్యాయ, ఒక సివిల్ పోలీసు ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు... రామలక్ష్మి.**



విజయనగరం జిల్లా మెంటాడ కారణంగా కుంటినవలస గ్రామం రామలక్ష్మిది. అమ్మానాన్నలు పెదిరెడ్ల అప్పారావు, బంగారమ్మలకు సెంటు భూమి కూడా లేదు. దీనితో వ్యవసాయ కూలీపనులు చేసేవారు. తాము చదువుకోకపోయినా పిల్లలు మాత్రం బాగా చదువుకోవాలని కోరుకున్నారు. వాళ్లు ఉన్నతంగా ఎదిగితే చూడాలని కష్టపడి రామలక్ష్మిని ఆమె సోద రుడిని చదివించారు. వాళ్ల ఆశయాలకు అనుగుణంగానే రామలక్ష్మి కష్టపడి చదివి, చిన్నతనం నుంచి అన్ని తరగతుల్లో ప్రతిభ చూపారు. డిగ్రీ, ఆపై బీఈడీ పూర్తిచేసి... 2018లో ఎస్జీటీ ఉపాధ్యాయుల కొలువు కోసం డీఎస్సీ పరీక్ష రాశారు. అప్పట్లో 61వ ర్యాంకు వచ్చింది. ధ్రువపత్రాల వెరిఫికేషన్ అనంతరం ప్రభుత్వం జీవో 63 విడుదలతో ఉద్యోగం పొందలేకపోయింది. 2021లో మాదిరెడ్డి మోహన్‌తో వివాహం జరగక తన ప్రయత్నం ఆపలేదు. 202123లో బీడీలో మేథ్స్, ఫిజిక్స్ పూర్తి చేశారు. 2024లో మెగాడీఎస్సీ రాశారు. ఈసారి మూడు విభాగాల్లో.. ఎస్టీ (జిల్లాలో 4వ ర్యాంకు), స్కూల్ అసిస్టెంట్ (మూడో ర్యాంకు), టీజీటీ (రెండో ర్యాంకు) కొలువులు సాధించారు. ఆమె ఏపీ కానిస్టేబుల్ కొలువునీ దక్కించుకున్నారు. ఇది నా కొన్నేళ్ల కల. మా నాన్న చదువుకోలేదు. మేమూ తనలా మిగిలిపోకూడదని బాగా చదివారు. నన్ను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా చూడాలన్నది ఆయన కోరిక. మా గ్రామంలో 20 ఏళ్లుగా ఎవరూ గవర్నమెంట్ టీచర్ గా కొలువు సాధించలేదు. ఇప్పుడు నాకు ఒకేసారి ▢

# వెయ్యి గ్రామాలను అభివృద్ధి చేయాలి..

**అనగనగనగా అంటూ ఎవరు కథ మొదలు పెట్టినా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆసక్తిగా వింటారు. ఈమె చెప్పేదీ కథలే! కాకపోతే జీవిత కథలు. వాటి ద్వారా పల్లెటూరు కళాకారులను ప్రపంచానికి పరిచయం చేయడం కాదు, వారి అభివృద్ధికి సాయపడుతున్నారు. సాహితీ దేవి. ఆమె యజ్ఞానికి తాజాగా ప్రభుత్వ సహకారమూ తోడైంది. గురించి తెలుసుకుందాం...**

అడవిపాలెంలో 80ఏళ్ల నేతకారుడు ఉండేవారు. నేతే జీవనభృతి. మగ్గం పాడైనా దానితోనే ఎలాగోలా నెగ్గుకొస్తున్నారు. ఆయన చీర నేసే వీడియో తీసి సోషల్మీడియాలో పెట్టా. మగ్గం రావడమే కాదు, అందిన సాయంతో ఆయనకి కాటరాక్ట్ సర్జరీ చేయించాం. ఇల్లూ కట్టించాం. ఎన్నో దేశాలకు చెందినవారి స్పందన ఆయన జీవితాన్ని మార్చింది. ఇలాంటి ఎన్నో కథలు... వాటిని ప్రపంచానికి పరిచయం చేయాలనుకుంటున్నా. మాది ఏలూరు. నా చిన్నతనమంతా భోపాల్లో గడిచింది. నాన్న రామ్ కుమార్ స్పెన్సరీ సీఈఓగా చేశారు. అమ్మ నాగమణి. సెలవుల్లో ఊరొచ్చినప్పుడు గోదావరి, స్థానిక వంటలు, నేత... వంటివన్నీ ఆకర్షించేవి. వాటికోసం... నానమ్మ, తాతయ్యలతో కలిసుండొచ్చనీ బీఫార్మసీ చీరలలో చదివా. అప్పుడు సహకరించిన నాయకులు, జాలర్లు, రైతులకు వెస్ట్ మేనేజ్‌మెంట్ మీద అవగాహన, వారి ఉత్పత్తులు మార్కెటింగ్ చేయడం చేశా. ఈ అంశాలపై పట్టు తెచ్చుకోవాలంటే పై చదువులకు అమెరికా వెళ్లా. అక్కడ సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో మాస్టర్స్, శ్రీలంకలో ఇంటర్న్‌షిప్ చేసి 2016లో తిరిగొచ్చా. ఎంఎన్‌సిలో, స్టార్టప్‌కి పనిచేశాక ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి నా కలల ప్రాజెక్టు 'ఇంపాక్ట్ సైంటిస్ట్' ప్రారంభించా. రాజమండ్రిలో నేత, క్రాఫ్ట్ వంటివి రూపొందడంపై లైవ్ డాక్యుమెంట్ తీసి.. వివిధ సంస్థల సాయంతో కళాకారులకు కావాల్సిన సాయాన్ని అందించేదాన్ని. అవసరమైతే నేనూ వాళ్లతో కలిసి పనిచేస్తుంటా. అలా వచ్చిందే 'గూడపల్లి సిల్క్' బ్రాండ్ కూడా. దీనికోసం 3-4 నెలలు అక్కడే ఉన్నా.


**ప్రభుత్వం తోడుగా...**



ఆపై నేను తమిళనాడులోని ఆరోవిల్లే అనే ఇంటర్నేషనల్ టౌన్‌షిప్‌కి వెళ్లాను. 3ఏళ్లు అక్కడో ఎన్‌జిఒకి డైరెక్టర్‌గా, 'బాంబూ సెంటర్' అనే మరో సంస్థకు సీనియర్ కన్సల్టెంట్‌గా చేశా. ఇంతలో తెలంగాణ 'వీహబ్'లో కమ్యూనికేషన్ స్ట్రాటజిస్ట్‌గా అవకాశమొచ్చింది. దాదాపు 300మంది ఆంత్రప్రెన్యూర్లకి బ్రాండింగ్, ఆలోచన స్టార్టప్‌గా తీసుకెళ్లడం వంటి వాటిల్లో సాయపడ్డాడు. ఆ సమయంలోనే... సొంత ఊళ్లో స్థానిక సంస్థల నైపుణ్యాలను వాడుతూ కల్పించే పెట్టుబడులకు పెట్టుబడి పెట్టే 'అల్సిసార్ ఇంపాక్ట్ అనే సంస్థతో పరిచయమైంది. వాళ్లతో కలిసి పశ్చిమబంగాలో 'ఎంపవరింగ్ విమెన్ గ్లోబల్లీ' ప్రాజెక్టులో పనిచేశా. మనసు ఆంధ్రా వైపు మళ్లింది. మనవాళ్లకి సాయపడాలని తిరిగొచ్చి సోల్ ఆఫ్ స్వదేశ్ ప్రారంభించా. దీనికోసం పనిచేస్తున్నప్పుడే ఏపీ ప్రభుత్వంలో టూరిజం డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ కన్సల్టెంట్‌గా అవకాశం వచ్చింది. రూరల్ టూరిజం, బ్రాండింగ్ మార్కెటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ క్లస్టర్స్... ఇదివరకు దృష్టి పెట్టిన అంశాలే! కాకపోతే ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున, ప్రభావవంతంగా చేయొచ్చు. ప్రస్తుతం 100 గ్రామాలను గ్లోబల్ రూరల్ టూరిజం విలేజ్‌లుగా తీర్చిదిద్దబోతున్నాం.

**అప్పుడు నమ్మారు....** దాదాపు 15 ఏళ్ల క్రితం ఈ ప్రయాణం మొదలు పెట్టా. 250కి పైగా గ్రామాలు తిరిగా. ఎంతోమంది గ్రామీణులతో పనిచేశా. భాషా ఇబ్బందులొచ్చేవి. పల్లెవాళ్లు... త్వరగా నమ్మేవారు కాదు. ఏమన్నా నవ్వుతూ మళ్లీమళ్లీ వెళ్లేదాన్ని. వాళ్ల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేదాన్ని. ఫొటోలు తీసుకోవడానికి కాదు... నిజంగా సాయం చేస్తానని గుర్తించాకే నమ్మారు. ప్రేమ, ఓపికతో వాళ్ల హృదయాలను గెలిచా. కానీ వ్యక్తిగత జీవితానికే దూరమయ్యా. అయినా నా లక్ష్యం పెద్దది. కాబట్టే, ప్రతిచోటా నన్ను నేనుబట్టే తీర్చిదిద్దుకున్నా. ఈ నేర్చుకున్న అంశాలు, అనుభవం, నెట్‌వర్క్... ఇవే నా బలం. వెయ్యి గ్రామాలను అభివృద్ధి చేయాలి. కనీసం 100 గ్రామాలను మోడల్ పల్లెలుగా నిలపాలన్నవి నా కలలు. నాన్నెప్పుడూ 'నువ్వు స్పెషల్. నీకు నచ్చింది చెయ్యి. ఎవరికోసమూ మారొద్దు' అంటుంటారు. ఇంట్లో వాళ్ల అండతోనే నచ్చింది చేయగలుగుతోంది! ▢







# కురులకీ లేస్ అందం !

అమ్మయా మీలో అమ్మయ్యా ఎలాంటి సాదా చీర... దానికి హంగులద్దుతూ లేస్ వర్క్... ఒక్క చీరైనా ఇలా చేయించుకోని అమ్మాయి ఉండదు. బ్లవుజు అందాన్ని పెంచడానికి దీన్ని ఆశ్రయిస్తాం. మరి కురులకు పెడితే ఎలా ఉంటుంది... ఎప్పుడైనా ఇలా ఆలోచించారా? ఓవైపు శ్రావణం, మరోవైపు పెళ్లిళ్లు. వేడుకలకైతే కొదవే లేదు. ఇలాంటప్పుడు మన ఓటు సంప్రదాయ వస్త్రధారణకే! ఆ దుస్తులకు జోడీగా పూలు పెడితేనో, పూలజడ వేస్తేనో, జడబిళ్లలు, జడతోనో అలంకరిస్తే ఆ అందమే వేరు. అన్నీ చూడటానికి బాగానే ఉంటాయి. కానీ... కొద్దిసేపటికే భారంగా తోస్తాయి. మెడంతా పట్టేసినట్లుగానూ అనిపిస్తుంది. అలాగని ఊరికే కురులను వదిలినా, జడవేసినా బాగుంటుందా? దానికీ కాస్త మెరుపుల హంగులుంటేనే కదా అలంకరణ పూర్తయ్యేది కాబట్టే, ఈ లెస్ బ్రెయిడ్లకు ఆదరణ పెరుగుతోంది. గోటపట్టీ, స్టోన్, పెరల్ లెస్లన్నీ వీటికి అనువే బబుల్ బ్రెయిడ్, సింపుల్ జడ, ఫ్రెంచ్ ప్లీట్, సెమీ, ఫుల్ హెయిర్ లీవ్... ఎంపిక హెయిర్‌స్టైల్ ఏదైనా నప్పేస్తాయి. కావాలంటే ఈ ఫొటోలను చూడండి... ఈ స్టైల్సే అందుకు ఉదాహరణ. బాగా ఉన్నాయి కదూ! వేణినో కొన్ని పూలనో పైన పెట్టేస్తే సరి. జడ మెరుస్తుంది. కోరుకున్న లుక్కూ దొరుకుతుంది. కాబట్టే, అమ్మాయిల నుంచి వధువుల వరకూ ప్రతి ఒక్కరూ ఈ స్టైల్ని ఇష్టపడుతున్నారు. ఈ జాబితాలో తారలూ ఉన్నారు. మరి మీ సంగతేంటి? ప్రయత్నించారా ఓసారి? అయితే ఏ వేడుకకు మరి?

ఫ్యాషన్ ఫ్యాషన్









# సహజంగా మెరిసిపోదాం !



అందంగా కనిపించాలనే ప్రయత్నంలో మేకప్ తప్పనిసరి అని భావించేవారి సంఖ్యలో రోజుకి పెరుగుతోంది. అయితే, కరణ ఎబ్బెట్టుగా కాకుండా సహజంగా

○ ఫౌండేషన్ వేస్తే తెల్లగా, అందంగా కనిపిస్తామనేది చాలామంది అపోహ. అయితే, అ శరీరంలో కలవకపోయినా, మీ చర్మ ఛాయకు, తత్వానికి పరిపడకపోయినా... ముఖ వర్ఛస్సుని చెడగొడుతుంది. ఇలాంటప్పుడు ఒక రంగుని ఎంచుకునే కంటే మీ ఛాయకు దగ్గరగా వచ్చేలా చిత్రాలను కలిపి చూడండి. దాన్ని లైటింగ్ కింద కాకుండా ఆరుబయట వెలుతురులో చెక్ చేసుకోండి, ఇక, ఫౌండేషన్ ప్యాచుల్లా కనిపించకూడదంటే ఆయిల్ ఫ్రీ ధకాలను ఎంచుకోవాలి.

○ లైట్ ఫౌండేషన్ లేదా టింటెడ్ మాయిశ్చరైజర్ని ఎంచుకుంటే చర్మం మేకప్కి అనువుగా మారుతుంది. అయితే, అలంక రణకు ముందు తప్పనిసరిగా ముఖాన్ని శుభ్రంగా, తేమగా ఉంచుకోవడం తప్పనిసరి. చివరిగా నుదురు, ముక్కు కణతల దగ్గర బ్రాంజ్ పౌడర్ తో టచప్ చేయాలి... చర్మం ఎక్కువగా మెరుస్తున్నా. జిడ్డుగా కనిపిస్తున్నా కాంపాక్ట్ పౌడర్ పూర్తిగా అద్దేయండి. అప్పుడు సహజంగా కనిపించొచ్చు.

○ పెడాలకు లేత గులాబీ న్యూ, పీచ్ షేడ్స్ లిప్ స్టిక్ ను ఏంచుకుంటే బాగుంటుంది. అయితే, ముందుగా బామ్ రాసి పెదవులను తేమగా ఉంచడం మరిచిపోవద్దు. తక్కువ కళ్ల మేకుతో చాలా సహజంగా కనిపించొచ్చు. ఇతర బ్లాక్ ఐలైనర్ వాడండి. కనురెప్పలపై బ్రాంజ్ షేడ్ని ఎంచుకుని లైట్‌గా అద్దండి. ▢

## సామెతలు

✦ ప్రతి కుంటే బలుసాకు తినొచ్చు.

✦ బావ మరుదల బ్రతుకకోరును, దాయాదుల చావు కోరును.

✦ బిడ్డ వచ్చిన వేళ, గొడ్డు వచ్చినవేళ.

✦. బాలహక్కు, బ్రహ్మ వాక్కు

✦ బూడిదలో పోసిన పన్నీరు.

▢

# వ్యధ మీ సమస్యలకు మీరే బాధ్యులు



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి సైకాలజిస్టు**

ప్రశ్న: దేవుడు నాకు తీరని ద్రోహం చేశాడు. నేను బాగా చదువుకున్నప్పటికి ఉద్యోగం ఆలస్యం చేశాడు. చదువు ఉద్యోగం ఉన్నప్పటికీ పెళ్లి ఆలస్యం చేశాడు. భర్త మంచి వాడే అయినప్పటికీ గయ్యాళి అత్తను ఇచ్చాడు. పెళ్లయిన ఐదేళ్లకు ఒక ఆడబిడ్డను ప్రసాదించాడు. పుట్టిన బిడ్డకు అనారోగ్యం శాపం పెట్టాడు. దీనితో మనశాంతి కరువై జీవితం బరువుగా మారింది. 35 సంవత్సరాల వయస్సుకే 60 ఏళ్ళ కష్టాలు అనుభవించాను. ఇక ఓపిక నశించి మరణమే శరణ్యం అనుకుంటున్నాను. నేను మధ్యతరగతి కుటుంబంలో పుట్టాను. మా తల్లిదండ్రులకు మేము ఇద్దరం ఆడపిల్లలం. మా అక్క బి.టెక్ చదివి ఉద్యోగం సంపాదించి, పెళ్ళి చేసుకుని హాయిగా ఉంది. నేను బి.టెక్ తరవాతే ఎంబిఎ చేశాను. అతి కష్టం మీద ఉద్యోగం సంపాదించాను. ఐదేళ్ళు వెతికి, వెతికి మా తల్లిదండ్రులు ఒక అబ్బాయిని చూసి పెళ్ళి చేశారు. పెళ్లయిన తరువాత పిల్లల కోసం తపించాము. గుళ్ళు గోపురాలు తిరిగాము. ఆఖరికి డాక్టర్ ద్వారా చికిత్స తీసుకోవలసి వచ్చింది. నా గర్భసంచి, ఫెలోఫిన్ ట్యూబ్స్ లోపాలను సరిదిద్దిన తరువాత గర్భం దాల్చాను. రోజు మా అత్త వేధింపులు, సాధింపుల వల్ల మానసిక ఒత్తిడి డిప్రెషన్‌కు గురయ్యాను. దీనితో నిద్ర, ఆహారాలకు దూరమై బరువు తగ్గాను. దీనితో పుట్టిన బిడ్డ బలహీనంగా ఉంది. బోర్లా పడటం, కూర్చోవడం, లేవడం, నడవడం లాంటివి అన్నీ ఆలస్యం అవుతోంది. ఇంకా సరిగా మాటలు రావడం లేదు. మా అత్త దీనికీ నన్నే ఆడిపోసుకుంటోంది. నాది దరిద్ర జన్మ కాబట్టే రోగిష్టి కూతురు పుట్టిందని హేళన చేస్తోంది. మావారు బెల్లం కొట్టిన రాయిలా చూస్తుంటారు తప్ప తల్లికి చెప్పలేరు. అన్నింటికి నన్నే సర్దుకోమంటున్నారు. నేను చాల బలహీనంగా ఉన్నాను. డిప్రెషన్‌తో బాధపడుతున్నాను. ఈ సమస్యల నుంచి బయట పడే మార్గం చెప్పండి.

- ఒక సోదరి, కాకినాడ



జవాబు : అమ్మా మీ సమస్యలు అర్థం అయ్యాయి. మీ సమస్యలకు మీరే బాధ్యులు తప్ప దేవుడుకాదు. ఒకసారి ఆత్మ విమర్శ చేసుకుంటే మీకే అర్థం అవుతుంది. కేవలం బి.టెక్, ఎంబిఎ చదివి ఉద్యోగం సంపాదిస్తే సర్వ సుఖాలు సిద్ధంచవు. శారీరక ఆరోగ్యం, మానసిక వికాసం, సామాజిక స్పృహ, మానవ సంబంధాలు, జీవన నైపుణ్యాలు చాల అవసరం. మీరు కష్టపడి చదివారు అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. అయితే శారీరకంగా బలహీనంగా ఉన్నారని అర్థం అవుతోంది. మీరు ఎంత బరువు, ఎత్తు ఉన్నారో చెప్పనప్పటికి తక్కువ బరువు ఉన్నారని అర్థం అవుతోంది. అలాగే పెళ్ళయిన తరువాత అత్తను నిందిస్తూ కూర్చున్నారు. తప్ప సమస్యను పరిష్కరించు కోవడానికి ప్రయత్నం చేయలేదు. పెళ్ళయిన తరువాత పిల్లల్ని కనడానికి తగిన ఆరోగ్యం పట్ల కూడ శ్రద్ధ చూపలేదు. తల్లి ఆరోగ్యం బిడ్డ ఆరోగ్యం ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. మీలో గర్భకోశ సమస్యలు ఉండటానికి కూడ బరువు తక్కువ, బలహీనతలే కారణంగా భావించాలి. డాక్టర్ల చికిత్స తరువాత గర్భం దాల్చినప్పటికి మీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోలేదని తెలుస్తోంది. తల్లి తీసుకునే పోషక ఆహారం, తల్లి మానసిక ఆరోగ్యం లాంటి పలు అంశాలు కడుపులో బిడ్డపై ప్రభావం చూపుతాయి. అయితే జరిగిన అనర్థాన్ని తలుచుకుని కుమిలి పోవడం వల్ల ప్రయోజనం లేదు. డాక్టర్లు, నిపుణుల సలహా మేరకు పాప ఆరోగ్యం మెరుగు పరచుకోండి మీరు కూడా మారడానికి ప్రయత్నించండి. ▢

# ఇంట్లోనే వెన్న చేద్దామిలా !



పెరుగు, మజ్జిగ వినియోగం పెరుగుతుంది. పాత రోజుల్లో అయితే... మజ్జిగని ఇంట్లో చిలికేవారు. దీనికోసం కవ్వాలుండేవి. ఇప్పుడైతే మజ్జిగ, వెన్న, పెరుగు అన్నీ రెడీమేడ్గానే తెచ్చుకుంటున్నాం. కానీ పిల్లలకి అన్నీ తెలియాలన్నా, ఇంట్లోనే కమ్మని వెన్నని తయారు చేసుకోవాలన్నా ఈ పరికరం మీకు సహకరిస్తుంది. ఇది బటర్ చర్నర్. కిందున్న గాజు సీసాలో పెరుగు వేసి మూత బిగించి ఆ పిడిని తిప్పితే చాలు. నాలుగైదు నిమిషాలకు పాల నుంచి తాజా వెన్న వెరవుతుంది. వంటల్లోకి, పిల్లలకు పెట్టడానికి బాగుంటుంది. పైగా ఇలా చిలకడాన్ని పిల్లలు ఆస్వాదిస్తారు కూడా. ▢

# వారణాసి రుచులు

ఆధ్యాత్మిక కేంద్రం బెనారస్ అదేనండీ వారణాసి వివిధ రకాల వంటకాలకీ ప్రసిద్ధి. ముఖ్యంగా పాన్లకి పెట్టింది పేరు. అమితాబ్ నటించిన కైకే పాన్ బెనారస్ వాలా.. ఎంత పెద్ద హిట్టో తెలుసా! పాన్‌తో పాటు అక్కడ దొరికే ఆ వంట కాలేంటో తెలుసుకుందాం ...



**సబ్జి కచోరీ** వేడివేడి కచోరీలు వాటితో పాటే వేడి అలూకూర వారణాసి ప్రత్యేకం. ఒక్క కచోరీ తిన్నా చాలు కడుపు నిండిపోతుంది. అంత రుచిగా, పెద్దగా ఉంటాయి.

**చెనాదహేవడా,** తీయని పెరుగులో ముంచిన వడలు.. జీలకర్రపొడి, నల్లుప్పు రుచితో భలే ఉంటాయి.

**బట్టిచోక** గోధుమ పిండితో చేసిన చిన్నచిన్న ముద్దలని బొగ్గులమీద కాల్చి, వంకాయ కూరతో పెడుతుంటారు. వారణాసిలో ఏ మూలకెళ్లినా వేడివేడి బట్టీ చోకాలు దొరుకుతాయి. **బనారసీ తండాయి;** చిక్కని పాలతో చేసిన లస్సీలు వివిధ రకాల పండ్ల ఫ్లేవర్లతో దొరకడం ఈ లస్సీల ప్రత్యేకం. **చూడా మేటర్:** అటుకులని వేయించి, పచ్చి బఠాణీలతో చేసే వంటకం ఇది. ఇంగువ, మిరియాలపొడి వేసి చేస్తే ఈ వంటకాన్ని పర్యటకులు చాలా ఇష్టంగా తింటారు. ▢

# ద్వారకలో తిలక్ మహాశయుడు

లోకమాన్యుడు 'స్వాతంత్ర్యము నా జన్మ హక్కు' అని గర్జించాడు. గర్జించుటే కాదు, అనేక యోగులను కూడా ధరించాడు ఆ విషయంలో. తిలక్ వస్తున్నాడు అన్నారు సాయి ద్వారకామాయిలో కూర్చుని. అందరూ వామన్ మహారాజ్ తిలక్ అనబడే యోగి వస్తున్నాడని అనుకున్నారు. ఆ రోజు మే 19, 1917. బాలగంగాధర తిలక్ రావటాన్ని చూచి అందరు అవాక్కయ్యారు. ఈ విషయాన్ని శ్రీ సాయి చరిత్ర రచయిత గ్రంథస్తం చేయలేదు. గ్రంథస్తం చేసిన వారిఒ ఒకరు కపర్దే వివరాలు ఇలా ఉన్నాయి.



ఆధ్యాత్మికం

మేము సంగమనేరులో పెద్ద లాయరైన పంత్‌గారి ఇంటినుండి షిరిడి 10 గంటలకు చేరి దీక్షిత్ వాడాలో బస చేసాము. అప్పటికే అక్కడ బాపూ సాహెబ్ బూటీ, నారాయణ రావు పండిట్ ఉన్నారు. నా పాత స్నేహితులు మాధవరావ్ దేశ్‌పాండే, జోగ్, ఇతరులు కూడా కలిసారు.



మేము మసీదుకు వెళ్లి సాయి మహారాజ్‌కు వందనములు తెలిపాము. ఆయన అంతగా ఆనందంగా ఉండటం ఇంతకు మునుపెన్నడూ మేము చూడలేదు. మామూలు ప్రకారం ఆయన దక్షిణ అడిగితే మేమంతా సమర్పించాం. సాయి తిలక్‌ను చూస్తూ మనుషులు చెడ్డవారు. నీ ఆలోచనలు గుప్తంగా ఉంచు అన్నారు. నేను నమస్కరించాను. ఆయన నా నుండి కొన్ని రూపాయలు తీసుకున్నారు. కేల్కర్, అక్కడ ఉన్న వారు కూడా దక్షిణ సమర్పించారు. మాధవరావు మేమంతా యావలా వెళ్లడానికి బాబాను అనుమతి వేడగా ఈ ఎండలో ఎందుకు వెళదామనుకుంటున్నారు? దోవలో చావటానికా? సాయంత్రం చల్లబడ్డ తరువాత వెళ్లండి శ్యామా! వీళ్లకు భోజనం పెట్టు అన్నారు సాయి. మాధవరావు ఇంట్లో భోజనం చేసి, కాసేపు విశ్రమించి మళ్లీ మసీదుకు వెళ్ళాం. సాయి మహారాజు నిద్రపోతున్నట్లు పడుకున్నారు. భక్తులు తిలక్‌కు చావడి దగ్గర తాంబూలం ఇచ్చారు. మళ్ళీ మేము మసీదుకు వెళ్ళాం. సాయి మహారాజు లేచి కూర్చొని మాకు ఊదీ ప్రసాదాన్ని ప్రసాదించి, మేము వెళ్ళటానికి అనుమతించారు. మేమందరము మోటారు వాహనంలో బయలుదేరి మా స్వస్థలాలకు వెళ్ళాం. సాయిబాబా ఆశీస్సులు సామాన్యుల పైనా, కుటుంబాలపైనే కాదు దేశ నాయకుల మీదా వారి ఆశీస్సులుంటాయి.

- యం.పి.సాయినాథ్

## యుఎస్ ఓపెన్.. లెజెండ్ వీనస్ విలియమ్స్ ఓటమి



**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్, మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్ ఓటమితో వీనస్ విలియమ్స్ జోడీ ప్రచారం ముగిసింది. న్యూయార్క్‌లో జరిగిన ఈ టర్నీలో అమెరికన్ లెజెండ్ వీనస్ విలియమ్స్, ఆమె కెనడా భాగస్వామి లేలా ఫెర్నాండెజ్ యుఎస్ ఓపెన్ మహిళల డబుల్స్ డ్రా నుండి నిష్క్రమించారు, తర్వాత నంబర్ 1 సీడ్ అమెరికన్ టేలర్ టౌన్సెండ్-చెక్ రిపబ్లిక్‌కు చెందిన కాటెరినా సినియాకోవా చేతిలో ఓడిపోయారు.

దీంతో టౌన్సెండ్-సినియాకోవా జంట వీనస్/ఫెర్నాండెజ్ జోడీని 6-1, 6-2 తేడాతో ఓడించి సెమీఫైనల్లోకి ప్రవేశించారు. డిఫెండింగ్ ఛాంపియన్స్, ఆల్ ఇటాలియన్ జట్టు సారా ఎర్రానీ, జాస్మిన్ పావోలిని వరుసగా యుఎస్ ఓపెన్ మహిళల డబుల్స్ టైటిళ్లను గెలుచుకునే అన్వేషణతో ఉండగా, వారి తుది స్కోరు, 61, 76(5). అలాగే మరో చోట, 3వ సీడ్ కెనడాకు చెందిన గాబ్రియేలా డబ్రోవ్స్కి-న్యూజిలాండ్‌కు చెందిన ఎరిన్ రౌట్‌లిఫ్ మొదటి సెట్‌ను 11వ సీడ్ హంగేరీకి చెందిన టిమియా బాబోస్-బ్రెజిల్‌కు చెందిన లూయిసా స్టెఫానీ చేతిలో 0-6 తేడాతో ఓడిపోయారు. 2023 యుఎస్ ఓపెన్ మహిళల డబుల్స్ ఛాంపియన్‌లైన ఈ అభిమాన ద్వయం రెండవ రెండు సెట్‌లను కైవసం చేసుకునే ప్రయత్నంలో డబ్రోవ్స్కి/రౌట్‌లిఫ్‌తో జరిగిన చివరి మ్యాచ్ స్కోరు 0-6, 6-4, 6-4గా ఉంది. ఇక వింబుల్డన్ ఛాంపియన్లు, 4వ ర్యాంక్ సీడ్లు వెరోనికా కుడెర్మెటోవా-జర్మనీకి చెందిన ఎలిస్ మెర్టెన్స్ 5వ ర్యాంక్ సీడ్లు మిర్రా ఆండ్రీవా-డయానా ష్నైడర్‌పై 6-4, 6-2 తేడాతో అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది.

## నంబర్ 1 వన్డే ఆల్ రౌండర్‌గా సికందర్



**న్యూఢిల్లీ:** హరారేలో శ్రీలంకతో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత జింబాబ్వేకు చెందిన సికందర్ రజా తాజా ఐసిసి పురుషుల ఒఐడీ ర్యాంకింగ్స్‌లో తొలిసారిగా ఆల్ రౌండర్ శిఖరాగ్రానికి చేరుకున్నాడు. ఈ ర్యాంకింగ్స్‌లో వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్న ఆఫ్ఘనిస్తాన్ జంట అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీలను అధిగమించాడు. రజా చేసిన 151 పరుగుల మొత్తం బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తొమ్మిది స్థానాలు ఎగబాకి 22వ స్థానానికి చేరుకున్నాడు. బౌలర్లలో కూడా అతను ఒక స్థానం ఎగబాకి 38వ స్థానానికి చేరుకున్నాడు. ఇక శ్రీలంక ఓపెనర్ పాతుమ్ నిస్సాంక ఏడు ఎగబాకి 13వ స్థానానికి చేరుకోగా, శ్రీలంకకు చెందిన జనిత్ లియానేజ్ (13 ఎగబాకి 29వ స్థానానికి), జింబాబ్వేకు చెందిన సీన్ విలియమ్స్ (3 ఎగబాకి 47వ స్థానానికి) చేరుకున్నారు. ప్రోటీస్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్ శ్రీలంక స్పిన్నర్ మహీష్ తీక్షణను ఓడించి ఏకైక నంబర్ 1 స్థానాన్ని దక్కించుకున్నాడు, జోఫ్రా ఆర్చర్ (ఆరు ఎగబాకి 19వ స్థానానికి) మరియు లుంగి న్గిడి (ఐదు ఎగబాకి 23వ స్థానానికి) మ్యాచ్ తర్వాత బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మెరుగయ్యారు. శ్రీలంకకు చెందిన అసిత ఫెర్నాండో ఆరు స్థానాలు ఎగబాకి 31వ స్థానానికి చేరుకోగా, దిల్షాన్ మధుశంక తొలి హరారే వన్డేలో 462తో మ్యాచ్ గెలిచేలా చేసిన హ్యాట్రిక్ అతనిని 60వ స్థానం నుండి 52వ స్థానానికి చేర్చింది. జాద్రాన్ 12 ఎగబాకి 20వ స్థానానికి చేరుకోగా, అటల్ 346 ఎగబాకి 127వ స్థానానికి చేరుకున్నారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్ బ్యాటర్ హసన్ నవాజ్ (రెండు ఎగబాకి 31వ స్థానానికి) ఎగబాకగా, సుఫియాన్ ముఖీమ్ (11 ఎగబాకి 22వ స్థానానికి), షాహీన్ అఫ్రిది (ఎనిమిది ఎగబాకి 26వ స్థానానికి, మహ్మద్ నవాజ్ (15 ఎగబాకి 43వ స్థానానికి) బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో పైకి ఎగబాకిన వారిలో ఉన్నారు.



## బుచ్చిబాబు ట్రోఫీ ఫైనల్‌కు హైదరాబాద్

**న్యూఢిల్లీ:** బుచ్చిబాబు ట్రోఫీ 2025లో హర్యానాను ఓడించి హైదరాబాద్ ఫైనల్‌కు చేరుకుంది. బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో హర్యానా కంటే హైదరాబాద్ మెరుగ్గా రాణించి ఫైనల్‌కు చేరుకుంది. 272 పరుగుల లక్ష్య ఛేదనలో డిఫెండింగ్ ఛాంపియన్ హర్యానాను 181 పరుగులకే కుప్పకూల్చడంతో ఎడమచేతి వాటం స్పిన్నర్ నితిన్ సాయి 44 పరుగులకు 7 వికెట్లు పడగొట్టాడు. మూడో రోజు ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు తీసిన నితిన్ సాయి, ఇన్నింగ్స్ అంతటా హర్యానా బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఓవర్‌నైట్ బ్యాటర్లు హిమాన్షు రాణా, లక్ష్య దలాల్ మర్నాడుమ్యాచ్‌ను ఉత్సాహంతో ప్రారంభించారు. ముఖ్యంగా ఎడమ చేతి వాటం స్పిన్నర్ అనికేత్‌పై బౌండరీలు బాదారు. మునుపటి ఇన్నింగ్స్‌లో హర్యానా తరఫున అత్యుత్తమ బ్యాట్స్‌మన్ హిమాన్షు మరోసారి సత్తా చూపించాడు. వారి భాగస్వామ్యం పెరిగేకొద్దీ, హర్యానా జట్టు లక్ష్యాన్ని ఛేదించడానికి మరింత కష్టపడాల్సి వచ్చింది. అయితే కెప్టెన్ రాహుల్ సింగ్ రెండు ఓవర్లు మాత్రమే వేగంగా బౌలింగ్ చేశాడు. లక్ష్య (91 బంతుల్లో 36) ఇచ్చిన బంతిని బంతితో స్లిప్‌లోకి తీసుకెళ్లాడు. ఆ తర్వాతి ఓవర్‌లో, హిమాన్షు (76 బంతుల్లో 46) రోహిత్ రాయుడు బౌలింగ్‌లో షార్ట్ లెగ్ వద్ద అద్భుతమైన క్యాచ్‌కు దొరికాడు. సుమిత్, ధీరు సింగ్ 84 బంతుల్లో 41 పరుగులు జోడించి హర్యానా ఆశలను సజీవంగాఉంచారు. అయితే, లంచ్‌తర్వాత, హర్యానా జట్టు ప్రతిఘటన విఫలమైంది. తర్వాత యశ్వర్ధన్ దలాల్ ధీరు (72 బంతుల్లో 35) స్టంప్‌లను కొట్టాడు. పార్థ్ వాట్స్ (40 బంతుల్లో 32) మూడు సిక్సర్లు మరియు రెండు ఫోర్లు బాదాడు, కానీ అనివార్యమైన విజయాన్ని ఆలస్యం చేశాడు. 4 వికెట్లకు 125 పరుగుల నుండి, హర్యానా మిగిలిన వికెట్లను కేవలం 56 పరుగులకే కోల్పోయింది.

## ఆసియా కప్‌లో హైటెన్షన్ మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** ఆసియా కప్-2025కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ నుండి ఈ టోర్నీ ప్రారంభం కానుంది. ఆసియాకప్ టోర్నీ లెక్కలేనన్ని ఉత్కంఠభరిత మ్యాచ్‌లను సృష్టించింది. అటువంటి ఆసియా కప్ చరిత్రలో అత్యంత హైటెన్షన్ కలిగిన మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్, ఇండియా 2018 ఫైనల్స్ ఒకటిగా ఉంది. 2018 ఫైనల్ నిజంగా ఒక క్లాసిక్. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ లిట్టన్ దాస్ చేసిన అద్భుతమైన 121 రన్స్ సాయంతో 222 పరుగులు చేసింది. కుల్దీప్ యాదవ్ 3/45 గణాంకాలతో రాణించాడు. రోహిత్ శర్మ 48 పరుగులు మాత్రమే అత్యధిక స్కోరు. ముఖ్యంగా కెప్టెన్‌గా రోహిత్‌కు ఇది తొలి బహుళజాతి టోర్నమెంట్. మిడిల్ ఆర్డర్ పతనం, దినేష్ కార్తీక్, ఎంఎస్ ధోని నెమ్మదిగా రాణించడంతో మ్యాచ్ ఫలితాన్ని తగ్గించింది. లాస్టోవర్లో 6 రన్స్ అవసరమైనప్పుడు, కేదార్ జాదవ్, కుల్దీప్ చివరి 3 వికెట్లు తేడాతో భారత్ నాటకీయ విజయాన్ని సాధించింది. ఇక 2014 ఎడిషన్‌లో అత్యంత గుర్తుండిపోయే ఆటలలో ఒకటైన బంగ్లాదేశ్, పాకిస్తాన్ మ్యాచ్. అనాముల్ హక్ సెంచరీ (100), ఇమ్రుల్ కాయేస్, మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్‌ల అర్ధ సెంచరీలతో 326 పరుగులు చేశారు. పాకిస్తాన్ ప్లేయర్స్ అహ్మద్ షెహజాద్ (103), మహ్మద్ హఫీజ్ (52), ఫవాద్ ఆలం (74), షాహిద్ అఫ్రిది (25 బంతుల్లో 59) అద్భుతమైన ఛేదనకు దోహదపడ్డారు. అల్ అమీన్ హుస్సేన్ బౌలింగ్‌తో మ్యాచ్ చివరి ఓవర్ వరకు కొనసాగింది. కేవలం ఒక బంతి మిగిలి ఉండగానే 3 వికెట్ల తేడాతో ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. ఇక భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ 2014 అంచనాలకు తగ్గట్టుగానే ఆడాయి. మొదట బ్యాటింగ్ చేసిన రోహిత్ శర్మ (56), అంబటి రాయుడు (58), రవీంద్ర జడేజా (52) సారథ్యంలో 245 పరుగులు చేసింది. కెప్టెన్ విరాట్ కోహ్లీ తన అంచనాలను అందుకోలేక ఉమర్ గుల్ చేతిలో 5 రన్స్‌కే ఔటయ్యాడు. పాకిస్తాన్ తరఫున సయీద్ అజ్మల్ తన 10 ఓవర్లలో 40 రన్స్‌కు 3 వికెట్లు పడగొట్టాడు. చివరి ఓవర్లో లక్ష్యాన్ని ఛేదించిన పాకిస్తాన్ ఇంకా రెండు బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. మహ్మద్ హాఫీజ్ 75 రన్స్, 2 వికెట్లు తీసుకుని కీలక ఆటగాడిగా నిలిచాడు. అయితే, మ్యాచ్‌లో నిజమైన హీరో షాహిద్ అఫ్రిది చివరి ఓవర్‌లో 2 రెండు సిక్సర్లు కొట్టి మెన్ ఇన్ గ్రీన్ జట్టుకు విజయాన్ని అందించాడు.









## దక్షిణాఫ్రికా ఏకపక్ష విజయం

### 175 బాల్స్ ఉండగానే ఇంగ్లాండ్ చిత్తు

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా ఇంగ్లాండ్ పర్యటనను విజయంతో ప్రారంభించింది. 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో జరిగింది. టాస్ ఓడిన తర్వాత, మొదట ఆడుతున్నప్పుడు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ కేవలం 131 పరుగులకు కుదించబడింది. దక్షిణాఫ్రికా దూకుడుగా బ్యాటింగ్ చేసి 20.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో గెలిచింది. ఇంగ్లాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో పేలవమైన ఆరంభాన్ని నమోదు చేసింది. బెన్ డకెట్ మూడో ఓవర్‌లోనే ఔటయ్యాడు. దీని తర్వాత, జో రూట్, జేమీ స్మిత్ రెండో వికెట్‌కు 32 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రూట్ 14 పరుగులు చేసి పెవిలియన్‌కు వచ్చాడు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ 12 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. ఈలోగా జేమీ స్మిత్ తన అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 48 బంతుల్లో 54 పరుగుల ఇన్నింగ్స్ ఆడి అతను ఔటయ్యాడు. దీని తర్వాత, వికెట్లు పడటం ప్రారంభించాయి. ఇంగ్లాండ్ జట్టులోని చివరి 7 మంది బ్యాట్స్‌మెన్ 29 పరుగులు చేసిన తర్వాత ఔటయ్యారు. ఏడుగురు ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ రెండంకెల మార్కును చేరుకోలేకపోయారు. దక్షిణాఫ్రికా తరఫున కేశవ్ మహారాజ్ 4 వికెట్లు పడగొట్టగా, వియాన్ ముల్డర్ 3 వికెట్లు పడగొట్టాడు. ఇక ఐడెన్ మార్క్రామ్ దక్షిణాఫ్రికాకు విస్ఫోటనకరమైన ప్రారంభాన్ని ఇచ్చాడు. తొలి ఓవర్లోనే, మార్క్రామ్ అరంగేట్ర ఆటగాడు సోనీ బేకర్ పై 3 ఫోర్లు కొట్టాడు. అతను కేవలం 23 బంతుల్లోనే అర్ధశతకం బాదాడు. అయితే, ర్యాన్ రికెల్టన్ 55 బంతుల్లో 86 పరుగులు చేసిన తర్వాత, మార్క్రామ్‌ను ఆదిల్ రషీద్ అవుట్ చేశాడు. విజయానికి ముందు, రషీద్ వరుసగా రెండు బంతుల్లో కెప్టెన్ బావుమా, ట్రిస్టన్ స్టబ్స్‌ను అవుట్ చేశాడు. కానీ డెవాల్డ్ బ్రెవిస్ వచ్చిన వెంటనే ఒక సిక్స్ కొట్టి తన జట్టుకు విజయాన్ని అందించాడు.

## గడువు సమీపిస్తున్న ఐటీఆర్!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** రిటర్నులు ఫైల్ చేసేందుకు గడువు సమీపిస్తోంది. అయితే, మరింత సమయం ఇవ్వాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం ఎలాంటి నిర్ణయం తీసుకోనుంది, 2025, మే నెలలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఐటీ రిటర్నులు ఫైల్ చేసేందుకు గడువును జూలై 31 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు పెంచిన సంగతి తెలిసిందే. సాంకేతిక, నిర్వహణ కారణాలతో గడువు పొడిగించినట్లు చెప్పింది. ఐటీఆర్ ఫారుల, యుటిలిటీల్లో చాలా మార్పులు చేసింది. అదనంగా 46 రోజుల పాటు గడువు పొడిగించడం అనేది ట్యాక్స్ పేయర్లు సన్నద్ధమయ్యేందుకు సరిపోతుందని పేర్కొంది. మరోసారి ఐటీఆర్ గడువు పొడిగించాలని ట్యాక్స్ పేయర్లు, ఛార్టర్డ్ అకౌంటెంట్లు, ట్యాక్స్ కన్సల్టెంట్లు డిమాండ్ చేస్తున్నారు. ఐటీఆర్ ఫారాలను ఆలస్యంగా విడుదల చేయడం, ఎక్సెల్ యుటిలిటీల్లో జాప్యం, సాంకేతిక సమస్యలు, ఇఫైలింగ్ పోర్టల్‌లో ఇబ్బందులు, ఆర్థిక వివరాల్లో తేడాల వంటి కారణాలు చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఐటీఆర్ ఫైల్ చేస్తున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. జూలై 31, 2024 వరకే 7 కోట్లకుపైగా ఐటీ రిటర్నులు ఫైల్ అయ్యాయి. కానీ ఈసారి చాలా తక్కువగా రావడం గమనార్హం. ఈ క్రమంలో సెప్టెంబర్ 2వ తేదీ వరకు ఎన్ని రిటర్నులు ఫైల్ అయ్యాయి, ఎన్ని వెరిఫై చేశారు, ఎన్ని ప్రాసెస్ అయ్యాయి అనే గణాంకాలు తెలుసుకుందాం. ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం అధికారిక వెబ్‌సైట్‌లోని గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 2, 2025 నాటికి మొత్తం 4,35,441 ట్యాక్స్ రిటర్నులు ఫైల్ అయ్యాయి. వీటిల్లో 4,12,74,275 రిటర్నులను ట్యాక్స్ పేయర్లను వెరిఫై చేశారు. అయితే, అందులో కేవలం 2,92,10,555 రిటర్నులను మాత్రమే ట్యాక్స్ విభాగం ప్రాసెస్ చేసింది. ఇంకా కోటికిపైగా ప్రాసెస్ చేయాల్సి ఉంది. వివిధ కారణాలతో ప్రాసెస్ జాప్యం జరుగుతున్నట్లు ఐటీ విభాగం చెబుతోంది. అలాగే ఐటీఆర్ ఫైల్ చేసిన తర్వాత్ దానిని ఇవెరిఫై చేసేందుకు ట్యాక్స్ పేయర్లకు 30 రోజుల గడువు ఉంటుంది. ఆలోపు వెరిఫై చేస్తేనే దానిని వాలిడ్ ఐటీఆర్‌గా ట్యాక్స్ విభాగం పరిగణించి ప్రాసెస్ చేస్తుంది. గత ఆర్థిక సంవవత్సరం గణాంకాలు ఓసారి పరిశీలిస్తే గడువు తేదీ జూలై 31, 2024 నాటికి మొత్తం 7.28 కోట్ల ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఫైల్ అయ్యాయి. మొత్తం ఏడాదిలో 9.19 కోట్ల ట్యాక్స్ రిటర్నులు ఫైల్ కావడం గమనార్హం. అయితే, ఈసారి భారీగా తగ్గవచ్చన్న అంచనాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు ట్యాక్స్ రిబేట్ కల్పిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో చాలా మంది ట్యాక్స్ కట్టాల్సిన అవసరం లేకుండా పోయింది. దీంతో గతంలో రిటర్నులు ఫైల్ చేసిన చాలా మంది ఇప్పుడు చేయకపోవచ్చని ట్యాక్స్ నిపుణులు చెబుతున్నారు.



## ఐపిఒకు అర్బన్‌కంపెనీ, బోట్ కంపెనీలు

### 11 కంపెనీల ఐపిఒలు రూ.15వేల కోట్లు టార్గెట్

వాణిజ్యం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** ఈవారంలో 11కంపెనీలు ఐపిఒలు జారీచేసుకునేందుకు స్టాక్‌ఎక్ఛేంజిల నియంత్రణ బోర్డు సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఐపిఒల ద్వారా మొత్తం 15 వేల కోట్ల నిధులు సమీకరించేందుకు కంపెనీలు మాయత్తం అవుతున్నాయి. స్టాక్ ఎక్ఛేంజిల్లో లిస్టింగ్ అయ్యేందుకు సెబీ ఇటీవలే చిన్న కంపెనీలను కూడా ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో భాగంగా ప్రముఖ కంపెనీ అర్బన్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. మరో ఎలక్ట్రానిక్స్ కంపెనీ బోట్స్ కూడా ఐపిఒకు వస్తోంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతులు లభించాయి. రూ. 1,900 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఐపీఓకు వస్తోంది.

మంచి గ్రోత్ ఉన్న రంగాల్లో వ్యాపారం నిర్వహిస్తోన్న కంపెనీల్లో ఒకటైన అర్బన్ కంపెనీ ఐపీఓ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించింది. ఈ ఐపీఓ ద్వారా రూ. 472 కోట్లు విలువైన తాజా ఈక్విటీ షేర్లు జారీ చేస్తున్నారు. రూ.1,428 కోట్లు విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నట్లు అర్బన్ కంపెనీ తెలిపింది. ఇక ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 10, 2025 రోజున ప్రారంభమవుతోంది. సెప్టెంబర్ 12వ తేదీ వరకు కొనసాగుతుంది. ఆసక్తి ఉన్న ఇన్వెస్టర్లు మూడు రోజులు బిడ్డింగ్‌లో పాల్గొనొచ్చు. సెప్టెంబర్ 15వ తేదీన షేర్లు కేటాయింపు ఉంటుంది. ఇక స్టాక్ మార్కెట్ లిస్టింగ్ సెప్టెంబర్ 27వ తేదీన జరుగుతుంది.

ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా కోటక్ మహీంద్రా క్యాపిటల్ కో లిమిటెడ్ వ్యవహరిస్తోంది. అలాగే ఎంయూఎఫ్‌జీ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తోంది. వినియోగదారులు తమ ఇంటి క్లీనింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్క్, గృహోపకరణాల మరమతు, బ్యూటీ చికిత్సలు, మసాజ్ థెరపీ వంటి సర్వీసులు అందిస్తోంది. నేటివ్ బ్రాండ్ పేరుతో హోమ్ సొల్యూషన్స్ అందిస్తోంది ఈ కంపెనీ. వాటర్ ప్యూరిఫయర్లు, ఎలక్ట్రానిక్ డోర్ లాక్స్ సైతం అందిస్తోంది. అలాగే బోట్ కంపెనీ కూడా రూ.2వేల కోట్ల నిధులు సేకరించేందుకు సెబీనుంచి అనుమతులు పొందింది.



## లాభాల్లో దూసుకెళ్లిన సెన్సెక్స్ నిఫ్టీ

**ముంబయి, సెప్టెంబరు 3:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. పరోక్ష పన్నుల వ్యవస్థలో ఇకపై రెండే రెండు శ్లాబులను ఏర్పాటుచేయాలన్న నిర్ణయంతో జరుగుతున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంపై ఇన్వెస్టర్లు, ట్రేడర్లు ఎక్కువ ఫోకస్ పెంచారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ సమావేశం ఫలితాలపై ట్రేడర్లు ఆసక్తిచూపించారు. జీఎస్టీ స్లాబులను మార్చానున్నట్లు ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన విషయం తెలిసిందే. కౌన్సిల్ నిర్ణయానికి ముందు ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ఈ క్రమంలో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. ఏప రంగాలకు లాభం చేకూరుతుందన్న అంశాలపైనే ట్రేడర్లు ఎక్కువ ఆశచూపించారు. క్రితం సెషన్‌తో పోలిస్తేసెన్సెక్స్ 80,295.99 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,004.60 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్..గరిష్ఠంగా80,671.28 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 409.83 పాయింట్ల లాభంతో 80,567.71 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 135.45 పాయింట్లు పెరిగి 24,715.05 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,415 షేర్లు లాభపడగా..1,333 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో టాటా స్టీల్, హిందాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, కోల్ ఇండియా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, ఎంఅండ్‌ఎం, ట్రెంట్, ఐటీసీ, ఎటర్నల్, టాటా మోటార్స్ లాభాల్లో కొనసాగాయి. ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎన్‌టీపీసీ, విప్రో, హెచ్‌యూఎల్, టీసీఎస్, నెస్లే, టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్ నష్టాల్లో కొనసాగాయి.

## సంచార్‌సాథీతో 2కోట్ల మొబైల్‌ఫోన్లు కట్!

### డివోటి కార్యదర్శి నీరజ్ మిట్టల్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 3:** మోసాలకు పాల్పడుతున్నారన్న అభియోగాలపై దేశంలో మొత్తం రెండుకోట్లకుపైగా ఫోన్ కనెక్షన్లను బ్లాక్‌చేసినట్లు కేంద్ర టెలికమ్యూనికేషన్ శాఖ డాట్ కార్యదర్శి నీరజ్ మిట్టల్ తెలిపారు. సంచార్‌సాథీతో ఇలాంటి వాటికి అడ్డుకట్టవేసామన్నారు. దక్షిణగోవాలో డివోటీ నిర్వహించిన సమావేశంలో ఆయన వర్చువల్‌ప్రసంగించారు. దేశంలో సైబర్‌భద్రతను పెంచేందుకు డివొటి అనేక చర్యలుచేపట్టిందన్నారు. ప్రతి రంగంలోనూ టెలికాం పాత్రపెరిగిందని, వినియోగార్లు సంఖ్య పెరిగినట్లే ఆర్తిక రంగంలో టెలికాం వనరుల దుర్వినియోగంకూడా పెద్ద ఎత్తున నమోదవుతోందన్నారు. ఆర్థిక సంస్థలకు ఉపకరించే డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌ను డివోటి అభివృద్ధిచేసిందని, ఇది సైబర్ సురక్షిత వాతావరణం అందిస్తున్నట్లుమిట్టల్ తెలిపారు. డివోటి కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థను కూడా అప్‌గ్రేడ్‌చేస్తున్నట్లు మిట్టల్ తెలిపారు.

## వింటేజ్ జాబితాలోకి ఐఫోన్ పాత మోడళ్లు!

**ముంబయి, సెప్టెంబరు 3:** ప్రముఖ కంపెనీ ఆపిల్ త్వరలోనే ఐఫోన్ 17 సిరీస్‌ను లాంచ్ చేస్తున్న క్రమంలో పాత ఐఫోన్లు, ఐప్యాడ్లు, మ్యాక్‌లను 'వింటేజ్', ఆబ్సోలేట్' జాబితాలో చేర్చింది. ఆపిల్ ఈ విధానాన్ని చాలాకాలంగా అమలు చేస్తున్నది. పాత డివైజెస్‌ను దశలవారీగా సేవల నుంచి తొలగిస్తూ యూజర్లు కొత్త మోడల్స్‌కు మారేలా కంపెనీ ప్రోత్సహిస్తుంది. ఐఫోన్ ఎక్స్‌ఎస్, ఐఫోన్ 8 ప్లస్‌లను 'వెంటేజ్' జాబితాలో చేర్చింది. కంపెనీ ఐదు నుంచి 7 సంవత్సరాల కిందట డిస్‌కంటిన్యూ చేసిన డివైజ్‌లు వింటేజ్ లిస్ట్‌లోకి వెళ్తాయి. ఐఫోన్ ఎక్స్‌ఎస్ సెప్టెంబర్ 2018లో లాంచ్ అయ్యాక 2019లో ఆపేసింది. పెద్ద వేరియంట్ అయిన ఐఫోన్ ఎక్స్‌ఎస్ మాక్స్‌ని ఇప్పటికే 2004 నవంబర్‌లో వింటేజ్ లిస్టులో చేర్చింది. ఐఫోన్ 8 ప్లస్, 2017లో విడుదలైన ఈ ఫోన్ ఇప్పుడు అదే జాబితాలోకి వెళ్లింది. వింటేజ్ కేటగిరిలో ఉన్న ఫోన్లకు అధికారిక ఆపిల్ సర్వీసెస్ సెంటర్లలో మరమ్మతులు చేస్తే మాత్రమే అయ్యేందుకు అవసరమైన పార్ట్స్ అందుబాటులో ఉన్నంత వరకు సేవలు లభిస్తాయి. ఇక ఐపాడ్ 5ని ఆపిల్ ఇప్పుడు ఆబ్సోలెట్ జాబితాలో చేరింది. ఈ జాబితాలో ఉన్న డివైజ్‌లకు అధికారిక సేవలు, స్పేర్ పార్ట్స్, రిపేర్ చేసే అవకాశం ఉండదు. అలాంటి వినియోగదారులు ఇక థర్డ్ పార్టీ రిపేర్ షాపులపైనే ఆధారపడాల్సి ఉంటుంది. అదే సమయంలో మ్యాక్ మిని సైతం ఇప్పటికే వింటేజ్ జాబితాలో ఉంది. దాని అర్థం ఐఫోన్ ఎక్స్‌ఎస్‌లాంటి మోడల్స్‌కు భవిష్యత్తులో ఎలాంటి అధికారిక సపోర్ట్ ఉండదు. ఐఫోన్ ఎక్స్‌ఎస్, ఐఫోన్ 8 ప్లస్ వాడుతున్న యూజర్లు అంతా యథావిధిగా వాడుకోవచ్చు. కానీ, భవిష్యత్‌లో విడిభాగాలు దొరకడం కష్టంగా మారుతుంది. కానీ, మరమ్మతులు చేయడం కష్టం అవుతుంది. ఐపాడ్ 5 వినియోగదారులకు ఇక ఆపిల్ వైపు నుంచి ఎలాంటి సపోర్ట్ ఉండదు. మ్యాక్ మిని 2018 వాడుతున్నవారు ప్రతిసారి సర్వీస్ సపోర్ట్ కోరే ముందు సంబంధిత సెంటర్లలో అందుబాటులో పార్ట్స్ ఉన్నాయా లేదా అనేది ముందుగా తెలుసుకోవాల్సి ఉంటుంది.



## రూ.1.10 లక్షలకు చేరనున్న తులం బంగారం!

### ఐసిఐసిఐ రీసెర్చి గ్రూప్ అంచనా



**ముంబయి, సెప్టెంబరు 3:** పసిడి ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇస్తున్నాయి. ఇటీవల వరుసగా పెరుగుతూ వస్తూ సరికొత్త గరిష్ఠాలను తాకాయి. రాబోయే రోజుల్లోనూ బంగారం ధరలు పెరుగుతూనే ఉంటాయని ఐసీఐసీఐ బ్యాంక్ ఎకనామిక్ రీసెర్చ్ గ్రూప్ వెల్లడించింది. ఈ ఏడాది బంగారం తులానికి రూ.99,500 నుంచి రూ.1.10లక్షల మధ్య ట్రేడవుతుందని అంచనా. వచ్చే ఏడాది తొలి అర్ధభాగం వరకు ధర తులం ధర రూ.1.10లక్షల నుంచి రూ.1.25లక్షలకు పెరుగుతుందని పేర్కొంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అంచనా వేసిన దానికంటే బలహీనపడితే అదనపు నష్టాలు వచ్చే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఈ సమయంలో సగటు డాలర్ రూపాయి మారకం రేటు రూ.87 నుంచి రూ.89 మధ్య ఉంటుందని అంచనా. ఈ ఏడాది ఇప్పటి వరకు బంగారం ధరలు దాదాపు 33శాతం పెరిగాయి. యూఎస్ ఫెడర్ రిజర్వ్ ద్రవ్య విధాన పరిమితి సడలింపు, ఆర్థిక వ్యవస్థపై సంస్థాగత ఆందోళనలు బంగారం పెరుగుదలకు దన్నుగా నిలుస్తున్నాయి. ఈ ఏడాదిలో ప్రపంచ బులియన్ సగటున ఔన్స్‌కు 3400 నుంచి 3600 డాలర్ల వరకు ఉంటుందని అంచనా. 2026 తొలి అర్ధభాగంలో ఔన్స్‌కు 3,600 నుంచి 3,800 డాలర్ల దాకా వరకు పెరుగుతుందని విశ్లేషకుల అంచనా. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక బలహీనతలపై కొనసాగుతున్న ఆందోళన కారణంగా మధ్యస్త కాలంలో బంగారం ధరలు పెరుగుతూనే ఉంటాయని భావిస్తున్నారు. సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నా బంగారం కొనుగోలు స్వల్ప తగ్గుదల ఉన్నప్పటికీ గోల్డ్ పెరిగే అంచనాలు అలాగే ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. భారతదేశ దిగుమతులు జూన్లో 1.8 బిలియన్ డాలర్ల నుంచి జులై 2025లో 4.0 బిలియన్ డాలర్లకు పెరిగాయి. పండుగల సీజన్‌కు ముందు బలమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ దాది గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు రెట్టింపయ్యాయి. గోల్డ్ ఎక్స్ఛేంజ్‌ట్రేడెడ్ ఫండ్స్ (ఇటిఎఫ్)లో పెట్టుబడిదారుల ఆసక్తి స్పష్టంగా కనిపించిందని కూడా నివేదిక పేర్కొంది. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఆంఫీ) డేటాను ఉదహరించింది. జూలైలో రూ.12.6 బిలియన్ల నికర పెట్టుబడి పెట్టినట్లు నివేదిక చూపించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.